
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 28-1-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 27 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

హమాస్‌తో యుద్ధం చేసేందుకే..

- ఉద్యోగాల వంకతో ఇజ్రాయిల్‌కు భారతీయులు : కేంద్రంపై మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ : గత కొన్ని నెలలుగా ఇజ్రాయెల్ హమాస్ యుద్ధం కొనసాగుతున్నది. ఈ యుద్ధం వల్ల వేలాది మంది పాలస్తీనియన్లు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారతదేశంలో గ్రామీణ పేదరికం పెరిగినందువల్ల ఉద్యోగాలులేని వారిని ఆ యుద్ధం కోసం ఇజ్రాయెల్‌కు పంపించాలని కేంద్రం చూస్తోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దేశంలో గ్రామీణ కష్టాలు తీవ్రంగా ఉన్నాయని, అందువల్ల జరుగుతున్న యుద్ధంలో ప్రజలు తమ ...13లో



బీజేపీలో చేరితే పాతిక కోట్లు

- ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలతో బేరసారాలు
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన ఆరోపణ
- మమ్మల్ని ఓడించే సత్తా లేకనే తెరచాటు ప్రయత్నాలు

వివరాలు 13లో



యూపీలో సీట్ల సర్దుబాటులో తొలి అడుగు

- కాంగ్రెస్‌తో చర్చల్లో 11 స్థానాలపై పురోగతి : అఖిలేష్

వివరాలు 13లో

త్వరలో కుల గణన



కళ్యాణలక్ష్మి లబ్దిదారులకు నగదుతో పాటు తులం బంగారం

- నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్
- గురుకుల భవనాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు
- గ్రీన్ ఛానల్ ద్వారా డైట్, కాస్మోటిక్ చార్జీల చెల్లింపు : బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ విభాగాల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, షబ్బీర్ అలీ తదితరులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"రాష్ట్రంలో త్వరలోనే కుల గణన చేపడతాం. ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకిచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ సమావేశాల్లో ఇందుకు సంబంధించి బిల్లు ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నాం. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్‌ను రూపొందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. కుల గణనకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలల పూర్తి వివరాలను అందించాలని సూచించారు. వీటికి సొంత భవనాలను నిర్మించేందుకు ఎంత ఖర్చవుతుందో విడివిడిగా ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణానికి సరిపడే స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు, వంట బిల్లులు పెండింగ్ లేకుండా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేయాలని అన్నారు. మహాత్మ జ్యోతిభాపూలే ఓవర్ సీస్ స్కాలర్ షిప్ స్కీమ్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. అత్యున్నత విదేశీ యూనివర్సిటీలను గుర్తించి వాటిలో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఈ స్కీమ్ లో మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సంక్షేమ గురుకుల విద్యా ...13లో

కాళేశ్వరంపై నిపుణుల కమిటీ

- కృష్ణా జలాలు, ప్రాజెక్టులపై త్వరలో అఖిలపక్షం
- మూడు బ్యారేజీలపై సమగ్ర అధ్యయనం
- నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు
- తక్కువ ఖర్చులో ఎక్కువ ఆయకట్టుకు ప్రాధాన్యం: సాగునీటిశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 5లో



ఇక ఆటే మిగిలింది..

- బీహార్ పరిణామాలపై తేజస్వి రియాక్షన్

పాట్నా: బీహార్‌లో తలెత్తిన రాజకీయ సంక్షోభం ఉత్కంఠ రేపుతున్నది. ఆర్జేడీ, కాంగ్రెస్‌తో కూడిన 'మహాఘట్‌బంధన్'కు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ గుడ్‌బై చెప్పి బీజేపీ సారథ్యంలోని 'జాతీయ ప్రజాస్వామ్య కూటమి'లో చేరనున్నారన్న ఊహాగానాలపై ఆర్జేడీ నేత, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ తొలిసారి స్పందించారు. 'ఇక ఆట మొదలుకావడమే తరువాయి' అని పాట్నాలో ఆర్జేడీ ఎమ్మెల్యేలతో శనివారంనాడు ఏర్పాటు చేసిన అత్యవసరం సమావేశంలో తేజస్వి వ్యాఖ్యానించారు. లాలూప్రసాద్ యాదవ్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో తేజస్వి, ఆర్జేడీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం, పార్టీ నేతలతో తేజస్వి మాట్లాడుతూ.. 'మహాఘట్‌బంధన్'లో భాగస్వామిగా ఉన్న ఆర్జేడీ ఎప్పుడూ ఆయనను గౌరవిస్తూనే ఉంది. ముఖ్యమంత్రి నా సీటు పక్కనే కూర్చుని... 2005కు ముందు బీహార్‌లో ఏముండేది? అని ప్రశ్నించేవారు. అయినా నేనెప్పుడూ స్పందించ లేదు. ఇప్పుడు మరింత మంది మనతో ఉన్నారు. రెండు దశాబ్దాలలో చేయనటువంటి పనులు అతి తక్కువ కాలంలోనే మనం చేశాం. ఉద్యోగాలు, కులగణన, రిజర్వేషన్ల పెంపు వంటివి ఎన్నో చేశాం. బీహార్‌లో ఇప్పుడు ఆట మొదలు కావడమే తరువాయి" అని తేజస్వి అన్నారు.

పరిస్థితి ఎటు తిరిగి ఎటు వచ్చినప్పటికీ మనమంతా ప్రజల కోసం పని చేయాలని, ఉద్యోగాల కల్పన, ఉపాధి అవకాశాలతో సహా మనం చేసిన పనులను ప్రజల వద్దకు తీసుకు వెళ్లి వారిని చైతన్యవంతులను చేయాలని ఆర్జేడీ ఎమ్మెల్యేలకు తేజస్వి దిశానిర్దేశం చేశారు. ప్రజాశక్తి కారణంగానే ...13లో

ఎప్‌సెట్ కన్వీనర్‌గా డీన్‌కుమార్

ఐసెట్‌కు ఎస్ నర్సింహ్మాచారి

- మూడు ప్రవేశ పరీక్షలకు మారిన కన్వీనర్లు
- ప్రకటించిన ఉన్నత విద్యామండలి



డీన్‌కుమార్



ఎస్ నర్సింహ్మాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా వివిధ వృత్తి విద్య ఇతర కోర్సుల్లో ప్రవేశాల కోసం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలకు సంబంధించిన కన్వీనర్లను ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఈ ఏడాది పీజీఈసెట్, ఐసెట్, ఎడ్‌సెట్ మూడు ప్రవేశ పరీక్షల కన్వీనర్లను మార్చింది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ బి డీన్‌కుమార్‌ను తిరిగి నియమించింది. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ కన్వీనర్‌గా కేయూ ప్రొఫెసర్ ఎస్ నర్సింహ్మాచారిని ఎంపిక చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు, చైర్మెన్ ఆర్ లింబాద్రి కన్వీనర్ల పేర్లను శనివారం ప్రకటించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీఈసెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ ఎ అరుణకుమారిని నియమించామని తెలిపారు. లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ బి విజయలక్ష్మి, బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీఈసెట్ కన్వీనర్‌గా శాతవాహన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజేష్‌కుమార్‌ను తిరిగి నియమించారు. బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ కన్వీనర్‌గా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ...13లో

మేడారం జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మేడారం సమ్మక్క, సారాలమ్మ జాతర పోస్టర్‌ను శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

మేడారం జాతరకు తరలివచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో ఆ శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జాతర ప్రాంగణంలో అవసరమైన మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సాయం అందించడానికి అంబులెన్స్‌లను సిద్ధం చేసుకోవడంతో పాటు డాక్టర్లు, వైద్య సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార కల్తీ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతర ముగింపు వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు.

బీఆర్ఎస్‌లో ఆ మూడు ఎంపీ సీట్లకు

ఫుల్ డిమాండ్

మెదక్, సికింద్రాబాద్, మల్కాజిగిరి స్థానాలకు తీవ్ర పోటీ

- ఆయా సీట్లలో ఎక్కువ ఎమ్మెల్యే స్థానాలు గెలవటమే కారణం
- ఇతర సీట్లను ఆశిస్తున్న వారు కొద్దిమందే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి మూడు నియోజకవర్గాలకు ఫుల్ డిమాండ్ పెరిగింది. ఆయా టిక్కెట్లను దక్కించుకునేందుకు నేతలు, ఆశావహులు అధిష్టానం చుట్టూ తిరుగుతున్నారు. అధినేత కేసీఆర్‌ను ప్రసన్నం చేసుకోవటం ద్వారా టిక్కెట్లు పొందేందుకు తహతహలాడుతున్నారు. మెదక్, సికింద్రాబాద్, మల్కాజిగిరి స్థానాలపై వారు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ మూడు ఎంపీ సీట్ల నుంచి అత్యధిక మంది బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేలుగా గెలవటమే దీనికి కారణం. మెదక్ పరిధిలో మొత్తం ఏడు స్థానాలకుగాను ఆరు సీట్లను గులాబీ పార్టీ కైవసం చేసుకుంది. మల్కాజిగిరి పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏడింటిలోనూ బీఆర్ఎస్ గెలుపు జెండా ఎగరేసింది. సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను కారు పార్టీ ఆరు స్థానాల్లో గెలిచింది. అందువల్ల ఆయా ఎంపీ సీట్ల నుంచి పోటీ చేస్తే స్థానిక ఎమ్మెల్యేల అండతో సునాయాసంగా గెలవొచ్చని నేతలు భావిస్తున్నారు. అందువల్ల ఆ మూడు నియోజకవర్గాల టిక్కెట్లను దక్కించుకునేందుకు వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

మొదటి నుంచి గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న మెదక్ నుంచి మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వెంకటరామిరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, సీనియర్ నేతలు వంటేరు ప్రతాపరెడ్డి, గాలి అనిల్‌కుమార్ ...13లో

హాస్టల్ విద్యార్థినుల బాత్‌రూంలోకి దుండగులు..

ఒకరిని పట్టుకుని దేహశుద్ధి

- సికింద్రాబాద్ ఓయూ పీజీ కళాశాల హాస్టల్‌లో ఘటన
- రక్షణ కల్పించాలని విద్యార్థినుల ఆందోళన



నవతెలంగాణ- బేగంపేట్

సికింద్రాబాద్ ప్రభుత్వ పీజీ కళాశాల విద్యార్థినుల హాస్టల్ బాత్‌రూంలో ముగ్గురు ఆగంతకులు చొరబడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. వారిలో ఇద్దరు పరార్ కాగా ఒకరిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దాంతో విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.. ఓయూ పీజీ కాలేజ్ ...13లో

పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చూపుతాం

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపెడతామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమీక్ష సమావేశం శనివారం హైదరాబాద్ యూసఫ్‌గూడలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో 14 ఎమ్మెల్యే సీట్లు కోల్పోయామని, చిన్న, చిన్న పొరపాట్ల ...13లో



ఒకటిన అసెంబ్లీకి గులాబీ బాస్

- ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్న కేసీఆర్

వివరాలు 5లో

కార్యదర్శులకే.. పంచాయతీ పగ్గాలు

ప్రత్యేక అధికారులుగా నియామకం... కలెక్టర్లకు అందిన ఉత్తర్వులు

- పర్సన్ ఇన్‌చార్జీల పాలన సాధ్యం కాదన్న ప్రభుత్వం
- అవినీతి, అక్రమాల మరక అంటకుండా జాగ్రత్త

ఫిబ్రవరి 1 నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన

నవతెలంగాణ - మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కార్యదర్శులకే పంచాయతీల పగ్గాలు అప్పజెప్పనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. పంచాయతీ వ్యవహారాలను చక్కదిద్దే బాధ్యతను కార్యదర్శులకే కట్టబెట్టేందుకు ప్రభుత్వం మొగ్గుచూపింది. ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమలు చేసేందుకుగాను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. ఆయా జిల్లా కలెక్టర్లకు ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. గ్రామపంచాయతీల ఐదేండ్ల పదవీకాలం ఈనెల 31తో ముగియనున్న నేపథ్యంలో వాటి నిర్వహణ బాధ్యతలు, పరిపాలన వ్యవహారాల్లో కొనసాగుతున్న కార్యదర్శులకే ఇవ్వడం మంచిదని ప్రభుత్వం భావించింది. మరోపక్క ప్రస్తుత సర్పంచ్‌లు మాత్రం తమకే పదవీ కాలం రెండేండ్లు పొడిగించి పర్సన్ ఇన్‌చార్జీల పాలన తేవాలని కోరారు. అయితే సర్పంచుల ఐదేండ్ల పదవి కాలంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాల మరకను తమకు అంటకుండా ప్రభుత్వం జాగ్రత్త పడినట్టు సమాచారం. అందుకే సర్పంచ్‌ల ...5లో



ఫ్లిప్‌కార్ట్ నుంచి బిన్నీ బన్సల్ అవుట్

వాల్‌మార్ట్ చేతికి మిగిలిన వాటాలు



న్యూఢిల్లీ : ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు బిన్నీ బన్సల్ ఆ సంస్థ నుంచి పూర్తిగా వైదొలిగారు. ఆయన వాటాలను పూర్తిగా అమెరికన్ సంస్థ వాల్‌మార్ట్ ఇండియా స్వాధీనం చేసుకుంది. 2007లో బిన్నీ బన్సల్, సచిన్ బన్సల్ కలిసి బెంగళూరులో ఫ్లిప్‌కార్ట్‌ను స్థాపించారు. 2018లో ఫ్లిప్‌కార్ట్‌లోని 77 శాతం మెజారిటీ వాటాలను 16 బిలియన్ డాలర్ల (రూ.1.30 లక్షల కోట్లు)కు వాటాలను కొనుగోలు చేసింది. ఆ తర్వాత బన్సల్‌కు ఇందులో 1-1.8 శాతం మాత్రమే వాటాలు మిగిలాయి. ఆ వాటాలను కూడా తాజాగా వాల్‌మార్ట్ 1-1.5 బిలియన్ డాలర్లు (రూ.8వేల-12వేల కోట్లు)తో కొనుగోలు చేసిందని సమాచారం. బిన్నీ బన్సల్ ఇప్పటి వరకు దాదాపు 92 సంస్థల్లో పెట్టుబడులు పెట్టారు. అందులో అక్కో, అన్‌అకాడమీ, యులు లాంటి సంస్థలున్నాయి. "గడిచిన 16 ఏళ్లలో ఫ్లిప్‌కార్ట్ అనేక లక్ష్యాలను సాధించింది. అందులో నా భాగస్వామ్యం ఉండటం గర్వంగా ఉంది. ప్రస్తుత నాయకత్వ బృందం మున్ముందు కూడా అనేక విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను." అని బిన్నీ బన్సల్ పేర్కొన్నారు. బన్సల్ జనవరి 2న ఓప్‌డోర్ పేరుతో కొత్త ఇ-కామర్స్ స్టార్టప్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నెలకొన్న విభేదాల వల్ల ఫ్లిప్‌కార్ట్ బోర్డుకు బన్సల్ రాజీనామా చేశారని సమాచారం. ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఫోన్‌పేలోనూ బన్సల్ పెట్టుబడులు ఉన్నాయి.

యెస్ బ్యాంక్ లాభాల్లో 350శాతం వృద్ధి



ముంబయి : ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 349.7 శాతం వృద్ధితో రూ.231.6 కోట్ల నికర లాభాలు సాధించింది. 2022-23 ఇదే త్రైమాసికంలో రూ.51.5 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు యధాతథంగా 2 శాతంగా, నికర నిరర్థక ఆస్తులు మెరుగుపడి 0.9 శాతానికి తగ్గాయి. గడిచిన క్యూ3లో నికర వడ్డీపై ఆదాయం 2.3 శాతం పెరిగి రూ.2,016 కోట్లుగా నమోదయ్యింది.

పీఎన్‌బీ లాభాలు మూడు రెట్లు

ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) 2023-24 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో మూడు రెట్ల వృద్ధితో రూ.2,222.8 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.253.49 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో 9.76 శాతంగా ఉన్న బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు.. గడిచిన డిసెంబర్ ముగింపు నాటికి 6.24 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 3.30 శాతం నుంచి 0.96 శాతానికి పరిమితమయ్యాయి. పీఎన్‌బీ నికర వడ్డీపై ఆదాయం 12.13 శాతం వృద్ధితో రూ.10,293 కోట్లుగా చోటు చేసుకుంది. 2023 డిసెంబర్ 31 నాటికి భారత్‌లో 10,108 శాఖలు, 12,455 ఎటిఎం కేంద్రాలు, 29,768 బిజినెస్ కరస్పాండెంట్లను కలిగి ఉంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో పెరగనున్న ఎల్ఐసీ వాటా

ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) తన వాటాను పెంచుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతించింది. 2025 జనవరి 24 నాటికి హెచ్‌డీఎఫ్‌సీలో ఎల్ఐసీ తన వాటాను 9.99 శాతానికి పెంచుకోవడానికి అవకాశం కల్పించింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి 5.19 శాతం వాటాను కలిగి ఉంది. మరో 4.8 శాతం వాటాలను పెంచుకోవడానికి వీలు కల్పించినట్లయ్యింది.

స్టార్టప్ సర్జ్ వినూత్న 'ఇ-స్కూటర్ రిక్షా'

కన్వర్టేబుల్ వాహనం ఆవిష్కరణ



న్యూఢిల్లీ : హీరో మోటో కార్ప్ అనుబంధ స్టార్టప్ సర్జ్32 వినూత్న వాహనాన్ని ఆవిష్కరించి ంది. విద్యుత్ వినియోగ స్కూటర్ ను కేవలం మూడు నిమి షాల్లో ఆటో రిక్షాగా మార్చుకునే కొత్త వాహనాన్ని అభివృద్ధి చేసింది. దీనిని హీరో వరల్డ్ ఈవెంట్‌లో ప్రదర్శించారు. స్వయం ఉపాధితో జీవించే వారి అవసరాల కోసం దీన్ని రూపొందించామని హీరో మోటో కార్ప్ వెల్లడించింది. మామూలు ఆటో రిక్షాల మాదిరిగానే ఈ త్రీవీలర్ ఆటో రిక్షాలో విండ్ స్క్రీన్, హెడ్ ల్యాంప్, టర్న్ ఇండికేటర్, విండ్ స్క్రీన్ వైఫర్లు ఉంటాయి. ఆటోకు డోర్లు లేకున్నా జిప్‌తో కూడిన సాఫ్ట్ డోర్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. కాగా.. స్కూటర్, ఆటో రిక్షాకు సంబంధించి వేరువేరు బ్యాటరీలను అమర్చింది. ఆటో రిక్షాలో 10 కిలోవాట్ల ఇంజిన్, 11 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ, స్కూటర్‌లో 3కిలోవాట్ల ఇంజిన్ ఉంటే 3.5 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో ప్రవేశపెట్టింది. గంటకు గరిష్ఠంగా 50 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించే త్రీవీలర్ 500 కిలోల బరువు రవాణా చేయగలదు. టూ వీలర్ వెహికల్ మాత్రం గరిష్ఠంగా 60కిలోమీటర్ల వేగంగా ప్రయాణించగలదు. కాగా.. దీని ధరలను ఇంకా వెల్లడించలేదు.

ఎఫ్‌టీసీసీఐలో ఎగుమతులు, దిగుమతులపై సర్టిఫికేట్ ప్రోగ్రాం

హైదరాబాద్ : ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) "ఎగుమతి, దిగుమతుల నిర్వహణపై సర్టిఫికేట్ ప్రోగ్రామ్"ను ప్రారంభించినట్లు ప్రకటించింది. మార్కెట్ యాక్సెస్ ఇనిషియేటివ్ ఫర్ కెపాసిటీ బిల్డింగ్ కింద వాణిజ్యపరిశ్రమల మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేసిన ఈ ఆరు రోజుల ప్రోగ్రామ్‌కు తోలు పరిశ్రమకు చెందిన 67 మంది వ్యాపార యజమానులను అంతర్జాతీయ వాణిజ్యంలో అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానంతో సన్నద్ధం చేయడానికి ఏర్పాటు చేయబడింది. శనివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిలో సామర్థ్య పెంపుదల ప్రాముఖ్యతను తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను మెదక్, గుంటూరు, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

త్వరలో తెలంగాణ మెగా మాస్టర్ ప్లాన్-2050

- మూసీనది కేంద్రంగా అభివృద్ధి
- దానికోసమే మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్
- బిల్డర్స్ అసోసియేషన్ కన్వెన్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తెలంగాణ మెగా మాస్టర్ ప్లాన్-2050 రూపొందిస్తుందనీ, దానిలో బిల్డర్లు, కాంట్రాక్టర్లు సహా ప్రజలంతా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ నది కేంద్రంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామనీ, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పేరుతో థేమ్ నది నుంచి సబర్మతి నది వరకు అన్ని ప్రణాళికల్ని అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 31వ కన్వెన్షన్ శనివారంనాడిక్కడి హైటెక్స్‌లో జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ దేశ అభివృద్ధి అయినా ఆ దేశ రోడ్ కనెక్టివిటీని తొలి ప్రాతిపదికగా, విద్యుత్ వినియోగాన్ని రెండో ప్రాతిపదికగా తీసుకుంటారని తెలిపారు. దేశంలో మౌలిక సౌకర్యాల కల్పన అత్యవసరమనీ, వాటి నిర్మాణంలో బిల్డర్ల పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు. ప్రభుత్వ కాంట్రాక్టులకు ముందస్తు పెట్టుబడులు పెట్టి పనులు పూర్తిచేస్తున్నారని చెప్పారు. బిల్డర్ల సమస్యలు తెలుసుకొనేందుకే తాను ఇక్కడకు వచ్చానన్నారు. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల లోపాలను సరిచేసేందుకు ప్రభుత్వపరంగా, కాంగ్రెస్ పార్టీగానూ కొట్లాడతామన్నారు. రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు, బిల్డర్లు ఆర్థికంగా బలబడితేనే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిలబడుతుందని ప్రభుత్వం నమ్ముతుందని స్పష్టం చేశారు. వారి సమస్యల్ని పరిష్కరిస్తామన్నారు. మూసీ నదితోనే హైదరాబాద్ జీవన విధానం ముడిపడి ఉన్నదనీ, ఈ మెట్రోపాలిటన్ సిటీలోని చారిత్రక నిర్మాణాలను బిల్డర్లే వారసత్వంగా అందించారని వివరించారు. తెలంగాణ మెగా మాస్టర్‌ప్లాన్-2050 కోసం త్వరలో ఆసక్తి వ్యక్తీకరణ కోరతామని చెప్పారు. మూసీ వెంట మెట్రోరైల్ అనుసంధానం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమానికి అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ' మాసపత్రిక ఆవిష్కరించిన సీఎం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ మాసపత్రికను శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్ రెడ్డి, ముఖ్యమంత్రి సీపీఆర్ఓ అయోధ్యరెడ్డి, మాసపత్రిక ఎడిటర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ప్రముఖులు

ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా పలువురు ప్రముఖులు కలిశారు.

వారిలో గవర్నర్ కోటాలో నూతనంగా నియమితులైన ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్ కోదండరాం, అమీర్ అలీఖాన్, మాజీ ఎమ్మెల్యే తీగల కష్టారెడ్డి, సినీ నటుడు వెంకటేశ్, సినీ నిర్మాత సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయండి

డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని విద్యాశాఖ అధికారులను తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్యను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీని ప్రకటించిందని గుర్తు చేశారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న 15 వేల ఉపాధ్యాయ పోస్టులను కలిపి అనుబంధ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ముడిపెట్టకుండా విడుదల చేయాలని సూచించారు. రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు హరీశ్, శ్రీను నాయక్, కోటేశ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఇర్ఫాన్, స్వప్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ కుంభకోణం వెనుక కేటీఆర్

టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హెచ్ఎండీఏ కుంభకోణం వెనుక మాజీ మంత్రి కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్ హస్తముందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనపై చర్చకు సిద్ధమా?అని ఆయన సవాల్ విసిరారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియా తో మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో విలువైన భూములను హస్తగతం చేసుకోవడానికి కేటీఆర్ బృందం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. హెచ్ఎండీఏలో బాలకృష్ణలాగే మరికొంతమంది తిమింగ లాలున్నాయని అన్నారు. ఒక డైరెక్టర్ రూ.500 కోట్లు సంపాదిస్తే ఆ పదవి ఇచ్చిన కేటీఆర్ ఎంత సంపాదించి ఉంటారో ఆలోచించాలని కోరారు. ఢిల్లీలో ఉన్న అరవింద్‌కుమార్‌ను తెచ్చి హెచ్ఎండీఏ కమిషనర్‌గా నియమించి అవినీతిని ప్రోత్సహించారని విమర్శిం చారు. ప్రజాపాలనపై కేటీఆర్, హరీశ్‌రావుకు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. 50 రోజుల పాలనలో రాష్ట్రంలో మార్పు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షులు మెడ శ్రీను, నాయకులు సుమన్‌గౌడ్, స్వాతి, సైదులు, మహేంద్ర, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెస్టీ

సవ్యసాచిత్వం



వెంకటేశం తల్లి వెంకమ్మతో తన గురువు గిరీశం గారి గొప్పతనం గురించి మసాలా దట్టించి మరీ చెప్తున్నాడు. బుచ్చెమ్మ కూడా ఇంతింత కళ్ళేసుకుని మధ్య, మధ్యలో బుగ్గలు నొక్కుకుంటూ "అవునట్రా" అంటూ ఆశ్చర్యచకితురాలౌతోంది.

శిష్యుడు : మీరిద్దరూ ఆడవాళ్లు. ఆడవాళ్ళకు మెదళ్లు చిన్నగా ఉంటాయని, అందువల్లే వారు సరిగా ఆలోచించలేరని సామవేదంలోనే ఉందని మా గురువుగారు ఎపుడో చెప్పారు.

బుచ్చెమ్మ: "ఆడవాళ్ళ మెదళ్లు చిన్నగా ఉంటాయని వేదాల రోజుల్లోనే మన వాళ్ళకి తెలుసునట్రా!? అప్పుడు మిషన్లుగట్రా ఏమీ లేవుగదా!" అని ఆశ్చర్యపోయింది.

వెంకటేశం : నీ మెదడు చిన్నగా ఉండటం వల్లనే ఈ సమస్య. అన్నీ వేదాల్లోనే ఉన్నాయ ష! అని నాన్న ఎన్ని సార్లు చెప్పలేదూ?

ఇంతలోనే గిరీశం జంధ్యం కిందికి పైకి కదిపిస్తూ 'దీన్ని ఎవడు ఏ అవసరం కోసం కనిపెట్టాడో తెలీదుగానీ, వీపుగోక్కోడానికి మంచి సాధనం! అంటూ ప్రవేశించాడు." వెల్ మైడియర్ షేక్స్‌పియర్! ఏంటి వాయ్. ఈ పది రోజుల సంగతులు!?

వెంకమ్మ : (వెంకటేశం చెవులో) ఏమిట్రా! నిన్ను షేకు పీరు సాయిబంటున్నాడు"?

వెంకటేశం : నువ్వొక పిచ్చిమాలోకం! అది ఇంగ్లీషులో పెద్ద కవిపేరు. మన కాళిదాసులు, గీళిదాసులు ఆయన ముందు చెల్లరట!

గిరీశం : అవునండీ! రోమియో, జూలెట్‌లో కూడా 'కుమార సంభవం'లో ఉన్న పచ్చిబూతుల్లేవండీ... 'నాచ్చి కొచ్చన్' పైనైనా, 'విడో రీ మ్యారేజ్' పైనైనా ఇచ్చినట్లే షేక్స్‌పియర్‌పైన కూడా అనర్గళంగా ఓ రెండు గంటలు చెప్పగలనండీ! మొన్ననే మీ ఇంట్లో భోజనాలప్పుడు 'విడో రీ మ్యారేజ్' గురించి చెప్దామనుకున్నా గాని "థ్రోయింగ్ పెరల్స్ బిఫోర్ స్వైన్' అనుకుని ఆగిపోయానండి.

బుచ్చెమ్మ : ఆ మాటలకి అర్థమేంటండీ గిరీశంగారూ!

గిరీశం: ప్రస్తుతానికది వేదమే అనుకోండి! అర్థాలు కొన్నింటికి తెలీకపోవడమే ఉత్తమం వెంకటేశం(గురువేదో నోరు జారి ఇరకాటంలో ఉన్నాడనిపించి) ఇంతకీ 'సవ్యసాచి' అర్థం అడిగితే చెప్పకుండానే ఊరెళ్ళారు!? బోధి వృక్షం కింద కూచోడానికా?

"గిరీశం: బోధి వృక్షం కింద కూచుని లైట్ వెలిగించుకునే అవసరమేముందోయ్! మై డియర్ బ్రద్రిన్లా! అందుకే నిన్ను రోజూ దినపత్రికలు చదవమంది!

ఒక చేత్తో రాముణ్ణి హ్యాండిల్ చేస్తూ రెండో చేత్తో సూర్యుణ్ణి సారీ.. సూర్య శక్తిని హ్యాండిల్ చేయగలగడమే సవ్యసాచిత్వం.



బుచ్చెమ్మ: నాకు ఒక్కముక్క అర్థం కాలేదు గిరీశంగారూ! శ్రీరాముడు సూర్యవంశస్థుడేగా, ఇందులో సవ్యసాచిత్వమేముంది?

గిరీశం : ఇది ఇక్ష్వాకుల కాలంలో నైతే మంచి ప్రశ్నే. రోజూ సంధ్యావందనంలో ఉన్నదాని ప్రకారం 'భరతవర్షే, భరత ఖండే, జంబూద్వీపే, కలియుగే, ప్రథమ పాదే అనే దాని ప్రకారం మనం కలియుగం ప్రథమ పాదంలో ఉన్నాం బుచ్చెమ్మగారూ! ఇక్కడ సూర్యశక్తి అంటే సోలార్ ఎనర్జీ అన్న మాట! సే ఎట్ వన్స్ మై బాయ్! సోలార్ ఎనర్జీకి పర్యాయపదమేమిటి?

శిష్యుడు : అ... అ..!

గిరీశం : నీకెప్పుడూ అరిసెలు, చేగోడీలు, తిండిరందే తప్ప చెప్పిన పాఠాలు సరిగా గుర్తు పెట్టుకుని యేడ్వవు. మధ్యలో అక్షరం నేనందిస్తా... 'దా' అన్నాడు.

వెంకటేశం : 'అదానీ' అని పెద్దగా అరిచాడు. భారత దేశంలో పడమట ఉదయించిన సూర్యుడాయన. గిరీశం నేర్పినవన్నీ గడగడా వల్లించేశాడు.

బుచ్చెమ్మ: నాకు ఇంకా మీరు చెప్పిన సవ్యసాచిత్వం అర్థం కాలేదు..

గిరీశం : అధికారంలోకి రావడానికి దేవుళ్లను వాడుకున్న వారిని చాలా మందిని చూసుంటారు. అధికారం నిలబెట్టుకోడానికి ఒక వైపు రాముడు. ఇంకో వైపు మిత్రులను మేపడం! అది కూడా అసామాన్య పద్ధతిలో.. వెంట పెట్టుకుని వెళ్ళి విదేశాల్లో బొగ్గు గనుల కాంట్రాక్టు ఇప్పించడం. విదేశీ బొగ్గు పేర ఆ బొగ్గునే దేశంలోకి దిగుమతి చేసుకోవడం... మనకంటే దిక్కుమాలిన, దివాళా ఎత్తిన రావణాసురిడి దేశంలో విద్యుత్ రెగ్యులేటర్లనే తొక్కించేయడం... వగైరా మామూలు విషయాలా?

బుచ్చెమ్మ: దీన్ని దేశాన్ని అమ్ముకోవడమంటారు కదా!

గిరీశం :ఒక పక్క కొడిగడ్తున్న అలీనోద్యమ మీటింగుల్లో మాట్లాడుతూనే అటు 'నాటో' కూటమికి అంటకాగడం సామాన్యమైన విషయమా? నిన్ననే మన ఫారిన్ మంత్రి ఉక్రెయిన్‌కి 15వ సోలార్ విద్యుత్ పరికరాలు కన్‌సైన్‌మెంట్ పంపామని మీడియాకి చెప్పారు చూశారా? ఇది ఇన్‌డైరెక్ట్‌గా నాటోకి సాయమే కదా!

ఇదంతా సవ్యసాచిత్వమేగా!

శిష్యుడు : అవునండోయ్! మీరు చెప్తుంటే ఇది రెండు చేతుల్తో రెండు వైపులకీ బాణాలేసినట్టే ఉంది!

బుచ్చెమ్మ: నీ మొహం! నోర్ముయ్ రా పిచ్చి గాడిదా! మీరు చెప్పే నాటోలు గిటోలు నాకు తెలియదు. ఇందులో సవ్యసాచిత్వమేముంది? ఏటో ఒక వైపుకి ఒంగి పోయి, లొంగి పోవడం తప్పా?!.

పూట కూళ్ళమ్మ కొట్టిన చీపురు దెబ్బే దీనికంటే నయం అనుకుంటూ ఇంకా లాగితే తెగుతుందనుకుని మూసుక్కూచున్నాడు గిరీశం.

కాంగ్రెస్ గూటికి 'పట్నం' ఫ్యామిలీ?

ఎంపీ రేసులో సునీతామహేందర్‌రెడ్డి

- చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశిస్తున్న దంపతులు
- రేపో మాపో కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని గుసగుసలు
- తాండూరులో జోరుగా ప్రచారం





నవతెలంగాణ-తాండూరు

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో వికారాబాద్ జిల్లాలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై అన్ని పార్టీలూ దృష్టిసారించాయి. బలమైన అభ్యర్థుల కోసం గాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్ గూటికి వెళ్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు దీనికి బలాన్ని చేకుర్చుతున్నాయి. పట్నం దంపతులు కాంగ్రెస్‌లో చేరితే.. చేవెళ్ల పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్నట్టు సమాచారం. మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి ఎంపీ బరిలో ఉంటారని తెలుస్తోంది. అన్నీ కుదిరితే త్వరలోనే పట్నం దంపతులు కాంగ్రెస్‌లో చేరనున్నారు.

బీఆర్ఎస్ ఇప్పటికే చేవెళ్ల టికెట్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి డిక్లేర్ చేసింది. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు సీనియర్ నేతలు అందెల శ్రీరాములుయాదవ్, భాస్కర్ యోగి టికెట్ రేసులో ఉన్నారు. ఇక కాంగ్రెస్ నుంచి ఎవరు బరిలో దిగుతారనే దానిపై ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన బడా నేతను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్నం మహేందర్‌రెడ్డి ఫ్యామిలీని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నట్టు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లాలో పట్నం ఫ్యామిలీకి మంచి పేరు ఉంది. మహేందర్‌రెడ్డి గతంలో మంత్రిగా పనిచేయగా.. ఆయన సతీమణి సునీతా మహేందర్‌రెడ్డి ప్రస్తుతం వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోనే వికారాబాద్ జిల్లాలోని తాండూర్, పరిగి, వికారాబాద్, కొడంగల్ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఈ నాలుగిట్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే గెలుపొందారు. దాంతోపాటు తాండూర్‌లో పట్నం మహేందర్‌రెడ్డి బలమైన క్యాడర్ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాండూర్ టికెట్ ఆశించినప్పటికీ బీఆర్ఎస్ అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి ఇచ్చింది. మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి నచ్చజెప్పింది. అయితే నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓడిపోయింది. ఇందుకు మహేందర్‌రెడ్డే కారణమని చేవెళ్ల పార్లమెంట్ సన్నాహక సమావేశంలో పైలెట్ రోహిత్‌రెడ్డి ఆరోపించారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం పట్నం దంపతులు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జోరుగా సాగింది. ఇప్పటికే తాండూర్‌కు చెందిన పట్నం అనుచరులు కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితోపాటు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పలుమార్లు ఆరోపించారు. పట్నం దంపతులకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మంచి పలుకుబడి ఉంది. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కూడా బలమైన క్యాడర్ ఉంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌కు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థిని నిలపాలని భావిస్తోంది. అందులో భాగంగానే పట్నం దంపతులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించి, చేవెళ్ల పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ ఉత్కంఠకు త్వరలోనే ఫుల్‌స్టాప్ పడనుంది.



ప్రొ.కోదండరామ్‌ను కలిసిన ఉన్నత విద్యామండలి చైర్మెన్

యూనివర్సిటీల వీసీలతో కలిసి సత్కారం

నవతెలంగాణ-ఓయూ

ఇటీవల ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొ. కోదండరామ్‌ను శనివారం హైదరాబాద్ తార్నాకలోని ఆయన నివాసంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.ఆర్.లింబాద్రి ఆధ్వర్యంలో పలు యూనివర్సిటీల వీసీలు కలిశారు. ఈ సందర్భంగా కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. వీసీలు ప్రొ.రాథోడ్, ప్రొ.ఎస్.మల్లేశం, ప్రొ.గోపాల్ రెడ్డి, ప్రొ.వెంకటరమణ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఫీజు తత్కాల్ గడువు 2

ఆలస్య రుసుం రూ.వెయ్యితో చెల్లించే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదోతరగతి పరీక్షలు-2024 మార్చిలో హాజరయ్యే విద్యార్థులు తత్కాల్ ద్వారా ఫీజు చెల్లింపు గడువు వచ్చేనెల రెండో తేదీ వరకు ఉన్నది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం రూ.వెయ్యితో వచ్చేనెల రెండు వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. ఆయా తేదీల్లో సాధారణ సెలవులుంటే మరుసటి రోజు ఫీజు చెల్లించొచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని ఫీజు చెల్లించని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు ఫీజు చెల్లింపునకు ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు వచ్చేనెల ఏడో తేదీన గడువు ముగుస్తుందని తెలిపారు. ఇతర సమాచారం కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో మార్చి 18 నుంచి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే.

మధిర అభివృద్ధి బాధ్యత నాది

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మధిరలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

నవతెలంగాణ-మధిర

మధిర నియోజవర్గ సమగ్ర అభివృద్ధి బాధ్యత నాది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర మండలంలోని బయ్యారం గ్రామంలో గ్రామపంచాయతీ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను ప్రారంభించారు. అదేవిధంగా డిజిటల్ విద్యా బోధనకు సంబంధించిన కంప్యూటర్లను, నిదానపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు వాగ్దానం చేసినట్టుగా నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం తయారు చేసిన ప్రణాళికలను అమలు చేసే పనిలో ఉన్నట్టు వివరించారు.

నియోజకవర్గంలో సాగు, తాగు నీరు అందించడానికి, పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్టు వెల్లడించారు. విద్యా, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు తయారుచేసి ముందుకు వెళుతున్నట్టు చెప్పారు.

2009 అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా బయ్యారం గ్రామానికి వచ్చేందుకు సరిగ్గా రోడ్డు లేదని, మండలంలో ఈ గ్రామం మూలకు విసిరి పడేసినట్టుగా ఉండేదని గుర్తు చేశారు.



నాడు ఈ ఊరికి రోడ్డు వేసిన తర్వాతే వస్తానని చెప్పి రోడ్డు వేయించిన తర్వాతే బయ్యారం గ్రామానికి వచ్చినట్టు చెప్పారు. బయ్యారం, మడుపల్లి మధ్యన ఉన్న చెరువు కట్ట వెడల్పు చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. చిలుకూరు గ్రామంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, కాంగ్రెస్ నేతలు పాముల సంగమయ్య, సోమయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం

మధిర మండలానికి వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మడుపల్లి, బయ్యారం, చిలుకూరు, ఖమ్మంపాడు, దెందుకూరు, నిదానపురం గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అపూర్వంగా స్వాగతం పలికారు.

కాంగ్రెస్‌కు చురకలంటించాలి

- లేకుంటే హామీలు అమలు కావు : ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట


వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి చురకలు అంటించకుంటే వారు ఇచ్చిన హామీలు నెరవేరవని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు సూచించారు. సిద్దిపేట పట్టణంలోని కొండమల్లయ్య గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ కృతజ్ఞత సభ జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వీడియోలో చూపిస్తూ.. ఇపుడు వారే పాలనలో సీఎం, మంత్రులుగా ఉంటూ అసహనంతో మాట్లాడుతున్నారన్నారు. వాళ్ళు ఇచ్చిన హామీలకు సంబంధించి గడువు తేదీలను మనం గుర్తు చేస్తుంటే నోరు పెద్దది చేస్తూ ప్రజలను బెదిరించేలా మాట్లాడుతున్నారన్నారు. హామీల అమలు గురించి అడిగితే మంత్రులకు కోపం ఎలా తన్నుకు వస్తుందో ఓసారి కోమటిరెడ్డి వీడియోను చూడండి అంటూ.. రైతుబంధు పడలేదు అన్న వారిని చెప్పుతో కొట్టాలట అని ఉన్న వీడియోను చూపించారు. రేవంత్ జనవరి నుంచి కరెంటు బిల్లులు కట్టొద్దంటే, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నవంబర్ నుంచే కట్టొద్దని ప్రజలకు సూచించారని.. జనవరి కూడా అయిపోయిందని, బిల్లులు సోనియాకు పంపుదామా, రేవంత్‌కు పంపుదామా, కోమటిరెడ్డికి పంపుదామా అంటూ వీడియో చూపించి గ్రామాల్లో చర్చలు పెట్టాలన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయని వస్తే.. ఖాళీ బిందెలు ఉన్నాయంటూ సీఎం రేవంత్ అంటున్నారని, లంకె బిందెలు ప్రభుత్వ భవనాల్లో ఉంటాయా? లేక పాడుబడిన ఇండ్లలో ఉంటాయా? అని అన్నారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరా పారడం లేదన్నారు.. మరి మంత్రి కొండా సురేఖ రంగ నాయకసాగర్ గేట్లు ఎందుకు వదిలారని ప్రశ్నించారు. ఎరువుల కొరత కూడా మొదలైందని, తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది కాంగ్రెస్, బీజేపీలు కావని, బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలిస్తేనే, హామీల అమలు కోసం ప్రభుత్వాలను నిలదీయగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శి వి శ్రీనివాస రావుకు పితృ వియోగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తండ్రి వంకాయలపాటి వెంకటస్వామి (94) కన్ను మూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని సీసీ షరాఫ్ ఆస్పత్రిలో శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, అయిదుగురు కుమార్తెలున్నారు. ఆయనది ప్రకాశం జిల్లా మద్దిపూడి మండలం కెల్లంపల్లి గ్రామం. వెంకటస్వామి ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ సమితి సభ్యులుగా పనిచేశారు. కెల్లంపల్లి గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ పిలుపులో భాగంగా హెల్త్ వలంటీరుగా నెల్లూరులో పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలోని ప్రజావైద్యశాలలో తర్ఫీదు పొందారు. తదుపరి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులై కెల్లంపల్లిలో అర్ఎంపీగా ఏడు దశాబ్దాల పాటు వైద్యసేవలందించారు. వ్యవసాయం చేస్తూనే.. వృత్తి రీత్యా తగిలిన గాయాలకు సంవత్సరాల పాటు కుట్లు వేయాల్సిన చికిత్సలకు ఆయనే కేరాఫ్ అడ్రెస్‌గా నిలిచారు. ఆయన మనుమరాలు ఆశాభారతి నవతెలంగాణ పత్రికలో పనిచేస్తుండగా, ఆమె భర్త ప్రసాద్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఉన్నారు. రెండవ మనుమరాలు శాంతి అమెరికాలో ఉన్నారు. వెంకటస్వామి అంత్యక్రియలను కెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన భౌతికకాయానికి సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, సాగర్, అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పి ప్రభాకర్, సిబ్బంది, సీపీఐ(ఎం) నగర కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు శ్రీనివాసరావు, స్వేచ్ఛ వ్యవస్థాపక సభ్యులు కిరణ్‌చంద్ర, మిరియం వెంకటేశ్వర్లు, ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, రైతు సంఘం నాయకులు మూడ్ శోభన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఆయన మరణంపట్ల సీపీఐ(ఎం) తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నవతెలంగాణ ఎడిటర్ ఆర్ సుధాభాస్కర్ సంతాపం తెలిపారు.





అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్‌లో సీఐటీయూ కార్యాలయం నుంచి డీడబ్ల్యూఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఫిబ్రవరి 16వ జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును డీడబ్ల్యూఓ మిల్కాకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతినెలా 14వ తేదీలోపు అందాల్సిన వేతనాలు అందడం లేదన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్లను కొన్ని జిల్లాల్లో మేయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తించారని.. ఆర్డరు కాపీలు సైతం అందజేశారని చెప్పారు. కానీ మన జిల్లాలో ఇవ్వడం లేదన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి, బలోపేతం చేయాలని కోరారు. 45వ ఐఎల్‌సీ సిఫారసుల ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా రూ.10వేల పెన్షన్ చెల్లించాలని, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటమ్మ, జిల్లా కోశాధికారి పి.రత్నమాల, ఉపాధ్యక్షులు మధునిక, నాయకులు కవిత, పంచపూల, సుభద్ర, అనసూయ, ముక్తా, అనిత, ఆశమ్మ ఉజ్వల, సుభద్ర, కళావతి పార్వతి పాల్గొన్నారు.

వచ్చే నెల 16న జాతీయ సమ్మెలో పాల్గొంటాం

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి సీఐటీయూ సమ్మెనోటీస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ...ఫిబ్రవరి 16న జాతీయ కార్మిక, రైతు సంఘాలు తలపెట్టిన సమ్మెలో పాల్గొంటామని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) తెలిపింది. ఈమేరకు శనివారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేష్, అధ్యక్షులు మెట్టు రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. నారాయణ సమ్మె నోటీస్‌ను అందజేశారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, ఐఎఫ్‌యూ, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ) కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా (రైతు-వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక) అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మెతోపాటు గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించాయని వారు గుర్తు చేశారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్-22 సబ్ సెక్షన్ (1) అనుసరించి ఈ సమ్మె నోటీస్ అందజేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. .

మేము సైతం...


కాకతీయ విశ్వవిద్యాలయంలో గత 25 ఏండ్లుగా పని చేస్తున్న దినసరి వేతనం, లంప్సమ్, క్యాజువల్ తదితర ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు విధానంలోకి మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి ఇదే అంశంపై వారు సమ్మె నోటీస్ అందజేశారు. ఉద్యోగుల్లో అభద్రతాభావం నెలకొందని పేర్కొన్నారు. గత ఆరేండ్లుగా జీతాలు పెరగకపోవడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, విద్య, వైద్యం, ఇంటి కిరాయిలు తదితర ఖర్చులతో ఈ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కాకతీయ యూనివర్సిటీలో కొత్తగా ప్రవేశపెట్టనున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పాలక మండలికి నోటిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పాలక మండలి నియామకానికి మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మెన్‌తో పాటు ఆరుగురు సభ్యులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. విద్యార్హతలు, ఇతర నిబంధనలకు డబ్ల్యూడీసీ. టీజీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిక చేసిన అభ్యర్థును ఇంటర్వ్యూకు ఆహ్వానించనున్నట్టు తెలిపారు.

వివేకశూన్యుడైన మిత్రుడు వివేకవంతుడైన శత్రువు కంటే ప్రమాదం - షేక్స్‌పియర్



సంపాదకీయం

భక్తి సరే అదెప్పుడూ వ్యక్తిగతమైన విశ్వాసానికి సంబంధించినదే. కానీ ప్రజాస్వామ్య పరిపాలన లక్ష్యాలేమిటి? ప్రజల సమస్యల పరిష్కారం కదా! ఆకలి పెరిగిందని ఆక్స్‌ఫామ్ చెబుతోంది. నిరుద్యోగం, దారిద్ర్యం, అనారోగ్యం, కాలుష్యం, వివక్షత, నేరం అన్నీ పెరిగాయి. వీటిపైన ఏదైనా చర్చ, కృషి ఉన్నదా! ఉంటదా! ఇక దేవుడే దిక్కా! ఇప్పుడయినా ప్రశ్నలు లేవనెత్తాలి. ధరల మాటేమిటి? దరిద్రం సంగతి ఏమిటి? ఎవరు చెబుతారు సమాధానాలు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులపైన చర్చ జరగాల్సిన సమయమిది.

ఆధ్యాత్మిక నటన

"దేవుని పాదాల మీద పూలు పెట్టేందుకు, తలవంచి, ప్రార్థించేందుకు, మోకాళ్ల మీద కూర్చుని ప్రార్థించేందుకు గుడికి వెళ్లకు. ముందుగా, దయ, ప్రేమ, వాత్సల్యాలతో నీ స్వంత ఇంటిని నింపుకో. నీతోటి వారి ముందు వినయంగా ఉండడం నేర్చుకో. పాపం, గర్వం, అహంభావాల చీకటిని నీ హృదయం నుండి తొలగించు, అణగారిన వర్గాలకు చేయందించేందుకు కిందికి చూడు, నీవు అన్యాయం చేసిన వారికి క్షమాపణలు చెప్పు, నిన్ను గాయపరచిన వారిని హృదయ పూర్వకంగా క్షమించు!". అన్న రవీంద్రుని పద్యం నిజంగా మొన్న అయోధ్యగుడిలో బాలరామ ప్రతిష్టలో పాల్గొన్న ప్రధాని మోడీ కోసమే చెప్పాడా అన్నట్లు తోస్తుంది!. విశ్వకవిగా ప్రసిద్ధుడయిన ఠాగూరుగారు వందేళ్ల క్రితమే దైవభక్తి, పూజల గురించి, వాస్తవిక మానవ ప్రవర్తనల గురించి అద్భుతంగా పద్యరచన చేశాడు. అదే ఇప్పుడు గనక, అయన బతికుండి రాస్తే, ఎంత గొడవ పెట్టేవాళ్లో ఈ సంఘ పరివార్ అల్లరి మూకలు. మమ్ములను గుడికి వెళ్లద్దంటావా? అని.


నిజంగా ఏవైతే రవీంద్రుడు భక్తుడు నింపుకోవాల్సినవని చెప్పాడో, అవన్నీ లోపించిన వాళ్లే అయోధ్య ప్రాణప్రతిష్టానంతరం, వారి అహంకారపూరిత విద్వేషాన్ని, విధ్వంసాన్ని మొదలుపెట్టారు. మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్, బీహార్, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాలలో గుడి ఆరంభమైన మరుదినమే వారి భక్తిలోని క్రౌర్యమేమిటో ప్రదర్శించారు. వాస్తవంగా దేవుని ప్రతిష్టను దేశంలోని సామాన్య ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో తమ ఆధ్యాత్మిక పారవశ్యాన్ని ప్రదర్శించారు. రామున్ని దేవునిగా ఆరాధించుకున్నారు. ఈ భక్తి తరతరాలుగా ప్రజలు ప్రదర్శిస్తూనే వున్నారు. ఇన్ని వందల కోట్ల దేవాలయం లేనప్పుడూ వారి ఆరాధన ఉన్నది. ఇప్పుడూ ఉన్నది. అసలు శతాబ్దాల క్రితమే మన భక్త రామదాసుగా ప్రసిద్ధులయిన కంచర్ల గోపన్న రామభక్తితో భద్రాచలంలో అలయాన్ని నిర్మించి, కీర్తనలు పాడి, జైలు శిక్షనూ అనుభవించిన ఆయనకన్నా భక్తుడెవరుంటారు! ఆ ఆలయంలో నవమి రామకళ్యాణానికి తానీషా తలంబ్రాలు స్వయంగా పంపేవాడనే విషయమూ అందరికీ తెలుసు. ఇక్కడి పర్ణశాల సీతారాముని వనవాస ప్రదేశమని చెబుతారు. కానీ ఇక్కడి రామాలయం కన్నా అయోధ్య ఆలయంలోనే 'భక్తి', దేవుడి శక్తీ మెండు. ఎందుకనేది కూడా జగద్వితమే. స్వతహాగా రాముడు కరుణా సముద్రుడు మన రామదాసు ప్రకారం. ఇక్కడి రాముడు రౌద్ర స్వరూపుడు. యుద్ధం, ద్వేషం ఇక్కడి సన్నివేశం. ఇది అధికారం, ఓట్లు తెచ్చిపెట్టే ఆలయం. అందరి ఆరాధనలకు, ధర్మాలకు సమానతా ప్రాతిపదికన స్వేచ్ఛను స్వాతంత్ర్యాన్ని అందిస్తామని, లౌకిక రాజ్యంగా పరిపాలన సాగిస్తామని రాజ్యాంగ పరంగా హామీ నిచ్చిన దేశంలో మతానికి, రాజ్యానికి మధ్య ఉన్న గీతను చెరిపేసి అధికారమే ఈ వ్యవహారాన్ని నడపటం, రాజ్యాంగస్ఫూర్తికి వీడ్కోలు చెప్పటమే. అదలా వుంటే ఆధ్యాత్మికతను కూడా అధికారాన్ని కొని తెచ్చుకునే సరుకుగా మార్చేసిన ఘనత బీజేపీ పరివారానికే చెల్లింది. ఆధ్యాత్మిక పీఠాలకు అధిపతులైన నలుగురు శంకరాచార్యులు, సంప్రదాయానికి ఈ ప్రతిష్టాపన విరుద్ధమని చెబుతున్నా వినకుండా, ఏప్రిల్ ఎన్నికల కోసం తాపత్రయ పడటంలోని 'భక్తి'ని గమనిస్తే అసలు ప్రేమ దేనిమీదో తెలుస్తుంది.

భక్తి సరే అదెప్పుడూ వ్యక్తిగతమైన విశ్వాసానికి సంబంధించినదే. కానీ ప్రజాస్వామ్య పరిపాలన లక్ష్యాలేమిటి? ప్రజల సమస్యల పరిష్కారం కదా! ఆకలి పెరిగిందని ఆక్స్‌ఫామ్ చెబుతోంది. నిరుద్యోగం, దారిద్ర్యం, అనారోగ్యం, కాలుష్యం, వివక్షత, నేరం అన్నీ పెరిగాయి. వీటిపైన ఏదైనా చర్చ, కృషి ఉన్నదా! ఉంటదా! ఇక దేవుడే దిక్కా! ఇప్పుడయినా ప్రశ్నలు లేవనెత్తాలి. ధరల మాటేమిటి? దరిద్రం సంగతి ఏమిటి? ఎవరు చెబుతారు సమాధానాలు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులపైన చర్చ జరగాల్సిన సమయమిది. ఇవేమీ జరగనీయకుండా అనేక ఇక్కట్లకు గురయి, దీనంగా దేవుని చేరే సామాన్యుల భక్తిని, మతాన్ని ఆసరా చేసుకుని భావోద్వేగాలను రెచ్చగొట్టటం సహింపరాని విషయం. నిజంగా భక్తి కలవాళ్లు మసీదుల్లోకి వెళ్లి కాషాయ జెండాలు ఎగరేసి, నానాభూతులు తిడతారా! బీహార్‌లో ఢిల్లీలో మత విద్వేష నినాదాలు చేస్తూ విధ్వంసం సృష్టిస్తారా? చర్చీలోకి వెళ్లి కాషాయ జెండాలు ఎగరేస్తారా? ఇది భక్తి ఏ మాత్రమూ కాదు.

ఇక దేవునికి జీవులందరూ సమానమే కదా! మరి ఈ వివక్షతలకు కారకులెవరు? అయోధ్య బాలరాముని ప్రతిష్టాపన కోసం, ప్రసాదం పంపిణీ కోసం రాజస్తాన్‌లోని ముండ్లా గ్రామంలోని దళితులు ఇచ్చిన విరాళాలను, దళితుల విరాళాలతో ప్రసాదం చేస్తే అపవిత్ర మవుతుందని వెనక్కి ఇచ్చేయటం, ఏ రకమైన ఆధ్యాత్మిక ఆచరణ? ఒకే మతం మనుషుల మధ్య ఈ అంతరాలు, వివక్షతలు ఏమిటి? ఈ ప్రశ్నలకూ సమాధానాలు చెప్పాలి!

అందుకనే రవీంద్రుడు దేవుని ప్రార్థించే ముందు, నీలోని కల్మషాన్ని కడుక్కోమన్నాడు. ముందు మనలో వున్న మలినాలను ప్రక్షాళన చేసుకోవాలి. అయితే ఇవేవీ ఓట్లు కానీ సీట్లు కానీ తెచ్చిపెట్టవు కనుక ఆధ్యాత్మిక నటనే వారికి శిరోధార్యమవుతున్నది. సామాన్య భక్తజనులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. దేవున్నీ, మనల్నీ, వారి నుండి రక్షించుకోవాలి.

అయోధ్య సంకేతాలు- అవకాశవాద స్తోత్రాలు



తెలకపల్లి రవి

ఆరెస్సెస్ అధినేత సహా ప్రధాని మోడీ అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ట నిర్వహించడంతో భారత రాజకీయాల్లో నవశకం మొదలైందని మీడియా అభివర్ణిస్తున్నది. మరో వైపున బిబిసి, అల్‌జజీరా, గార్డనర్, ఎకనామిస్ట్ వంటి విదేశీ మీడియా సంస్థలు బాబ్రీ మసీదు కూలగొట్టిన చోటనే రామ మందిరాన్ని ప్రధాని స్వయంగా ప్రారంభించడం మత రాజకీయాల్లో మరో కొత్త మలుపు అని పతాకశీర్షికలిచ్చాయి. తాము లౌకిక వాదులమైనప్పటికీ మతతత్వ రాజకీయాలను సూటిగా ఎదుర్కోలేని వ్యాఖ్యాతలు, మేధావులు కూడా అటూ ఇటూ తిప్పి మాట్లాడుతూ బీజేపీకి కోపం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రముఖ నటులు చిరంజీవి వంటివారు ఆ వేడుకలో కనిపించారు. అక్కడ ప్రత్యక్షమైన బీజేపీయేతర రాజకీయ నేత చంద్రబాబు ఒక్కరేనని మీడియా గమనించింది. పవన్ కళ్యాణ్ కూడా వెళ్లడమే గాక అయోధ్యకోసం ఏదైనా చేస్తాననే ప్రకటించారు. ఇక ఏపీ ముఖ్యమంత్రి జగన్ రాజకీయంగా బీజేపీని బలపర్చేవారైనా అక్కడకు వెళ్లలేదు. ఆయన్ను పిలిచినట్టు కూడా కనిపించలేదు. ఏమైనా మూడు పార్టీలు బీజేపీతో వున్న రాష్ట్రంగా ఏపీ మాత్రమే కనిపిస్తుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాలు అధికారికంగానే ఆహ్వానం తిరస్కరించారు గనక తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అక్కడకు వెళ్లలేదు. భద్రాచలంలో రామాలయానికి, అయోధ్య రామాలయానికి తేడా ఏమీ లేదని వ్యాఖ్యానించారు. రాముడిపై భక్తి విషయమే అయితే రేవంత్ మాటలు పూర్తిగా వాస్తవమని చెప్పాలి. కానీ అయోధ్యలో అంతకు మించి జరిగింది.

నిజానికి రామభక్తిలోనూ కృష్ణతత్వంలో కూడా ఉత్తర దక్షిణ భారతీయుల విశ్వాసాల్లో చాలా తేడాలున్నాయి. ఈ విద్వే షాలను తొలగించడానికే తిక్కన హరిహరదేవుణ్ని సృష్టించాల్సి వచ్చింది. కనక ఒకసారి మతాల మధ్య తేడాలను, రాజకీయాలను అనుమతిస్తే తర్వాత ఆయా మతాలు కులాల మధ్య కూడా వివాదాలు రావడం అనివార్యం. ముస్లిం దేశాలలో షియాలు సున్నీల మధ్య, క్రైస్తవుల్లో ప్రొటెస్టంట్లు క్యాథలిక్కుల మధ్య వివాదాలు చూస్తాం, కనుక కేవలం మతం ప్రాతిపదికన ఎవరూ ఒక దేశాన్ని ఐక్యం చేయలేరు.

కేవలం హిందూ విశ్వాసమేనా?

వరుసగా చూసినప్పుడు ఈ పరిణామాలు పూర్తిగా బీజేపీ దిశలో వున్నట్టు,అయోధ్యతో అవి తిరుగులేనివిగా మారినట్టు ఎవరైనా భావిస్తే ఆశ్చర్యం లేదు. వాస్తవానికి మీడియాలో చాలామంది ఆ విధమైన చిత్రణే ఇస్తున్నారు. మోడీని అజేయుడని రాసిన చెప్పిన వాళ్ల పేర్లు చూస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ప్రజాస్వామ్యవాదులుగా ఉదారవాదులుగా పేరున్నవారు కూడా హిందూత్వను వ్యతిరేకిస్తే తమను దూరం పెడతారనీ, ముద్రవేస్తారనీ వెనకడుగు వేస్తున్న స్థితి చూస్తాం. విద్యాధికులు ఉన్నత స్థానాల్లోవారు కూడా పథకం ప్రకారం ముందుకు తెచ్చిన ఈ రాజకీయాలకు తలవంచుతున్నారు. తలపడటానికి నిరాకరిస్తున్నారు. వాస్తవంలో లౌకికవాదులు లేదా వామపక్షాలు ఏనాడూ రామభక్తిని గానీ, ఆలయాలను గానీ అవహేళన చేయలేదు. భక్తి విశ్వాసాలు వారి వారి వ్యక్తిగత అంశాలుగా మాత్రమే వుండాలన్నది ఇక్కడ కీలకాంశం.అలాగే భిన్నమతాలతో కూడిన ఈ దేశంలో అన్ని మతాలకు సమాన గౌరవం వుండాలనీ, అల్పసంఖ్యాక మైనార్టీ మతాలకు ప్రత్యేక సదుపాయాలు రక్షణ కూడా వుండాలనీ, రాజ్యాంగంలోని 25-30వ అధికరణాలు స్పష్టంగా చెబుతున్నాయి, లౌకికతత్వం, మతసామరస్యం వుండాలంటే మతతత్వంపై పోరాడవలసిందే, ఖండించవలసిందే. మతానికి మతతత్వానికి మధ్య వుండే పెద్దతేడాను కప్పిపుచ్చి ఇదేదో రామభక్తికి సంబంధించిన సమస్యగా చూపించడం సంఘపరివార్ పాచికే. హిందూమతం పేరిట హిందూత్వ చలామణీ కావడానికి మీడియా ప్రచారాలు కూడా తోడైనాయి. హిందూత్వ వీరసావర్కార్ సృష్టించిన పదం మాత్రమే తప్ప ప్రాచీన సంప్రదాయం కాదు. నిజానికి రామభక్తిలోనూ కృష్ణతత్వంలో కూడా ఉత్తర దక్షిణ భారతీయుల విశ్వాసాల్లో చాలా తేడాలున్నాయి. ఈ విద్వేషాలను తొలగించడానికే తిక్కన హరిహర దేవుణ్ని సృష్టించాల్సి వచ్చింది. కనక ఒకసారి మతాల మధ్య తేడాలను, రాజకీయాలను అనుమతిస్తే తర్వాత ఆయా మతాలు కులాల మధ్య కూడా వివాదాలు రావడం అనివార్యం. ముస్లిం దేశాలలో షియాలు సున్నీల మధ్య, క్రైస్తవుల్లో ప్రొటెస్టంట్లు క్యాథలిక్కుల మధ్య వివాదాలు చూస్తాం, కనుక కేవలం మతం ప్రాతిపదికన ఎవరూ ఒక దేశాన్ని ఐక్యం చేయలేరు. మత ప్రాతిపదికన విడదీయబడిన పాకిస్తాన్ నుంచి భాష ప్రాతిపదికన బంగ్లాదేశ్ విడిపోవడం దీనికో ఉదాహరణ.యాభై ఏళ్ల స్వతంత్ర భారతంలో 1998లో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత హిందూత్వ పునరుద్ధరణవాదం పెంచిన ఫలితంగానే ఈ గుళ్లూ గోపురాల చుట్టూ రాజకీయాలు తిరగాల్సి వస్తోంది. పీవీ నరసింహరావు ఎంతో తెలివైన వారు గనక బాబ్రీ తొలగించబడితే ఆ సమస్యే వుండదని కొందరు ఇప్పటికీ చెబుతుంటారు. కానీ వారణాసి జ్ఞానవాపీ మసీదు కింద ఆలయ శిథిలాలు దొరికాయంటూ తాజాగా మొదలైన అలజడి చూస్తే వారి వాదన ఎంత తప్పో తెలుస్తోంది. ఈ తరుణంలోనే మధుర కృష్ణజన్మస్థాన్ కేసు కూడా అలహాబాద్ హైకోర్టు విచారణకు చేపట్టింది. మత చిచ్చులకు మొదలే గానీ ముగింపు వుండదు. ఈ క్రమంలో మతాల గురించి వాటిని అనుసరించే మనుషుల గురించి ఇష్టానుసారం ప్రచారాలు చేస్తూ విద్వేషాలు పెంచుకోవడం విశాల భారతావనికి విపత్కరమే.

మోడిఫికేషన్- రామిఫికేషన్

గత చరిత్రలో జరిగిందని చెబుతున్న తప్పును చక్కదిద్దడం పేరిట ఒక మత కట్టడాన్ని కూల్చి మరొకటి నిర్మించడం అదేదో అయిపోయిందిలే అనుకునే వాళ్లకు కనువిప్పు. మోడీ ప్రాణ ప్రతిష్టకు ముందు పదకొండు రోజుల నుంచి ఉపవాసదీక్ష చేయడం మీడియాలో సవివరంగా ప్రసారమైంది. ఏపీలో లేపాక్షి, తమిళనాడులో రామేశ్వరం సహా దక్షిణాదిలో రామాయణ కథలతో ముడిపడిన ప్రదేశాలను ప్రధాని అధికార హోదాలోనే సందర్శించి వివరాలు విడుదల చేశారు. ఆ విధంగా ఉత్తర దక్షిణ భారతాల మధ్య బీజేపీ ఒక మత సేతువును కట్టే వ్యూహాత్మక ప్రయత్నం చేశారు.వీటన్నిటి తర్వాత రిపబ్లిక్ దినోత్సవ పరేడ్‌లో ఉత్తర ప్రదేశ్ శకటం రామమందిర ఇతివృత్తంతో సాగింది. మోడీ రాజకీయాలను గతంలో మోడిఫికేషన్ అనటం కద్దు. ఆయన మొదటి దఫాలో అయోధ్య ప్రధాన అస్త్రంగా తీసుకోలేదు. రెండవసారి గెలిచాక కొన్నాళ్లకే సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రావడం, తర్వాత కొన్నాళ్లకే కాశ్మీర్370 రద్దు చేయడం కీలకాంశాలయ్యాయి. ఈ నాటికి రామమందిరం 2024ఎన్నికల ఎజెండాగా మార్చబడుతున్నది. ఇదంతా ఒక క్రమపద్ధతిలో వ్యూహాత్మకంగా నడుస్తున్న రాజకీయమే తప్ప యాదృచ్ఛికం కాదు. ఎందుకంటే సమాంతరంగా బీజేపీ ఎన్నికల సన్నాహాలు నడుస్తున్నాయి. హోంమంత్రి అమిత్‌షా ఆదివారం తెలంగాణ సందర్శనకు వస్తున్నారు. ఏపీలోనూ టీడీపీ జనసేన కూటమిలోకి బీజేపీ వస్తుందనే కథనాలు బలంగా వున్నాయి. తాజాగా పవన్ టీడీపీపై చేసిన వ్యాఖ్యానాల వెనక కూడా బీజేపీ హస్తం వుందని ఆ పార్టీల వారే చెబుతున్నారు. వీటన్నిటి వెనక వ్యూహం ఎటు పోతున్నదో త్వరలోనే స్పష్టం అవుతుంది.దీన్ని ఇంగ్లీషు పదంతో రామిఫికేషన్ అంటున్నారు.అంటే ఒక విధాన ప్రతిధ్వనులు.



మోడీ రాజకీయాలను గతంలో మోడిఫికేషన్ అనటం కద్దు. ఆయన మొదటి దఫాలో అయోధ్య ప్రధాన అస్త్రంగా తీసుకోలేదు. రెండవసారి గెలిచాక కొన్నాళ్లకే సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రావడం, తర్వాత కొన్నాళ్లకే కాశ్మీర్370 రద్దు చేయడం కీలకాంశాలయ్యాయి. ఈ నాటికి రామమందిరం 2024ఎన్నికల ఎజెండాగా మార్చబడుతున్నది.ఇదంతా ఒక క్రమపద్ధతిలో వ్యూహాత్మకంగా నడుస్తున్న రాజకీయమే తప్ప యాదృచ్ఛికం కాదు. ఎందుకంటే సమాంతరంగా బీజేపీ ఎన్నికల సన్నాహాలు నడుస్తున్నాయి. హోంమంత్రి అమిత్‌షా ఆదివారం తెలంగాణ సందర్శనకు వస్తున్నారు.

ఏచూరి చెప్పిందే!

జాతీయ రాజకీయాలకు వస్తే బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడిన 'ఇండియా' వేదిక ఈ వారం అనేక ఒడుదుడుకులు చూసింది. ప్రాంతీయ పార్టీల అవకాశవాద రాజకీయాల కారణంగా ఎన్నికల తర్వాత మాత్రమే (పోస్ట్‌పోల్) అవగాహన సాధ్యమని సీతారాం ఏచూరి వంటి సీనియర్ నాయకులు ముందే చెప్పిన మాటల సత్యం ఎంతో అందరికీ అనుభవంలోకి వస్తున్నది. బెంగాల్ ముఖ్యమంత్రి టిఎంసి నేత మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు తలుపులు మూయడం కూడా సీపీఐ(ఎం) వైఖరి సరైందని నిరూపించింది, ఎందుకంటే టిఎంసితో పొత్తు ప్రసక్తి వుండదని సీపీఐ(ఎం) ఎప్పుడూ చెబుతూనే వచ్చింది. పంజాబ్‌లో ఆప్ కూడా అన్ని సీట్లు తనే పోటీ చేస్తానని ప్రకటించింది. యూపీలో సమాజ్‌వాదిపార్టీకి కాంగ్రెస్‌కు గతంలోనే కుదిరింది లేకపోగా ఇప్పుడు దూరం పెరిగింది.బిఎస్‌పి మాయావతి ఎటూ ఒంటరిగానే అంటున్న స్థితి. వీటిని మించి బీహార్ ముఖ్యమంత్రి నితిశ్ కుమార్ రాజకీయ పిల్లిమొగ్గలు వీటన్నిటినీ మించిపోయాయి. అయిదోసారి ఆయన యూటర్న్ తీసుకుని బీజేపీతో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తారనే సూచనలు బలంగా వున్నాయి, మహారాష్ట్ర శివసేన కూడా ముక్కలైపోయి ప్రధాన భాగం బీజేపీతో కలిసి ప్రయాణిస్తున్నది. ఈ పరిణామాలు లౌకిక శిబిరానికి నష్టం చేసే పరిణామాలివి, అయితే దక్షిణాదిన మాత్రం బీజేపీ పెరిగే సూచనలు ఆ స్థాయిలో కనిపించడం లేదు. అంత మాత్రాన ఆ మతోన్మాద రాజకీయాల ప్రభావాన్ని ఉపేక్షించడం కూడా పొరబాటే అవుతుంది.తెలుగు నాట ప్రాంతీయ పార్టీలన్నీ బీజేపీ పట్ల అనుకూలత పాటిస్తున్న రీత్యా ఇది మరింత అవసరం. కానీ దాన్ని మరో కొసకు తీసుకెళ్లి బీజేపీకి తిరుగే లేదు గనక లోబడిపోవడమే మేలని అనేక పాలక పార్టీలూ మీడియా సంస్థలూ వాదించడం అర్థరహితం.

నిజానికి అయోధ్య లేకుండా తను నెట్టుకురాలేనని బీజేపీ భావించడం, భయపడటం వల్లనే దాన్ని త్వరగా పూర్తిచేసి ప్రారంభించారు. మోడీ గొప్పను చెబుతూనే రాముడిని ఎన్నికల సాధనంగా వాడుకోవాలనుకుంటున్నారు. ఇందులో వ్యూహంతో పాటు బలహీనతా కనిపిస్తుంది. బీజేపీ ఎంత ఆరాటపడినా దేశంలో చాలా పార్టీలు దాని నాయకత్వంలో జరిగే ఈ ఉత్సవానికి హాజరవడానికి నిరాకరించాయి. ఇది మన మీడియా రాజకీయంగా చూపిస్తుందే గాని సానుకూల కోణాన్ని చెప్పదు. వామపక్షేతర పార్టీలు కూడా రామాలయం మీ స్వంత వ్యవహారం కాదని చెప్పగలిగాయంటే ఈ దేశంలో బలమైన లౌకిక సంప్రదాయాల పునాది తెలుస్తుంది.

బీజేపీకీ సందేహాలు

నిజానికి అయోధ్య లేకుండా తను నెట్టుకురాలేనని బీజేపీ భావించడం, భయపడటం వల్లనే దాన్ని త్వరగా పూర్తిచేసి ప్రారంభించారు. మోడీ గొప్పను చెబుతూనే రాముడిని ఎన్నికల సాధనంగా వాడు కోవాలనుకుంటున్నారు. ఇందులో వ్యూహంతో పాటు బలహీనతా కనిపిస్తుంది. బీజేపీ ఎంత ఆరాటపడినా దేశంలో చాలా పార్టీలు దాని నాయకత్వంలో జరిగే ఈ ఉత్సవానికి హాజరవడానికి నిరాకరించాయి. ఇది మన మీడియా రాజకీయంగా చూపిస్తుందే గాని సానుకూల కోణాన్ని చెప్పదు. వామపక్షేతర పార్టీలు కూడా రామాలయం మీ స్వంత వ్యవహారం కాదని చెప్పగలిగాయంటే ఈ దేశంలో బలమైన లౌకిక సంప్రదాయాల పునాది తెలుస్తుంది. గుళ్లూ యజ్ఞయాగాదులతో గెలవగలమనుకున్న ప్రాంతీయ పార్టీల నేతలూ దెబ్బతిన్నారు. బీజేపీతో అనుకూలంగా వున్నారనే ఆరోపణలకు ఆస్కారమిచ్చిన బీఆర్ఎస్ కూడా ఓడిపోయింది. దక్షిణాన ఇతరచోట్ల కన్నా మతాల, మఠాల ప్రభావం ఎక్కువగా వుండే కర్నాటకలోనూ గెలవలేకపోయింది. గతంలోనూ మొన్న ఎన్నికల్లోనూ గెలిచిన రాష్ట్రాలలో కూడా బీజేపీ బలం క్షీణించింది. ఉదాహరణకు మొన్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీకి 59, కాంగ్రెస్‌కు 5 స్థానాలుండేవి. మొన్నటిసారి కాంగ్రెస్ ఓడిపోయినా సరే ఆ ఓట్ల లెక్కన చూస్తే బీజేపీకి 35, కాంగ్రెస్‌కు 29 రావచ్చని అంచనా. అచ్చగా ప్రాంతీయ పార్టీల మధ్యనే పోటీ జరిగే రాష్ట్రాలలోనూ పరిస్థితి వేరుగా వుంటుంది. ఈ కారణంగానే బీజేపీ ఒకటికి పదిసార్లు సమావేశాలు జరుపుతూ సన్నాహాలంటూ హడావుడి చేస్తున్నది. చిన్న చిన్న పార్టీల నుంచి కూడా సీట్లు లేనివారిని కూడా వెంటపడి చేర్చుకుంటున్నది. మొత్తంపైన 2019తో పోలిస్తే బీజేపీకి 90 స్థానాల దాకా కొరత రావచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.అందుకే చివరగా చెప్పాలంటే బీజేపీ మతోన్మాద రాజకీయాలను గట్టిగా ఎదుర్కొని నిలవరించాలనడంలో సందేహం లేదు. కానీ దాని విజయమేదో ఖాయమైనట్టు ఎవరైనా తలవంచక తప్పదన్నట్టు టీడీపీ, వైసీపీ వంటిపార్టీలు కానీ మీడియా సంస్థలు వ్యక్తులు గాని చెబితే తప్పక తోసిపుచ్చాలి.లౌకికతత్వం కోసం మతసామరస్యం కోసం విస్తారమైన కృషిని నిరంతరాయంగా కొనసాగించాలి. ■

సురణ్యా ప్రకటన

ప్రియమైన మిత్రులకు, తోటి బాటసారులకు,

మొట్టమొదటిగా, ప్రధానంగా నేను చెప్పదలుచుకున్నది ఏంటంటే? నాతోటి ముస్లిం పౌరులను ప్రేమిస్తున్నానని తెలియచేయడానికి, వారు నేడెదుర్కొంటున్న పరిస్థితుల పట్ల విచారం వ్యక్తపరచడానికి, నేనీ నిరసన దీక్షకు పూనుకొంటున్నాను. హిందూమతం పేరిట, జాతీయవాదం పేరిట అయోధ్యలో జరుగుతున్న ఈనాటి కార్యక్రమాలు గర్హించడానికి, నాగొంతు చించుకుని అత్యంత ఉచ్చ స్వరంలో నా అసమ్మతిని ప్రకటించడానికి ఈ క్షణాన్ని వినియోగించుకోవాలనుకుంటున్నాను. నాకు నా మొఘల్ వారసత్వం పట్ల ఉన్న ప్రేమని ప్రకటించడానికి కూడా ఈ సందర్భాన్ని వినియోగించుకుంటున్నాను. ఇది ఎవరినో రక్షించడానికి చేసే పని కాదు. ఇది నా సంస్కృతికి, ఆచార వ్యవహారాలకు సంబంధించిన విషయం.

నేను ద్రుపదని ప్రేమిస్తాను. ఖ్యాల్‌ను ప్రేమిస్తాను. కథక్‌ను ప్రేమిస్తాను. ఢిల్లీ నగరంలో ఉన్న మొఘల్, సుల్తానేట్ భవనాలను ప్రేమిస్తాను- కుతుబ్ మినార్, లేదా హుమాయూన్ సమాధి, లేదా సబ్జ్‌బుర్జ్ లేని ఢిల్లీని నేను ఊహించలేను. ఇక పక్కనే ఆగ్రాలో ఉన్న తాజ్ మహల్ సంగతి చెప్పనే అక్కరలేదు. నవాబ్ వాజిద్ అలీషా పాలనలో అవధ్ రాజకొలువు వైభవోపేతమైన సంస్కృతితో విరాజిల్లడాన్ని గౌరవిస్తాను. ఢిల్లీ సుల్తానేట్ భారతదేశానికి అత్యంత విలువైన సంస్కృతిని అందించిందని భావిస్తాను- దాంతోనే సూఫీలు, అమీర్ ఖుస తండ్రి ఇక్కడికి వచ్చారు కదా! ఉత్తర భారతదేశంలోని భాష, సంస్కృతి, హజరత్ అమీర్ ఖుస్రకి ఎంతగానో రుణపడి ఉంది. ఆయన హైందవి భాషను కవిత్వంలో ఉపయోగించారు. తదనంతరకాలంలో అది అద్భుతమైన హిందీ, ఉర్దూ భాషలుగా రూపొందాయి. ఆయన సంగీతంలో కూడా కొత్త కల్పనలు రూపొందించి శాస్త్రీయ సంగీతానికి పునాదులు వేశారు- అదే ప్రాచీన ఉత్తరభారతదేశ సంగీతంగా అవతరించింది. ఇది మనందరం గర్వించదగిన సంగీత వారసత్వం. నిజానికి ఇలా పెంపొందిన మన వారసత్వ చిట్టాకి అంతే లేదు.

ఉత్తర భారతదేశ ప్రాచీన సంస్కృతిలో, సుల్తానేట్, మొఘల్, నవాబ్, నిజాంల ముద్రలు లేని ప్రాచీన సంస్కృతి లేదంటే అతి శయోక్తి కాదు. అయితే ఇవి ఆనాటి పాలకులు రూపొందించిన సంప్రదాయాలనో, లేదా ముస్లింలు మాత్రమే మనకు జ్ఞానబోధ చేశారనో చెప్పడం కాదు. అందుకు విరుద్ధంగా, ఈ సంస్కృతి, దేశీయ కళలు, సంప్రదాయాలు, భాషలతో మొఘలులు, సుల్తానులు, మమేకవడం వలన ఏర్పడ్డవి అని చెప్పాల్సి ఉంటుంది. మనుగడలో ఉన్న సంస్కృతిని వారు అక్కున చేర్చుకున్నందు వలన ఏర్పడ్డది.

అమీరుఖుస్రు గురించి మాట్లాడేటప్పుడు ఆనాటి రాచ దర్బార్‌లో ఉన్న గొప్ప హిందూకవి గోపాల్‌నాయక్ గురించి మాట్లాడకుండా ఉండగలమా? ఖుస, గోపాల్‌నాయక్ నుండే సంగీతం గురించి ఎంతో తెలుసుకున్నారు. హిందుస్తానీ ప్రాచీన సంగీతం గురించి చెప్పుకొనేటప్పుడు లేదా కథక్ గురించి మాట్లాడుకునేటప్పుడు దపద లేదా 'రసా'లను గురించి ప్రస్తావించకుండా ఉండగలమా? పండిట్ హరిదాస్ గురించి మాట్లాడుకునేటప్పుడు తాన్సేన్‌ను విస్మరించగలమా? కథక్ సంప్రదాయాలలో రసలీలా సంప్రాదయాలు లేని రామాయణ, మహాభారతాలు ఊహించగలమా? శివుడిని కొలిచేటప్పుడు ద్రుపద్ లేకుండా ఉంటుందా? హోలీలో ఢమరుకం లేకుండా ఉండడం సాధ్యమా? అక్బర్ ఆత్మకథని రాసిన అతని కొలువులోని కవి, అబుల్ ఫజల్‌ను గురించి చదవండి. అతడు హిందువుల నమ్మకాలని, అలవాట్లని, శాస్త్రజ్ఞానాన్ని, తాత్విక చింతనని ఎలా పొగిడాడో తెలుసుకోండి. హిందువుల సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి అందించడానికి, అక్బర్ మహాభారతాన్ని పర్షియన్ భాషలోకి అనువదించడాన్ని ప్రారంభించాడని మీకు తెలుసా? అతడు మహాభారతానికి ఒక గొప్ప అభిమాని. అతనికి పర్షియన్ భాషలోకి మహాభారతాన్ని చేసిన అనువాదం వినిపిస్తే, అది అంతగా బాగులేదని కొట్టిపడేసాడట. కథక్ నృత్యాలు, నాటకాలు, కవితలు గురించి నవాబ్ వాజిద్ అలీషా కృషిని గుర్తు చేసుకోండి. అవన్నీ తన కొలువులో ఉన్న హిందూ పండితుల రాధాకష్ణుల సాంప్రదాయ ఉత్సవాలతో ప్రభావితమైనవే.

చరిత్రంతా చెప్పడం నా ఉద్దేశం కాదు. మన సంస్కృతి బహుళ సంస్కృతి అని చెప్పాలన్నదే నా ఆకాంక్ష. నేను మొఘలుల వారసత్వాన్ని ప్రేమిస్తున్నానంటే దానర్థం హిందూ, ముస్లింల రెండు సంస్కృతులనీ ప్రేమిస్తున్నానని. అవి రెండూ భిన్నంగా లేవు. పూర్తిగా కలిసే ఉన్నాయని. ఒకదాని నుండి వేరొకదానిని విడదీయలేనంతంగా మమేకమయ్యాయని. విదేశ సంప్రదాయాన్నో, భాషనో దేశీయ భాషలపై సంప్రదాయాలపై రుద్దినట్టు కాదు. రెండు సంప్రదాయాల మేళవింపుతో కొత్త సంప్రదాయాలు ఉద్భవించాయి. మొఘలుల రాజ్యంలో సంస్కృతి ఇక్కడే రూపొందినది. ఇతరదేశాల నుండి దిగుమతి చేయబడలేదు. ఈ నేల లోనే వృద్ధి చెందింది.

నేను తమిళ బ్రాహ్మణుల, పంజాబీ సిక్కుల వారసత్వాన్ని కలిగి ఉన్నాను. నా భర్త రాజస్థానీ జాట్, జాత్ శిక్కు చరిత్ర కలవాడు. సైనిక నేపథ్యం కలవాడు కూడా. అతని వారసత్వాన్ని కూడా అనుసరించడం నాకిష్టం. అందులో కూడా ఎన్నో వీరగాథలు, ధైర్య సాహసాలు ఇమిడి ఉన్నాయి- నా వారసత్వంలాగే. హిందుత్వ వాదులు మనకి ఒకే మతం,ఒకే సంప్రదాయం, ఒకే సంస్కృతి ఉండాలని అంటారు. అది వాస్తవం కాదు. మనకి వైవిధ్య భరితమైన నాగరికత ఉండవచ్చు. అందులో కొన్ని సనాతన సంప్రదాయాలు ఉంటాయి. కొన్ని ఆధునిక సంప్రదాయాలు ఉంటాయి. ఈ భిన్నత్వం అనాదిగా ఉండేదే. ఎన్నో కొత్త సంస్కృతులను ఆహ్వానించాము. కొన్నిటిని వదులుకున్నాము. అశోకుడు మూడో శతాబ్దంలోనే 'అన్ని రకాల నమ్మకాలున్నవారంతా కలిసిమెలసి నా రాజ్యంలో ఉండాలన్నది నా వాంఛ' అన్నాడు. అందరూ మంచి ఆలోచనలను, మంచి నడవడిని కలిగి ఉండడమే ప్రధానం. ఇతరుల నమ్మకాలను అర్థం చేసుకోవాలి. సంస్కృతి, స్నేహానికి, ఆహ్వానానికి ప్రతీక కావాలి.



మన సంస్కృతి బహుళ సంస్కృతి అని చెప్పాలన్నదే నా ఆకాంక్ష. నేను మొఘలుల వారసత్వాన్ని ప్రేమిస్తున్నానంటే దానర్థం హిందూ, ముస్లింల రెండు సంస్కృతులనీ ప్రేమిస్తున్నానని. అవి రెండూ భిన్నంగా లేవు. పూర్తిగా కలిసే ఉన్నాయని. ఒకదాని నుండి వేరొకదానిని విడదీయలేనంతంగా మమేకమయ్యాయని. విదేశ సంప్రదాయాన్నో, భాషనో దేశీయ భాషలపై సంప్రదాయాలపై రుద్దినట్టు కాదు. రెండు సంప్రదాయాల మేళవింపుతో కొత్త సంప్రదాయాలు ఉద్భవించాయి. మొఘలుల రాజ్యంలో సంస్కృతి ఇక్కడే రూపొందినది. ఇతర దేశాల నుండి దిగుమతి చేయబడలేదు. ఈ నేలలోనే వృద్ధి చెందింది.

రెండువేల సంవత్సరాల తరువాత అక్బర్ కూడా ఇవే మాటలన్నాడు. "సంబంధిత విచారణ చేసే కాలంలో న్యాయానికి అనుగుణంగా నడిచేవాడు, నమ్మకాలలో హేతువాదం గ్రహించేవాడు మనిషి. ఈ విధంగా చేస్తే తాళం చెవి పోయినా తాళాలు తెరుచుకోవచ్చు" అన్నాడు

'మనమేధో చక్షువులకు నిజమైన దృష్టి ఉంటే, ప్రతి వ్యక్తి తనకుతానుగా ఈ గందరగోళాల నుండి బయటపడి తన సందేహాలను తానే నివృత్తి చేసుకుంటాడు. ఇతరుల జోలికెళ్లడు. అందువలన తమలో, ఇతరులలో ఉన్న అసమ్మతిని శాంతియుతంగా పరిష్కరించుకోగలుగుతాడు. ఐకమత్యమనే నందనవనంలో కలహాల కుంపట్లు రాజేయకుండా ఉంటాడు.'

అయిదు వందల ఏళ్ల తరువాత గాంధీజీ, 'నిజమైన మతం ప్రతివ్యక్తి స్నేహపూర్వకంగా, సేవాభావంతో ఉండాలని బోధిస్తుంది. నేనీ విషయాన్ని మా అమ్మ ఒడిలో నేర్చుకున్నాను. ఇలా అంటున్నందుకు మీరు నన్ను హిందువని అనడానికి నిరాకరించవచ్చు. అందుకు నేను ఇక్బాల్, 'మతం మనకు ఇతరుల పట్ల ద్వేషాన్ని చిమ్మమని బోధించదు' అని పాడిన పాటనే మీకు సమాధానం చెప్పగలుగుతాను.'

సంప్రదాయకంగా నేను నా చిన్ననాటి నుండి ఉన్న అలవాటు ప్రకారం తమిళ బ్రాహ్మణుల పద్ధతులలో పూజలు చేసినా, నాకు నిజాముద్దీన్ దర్గా అయినా, వాటికన్ అయినా, జామా మసీదు అయినా, గణేశుడి గుడి అయినా ఒక్కటే. నేను సనాతన హిందువును కాదు. నాకు మంత్రాలన్నీ తెలియవు. ఉపవాసాలు, దీక్షలు చేయను. ప్రతిరోజూ గుడికి కూడా వెళ్లను. అయితే, హిందుత్వాన్ని ప్రచారం చేసే వాళ్ళయినా సనాతన హిందువులని అనుకోను. ఈ ఆధునిక యుగంలో సనాతన హిందువుగా జీవించడం- పెళ్ళిలో, ఆహారంలో, అలవాట్లలో, ఆహార్యంలో, జీవన విధానంలో సాధ్యపడదు. నిజానికి 22వ తేదీ జరిగే ఈ కార్యక్రమంలో కూడా హిందూ సనాతన ధర్మాన్ని అనుసరించడం లేదు - శంకరాచార్యులు సనాతన ధర్మాన్ని విస్మరించారని గొడవ చేస్తూనే ఉన్నారు.

నావరకు నాకు హిందూ మతం అంటే, దేవుళ్ల గురించి చెప్పే కథలు. అవన్నీ నిజమనిపిస్తాయి. ప్రాచీన గాధలు, యుద్ధాలు, ప్రేమలు, తాత్విక సంవాదాలు. అవన్నీ చూడకపోయినా కళ్ళకు కట్టినట్టు అనిపిస్తాయి. అవి మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని రంగులమయం చేస్తాయి. మనకు ఆత్మసంతృప్తిని కలిగిస్తాయి. నేను హార్మోనియం మోగించడం మొదలు పెట్టగానే సరస్వతీదేవి నా ముందు ప్రత్యక్షమవుతుంది. నా పిల్లల అల్లరి చూడగానే యశోద గుర్తుకొస్తుంది. అల్లరి కృష్ణుడు నాకు స్వాంతననిస్తాడు. నేను పిల్లలను పెంచుకోడానికి ఉద్యోగం మానేస్తానంటే ఫెమిస్టులంతా కన్నెర్ర చేసారు. కానీ పూర్తికాలం అమ్మగా పని చేయడంలో నాకు ఎంతో బలం, ఆత్మవిశ్వాసం కలిగాయి. హిందుత్వం బోధించే విధేయత, త్యాగం, సేవలో- మనలను మనం మరిచిపోయి తనువూ, మనసు, ధనం అర్పించడంలో- కర్తవ్యం నిర్వహించడంలో, ఆదర్శం కనిపించింది. అందువలన నేను హిందువునని నిజాయితీగా నమ్ముతాను. హిందూమతం ఇది కాదంటే నేను హిందువుని కాను.

హిందుత్వ వాదులు ప్రచారం చేస్తున్నట్టు మొఘలులు హిందూరాజులను ఓడించి రాజ్యాధికారం చేపట్టలేదు. వాళ్లు ఓడించింది ఆనాడు పాలిస్తున్న లోడిని, ఒక ముస్లిం రాజుని. అంతకు ముందు బాబర్ పంజాబ్‌లో దౌలత్ ఖాన్‌ని ఓడించాడు. నిజానికి ముస్లింలు ముస్లింలను జయించారు. బాబర్ కాబుల్‌లో ఆఫ్ఘన్లను జయించాడు. కొంతమంది చరిత్రకారులు ఇబ్రహీం లోడిని దించడానికి రాణాప్రతాపసింగ్‌కి బాబర్‌కి మధ్య ఒప్పందం కూడా కుదిరిందని అంటారు. కానీ ఇబ్రహీంలోడి ఓడిపోయి, అతని తమ్ముడు రాణాప్రతాప్ సింగ్ సైన్యంలో చేరడం వలన ఆ మిత్రుత్వం అమలుకు నోచుకోలేదు. అందువలన బాబర్ కథ-ముస్లింలు భారతదేశాన్ని ఆక్రమించారని ప్రచారంలో పెట్టిన కథ- వాస్తవ విరుద్ధం.

బాబర్ చేసిన యుద్ధాలలో హింసలేదని, విధ్వంసం లేదని నేననడం లేదు. దండయాత్ర జరిగిన తొలి నాళ్లలో హిందువులు అనేకమైన సర్దుబాట్లు చేసుకుని ఉంటారు. కానీ మొఘలులు ముస్లిం మత ప్రచారానికి మాత్రమే దండయాత్రలు చేయలేదని మనం గ్రహించాలి. అది సామ్రాజ్యవాదులకాలం. ఆ సామ్రాజ్యవాదాన్ని అంతం చేసి ప్రజాస్వామ్యం, లౌకికవాదం, పరమత సహనం కోసమే యుద్ధాలు జరిగాయి. ఇప్పటికయినా మనం ఇటువంటి అనాలోచిత విధానాలకు స్వస్తి పలకలేమా?

మొఘలులు పాలించిన 500 ఏండ్లు, వాళ్లు రాజపుత్రులకి విరోధులుగా లేరు. వాళ్ళ సైనికాధికారులలో కొందరు రాజపుత్రులు ఉండేవారు. ముస్లిం రాజుల వస్త్రధారణ, నిర్మాణ శిల్పం, సంస్కృతి రాజపుత్‌ల నుండి గ్రహించినవే. అందువలన 500 ఏళ్ల బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పే రామ జన్మభూమి కథ పచ్చి అబద్ధం. మొఘలుల పాలన అటువంటిది కాదు. అది దండయాత్రలు చేసే రాజుల ఆశ, కాంక్ష. అందులో హిందూమతం, ఇస్లాం మతం ప్రసక్తి లేదు. ఔరంగజేబు తప్ప మిగిలిన రాజులెవరు ఇస్లాం మతాన్ని నిష్టగా పాటించినవారు కాదు. అందరూ సారా తాగేవారు. నల్లమందు వేసుకునేవారు. ఉలేమాలకు బదులుగా సూఫీలను కోరుకునేవారు. నిజానికి దీన్ ఇల్లాహి కారణంగా, అక్బర్‌కి ఇస్లామేతరుడనే ముద్ర కూడా ఉంది.

జై హింద్

(కూతురు ప్రకటనకు గర్విస్తూ తండ్రి మణిశంకర్ అయ్యర్ సోషల్ మీడియా పోస్టుకు (సంగ్రహ) స్వేచ్ఛానువాదం.)

అనువాదం : కె.ఉషారాణి

యువత జీవితాల్లో వెలుగులు నింపే జీవనజ్యోతి ఈ వేదిక

- మూడు నెలల్లోనే ఉపాధి కల్పించేందుకు కృషి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన



నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు యువత జీవితాల్లో వెలుగులు నింపే జీవనజ్యోతి వేదికలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో రూ.20 కోట్లతో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇది ఒక భవనం కాదని ఎందరో నిరుద్యోగ యువతీ, యువకుల జీవితాలు, కుటుంబాల్లో వెలుగులు నింపే జీవనజ్యోతి అని అన్నారు. అందరు నాయకుల్లాగా.. తాను ప్రారంభోత్సవాలు చేసి చేతులు దులుపుకునే రకం కాదని, ప్రారంభించిన ప్రతి పనినీ పూర్తి చేసేవరకు పర్యవేక్షిస్తానని, నిర్మాణం పూర్తయిన తర్వాత స్కిల్ సెంటర్లో కోర్సు ముగిసిన రెండు నుంచి మూడు నెలల్లో ఉపాధి దొరికేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఇది తన కలల ప్రాజెక్టు అని, తనను గుండెల్లో పెట్టుకున్న నల్లగొండ యువత రుణం తీర్చుకోవడానికి తనకు దొరికిన అవకాశమని అన్నారు. యువత చెడు వ్యసనాలకు, దురలవాట్లకు లోనుకాకుండా స్కిల్‌సెంటర్‌లో చేరి మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఉద్యోగాలు రాలేదని డిప్రెషన్‌లోకి వెళ్లకుండా స్కిల్‌సెంటర్లో చేరి బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఆయన యువతకు సూచించారు. నల్లగొండ బిడ్డలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, న్యాక్ డైరెక్టర్ జనరల్ బిక్షపతి, డైరెక్టర్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న అనురాగ్ సెట్

- ప్రతిభావంతులకు రూ.6.5 కోట్ల స్కాలర్‌షిప్‌లు
- అనురాగ్ వర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ, సీఈవో నీలిమ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు 'అనురాగ్ సెట్' నిర్వహిస్తున్నామని ఆ వర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, సీఈవో నీలిమ చెప్పారు. వచ్చేనెల 11న ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో రాతపరీక్ష ఉంటుందని వివరించారు. హైదరాబాద్‌లోని ఆ వర్సిటీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అనురాగ్ వర్సిటీ సెట్‌కు ఆన్‌లైన్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. దరఖాస్తు చేసేందుకు వచ్చేనెల 10వ తేదీ వరకు గడువుందన్నారు. ఏపీ, తెలంగాణలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.6.5 కోట్ల వరకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని వివరించారు. మొదటి పది ర్యాంకులు పొందిన విద్యార్థులకు రూ.11.40 లక్షల స్కాలర్‌షిప్‌లను అందిస్తామని అన్నారు. 11 నుంచి 25 ర్యాంకుల వరకు 50 శాతం ఫీజు రాయితీ ఇస్తామనీ, ఒక్కొక్కరికీ రూ.5.70 లక్షల స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. 26 నుంచి 100 ర్యాంకుల వరకు 25 శాతం ఫీజు రాయితీతో ఒక్కొక్కరికీ రూ.2.85 లక్షలు స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. ఎంసెట్‌లో 15 వేల నుంచి 25 వేల ర్యాంకులు పొందిన వారితోపాటు జేఈఈలో 75 వేల నుంచి లక్షలోపు ర్యాంకులు పొందిన వారికి ఫీజులో పది శాతం రాయితీ కల్పిస్తామనీ, ఒక్కొక్కరికీ రూ.1.40 లక్షల స్కాలర్‌షిప్‌లు ఇస్తామని వివరించారు. అనురాగ్ సెట్ ద్వారా 75 శాతం కంటే ఎక్కువ 10+2 స్కోర్ వచ్చిన 500 మంది విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ పూర్తి చేసి ఎప్‌సెట్‌లో 20 వేల ర్యాంకు వరకు వచ్చిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. స్పోర్ట్స్ కోటాలో సీట్లు పొందే వారికి వంద శాతం ఫీజు మినహాయింపు ఉంటుందని అన్నారు. గతేడాది 19,500 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. ఈ ఏడాది 40 వేల మంది హాజరయ్యే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ విశ్వవిద్యాలయం అడ్మిషన్ల డైరెక్టర్ మహీపతి శ్రీనివాసరావు, డీన్లు వి విజయ్‌కుమార్, ముత్తారెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన అసెంబ్లీకి గులాబీ బాస్

- ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్న కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫిబ్రవరి ఒకటిన అసెంబ్లీకి రానున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేసీఆర్ తుంటి విరగటంతో ఆయనకు శస్త్ర చికిత్స నిర్వహించిన సంగతి తెలిసిందే. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఆయన కొద్ది రోజులు విశ్రాంతి తీసుకున్నారు. సంక్రాంతి కంటే ఒకరోజు ముందు ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌కు మాజీ సీఎం చేరుకున్నారు. శుక్రవారం అక్కడ ఆయన పార్టీ ఎంపీలతో సమావేశం నిర్వహించిన విషయం విదితమే. ఈ రకంగా మెల్లమెల్లగా కోలుకుంటున్న కేసీఆర్, ఫిబ్రవరి ఒకటిన అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

యూసీసీ బిల్లు ఆమోదం కోసం...

- ఫిబ్రవరి 5 నుండి ఉత్తరాఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ శాసనసభ ప్రత్యేక సమావేశాలు ఫిబ్రవరి ఐదవ తేదీ నుండి ప్రారంభమవుతాయి. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లును ఆమోదించేందుకే బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాలను ఏర్పాటు చేస్తోందని ప్రభుత్వ అధికారులు తెలిపారు. అయితే సమావేశాల అజెండాను ప్రభుత్వం ఇప్పటి వరకూ విడుదల చేయలేదు. సమావేశాల ప్రారంభానికి ముందు జరిగే శాసనసభ వ్యవహారాల సలహా సంఘం సమావేశంలో అజెండాను ఖరారు చేస్తారని సమాచారం. ఇదిలావుండగా యూసీసీ అమలుపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ వచ్చే నెల 2న పుష్కర్ సింగ్ ధామీ ప్రభుత్వానికి పూర్తి నివేదికను సమర్పించే అవకాశం ఉంది. కమిటీ పదవీకాలం ఈ నెల 26నే ముగిసినప్పటికీ దానిని రెండు వారాలు పొడిగించారు. యూసీసీని అమలు చేయబోతున్నామని రిపబ్లిక్ దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి ధామీ సూచనప్రాయంగా తెలిపారు. రాష్ట్రంలో యూసీసీ చట్టాన్ని అమలు చేస్తామని 2022 ఎన్నికల సమయంలో బీజేపీ హామీ ఇచ్చింది. యూసీసీ అమలు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు అనే అంశాలు ఎప్పటి నుండో బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఉన్నాయి. వీటిలో యూసీసీ అమలు మినహా మిగిలిన రెండూ ఇప్పటికే వాస్తవ రూపం దాల్చాయి. యూసీసీ అమలులో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు రాష్ట్రాలు కమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చునని గత సంవత్సరం జనవరిలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

కాళేశ్వరంపై నిపుణుల కమిటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యతపై నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. బ్యారేజీల పటిష్టత, కుంగిపోయిన పిల్లర్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో లోతుగా, సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే ముందుకు వెళ్లాలని సూచించారు. తాత్కాలికంగా హడావుడి చేసి మరోసారి తప్పులకు తావివ్వద్దని సాగునీటిపారుదల శాఖను సీఎం అప్రమత్తం చేశారు. సాంకేతికంగా అన్నీ విషయాలను పరిగణనలోకి తీసుకొని తదుపరి మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలపై నిర్ణయం తీసుకోవాలన్నారు. గతంలో అధికారంలో ఉన్న వాళ్లు చేసిన తప్పులకు ఇప్పటికే తెలంగాణకు భారీ నష్టం వాటిల్లిందని గుర్తు చేశారు. సుమారు లక్షన్నర కోట్లతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు రిపేర్లకు ఎనిమిది, పది వేల కోట్లు అవసరమయితే ఖర్చుకు ఆలోచించాల్సింది లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఎక్కడా రాజీ పడబోమన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) నిపుణులతో పాటు, రాష్ట్రంలోని ఇరిగేషన్ ఇంజినీర్లతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రెండు మూడు రోజుల్లోనే వీరందరితో మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. నాతోపాటు పాటు సాగునీటి శాఖ మంత్రి కూడా ఇందులో పాల్గొంటారని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి కుంగిన పిల్లర్లను రిపేర్లు చేయిస్తే సరిపోతుందా ? లేదా ఉన్నవి తొలిగించి కొత్తవి కట్టాలా ? కొన్నింటిని రిపేర్లు చేసి కొన్నింటిని కొత్తగా నిర్మిస్తే సరిపోతుందా ? అనేది ఈ కమిటీతో సమగ్రంగా అధ్యయనం చేయిస్తామని స్పష్టం చేశారు.

కృష్ణాజలాలపై అఖిలపక్షం



కృష్ణా జలాల్లో మన రాష్ట్ర నీటి వాటాలు, కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కృష్ణాజలాలకు సంబంధించి జరిగిన సమావేశాలు, కేఆర్ఎంబీ ఎజెండాలు, చర్చల వివరాలు, మినిట్స్, నిర్ణయాలు, ఒప్పందాలన్నింటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను సీఎం ఆదేశించారు. వీటన్నింటిపై అఖిలపక్ష సమావేశంలో చర్చిద్దామని సీఎం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 811 టీఎంసీల కృష్ణా జలాల వాటాలో ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలకు ఎందుకు ఒప్పుకోవాల్సి వచ్చింది ? అప్పుడేం చర్చలు జరిగాయి ? ఏమేం నిర్ణయాలు జరిగాయి? తదితర అంశాలపై అఖిల పక్ష సమావేశంలో చర్చించాలని సీఎం చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న వాదనల్లో నిజమెంత, అప్పుడు నిర్ణయాలు తీసుకున్నదెవరు, వాటన్నింటినీ ప్రజల ముందు ఉంచాలని సీఎం అన్నారు. తెలంగాణ ప్రజలకు మంచి జరిగే సలహాలు, సూచనలు తప్పకుండా ప్రభుత్వం స్వీకరిస్తుందని అభిప్రాయపడ్డారు.

'కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించలేదు'

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించినట్టు వస్తున్న ఆరోపణలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఏ ప్రాజెక్టు అప్పగించలేదనీ, ఎలాంటి ఒప్పందాలపై సంతకాలు చేయలేదని అధికారులు సీఎంకు వివరణ ఇచ్చారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 45 రోజులైందనీ, ఈ కొద్ది రోజుల్లోనే ఎప్పుడు కృష్ణాబోర్డుతో సమావేశాలు జరిగాయి.. ఎవరు హాజరయ్యారు.. ఏమేం నిర్ణయాలు తీసుకున్నారు..? మాకు తెలియకుండా అధికారులేమైనా నిర్ణయాలు చేశారా...? మీ విభాగం మీద ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతుంటే మీరేం చేస్తున్నారు..' అంటూ ఇరిగేషన్ అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక రాజకీయ పార్టీగా రాజకీయ విమర్శలు చేయడం వేరు.. శాఖా పరంగా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాయలసీమకు ఎన్ని నీళ్లు పోతున్నాయి. కృష్ణాజలాల్లో ఎంత వాటా ఉందో వాళ్లకు తెలియదా..? వాటాకు మించి నీటిని తోడుకుపోతుంటే పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏం చేసిందో.. అఖిల పక్ష సమావేశంలో చర్చకు పెడుదామని సీఎం వ్యాఖ్యానించారు.

ఆయకట్టుపై గందరగోళం

ప్రాజెక్టులవారీగా ఆయకట్టు వివరాలలో కొంత గందరగోళం ఉందని సీఎం అన్నారు. గ్రామాలు, మండలాల వారీగా ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలు సిద్ధం చేయాలని సాగునీటి శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పెండింగ్ ప్రాజెక్టులపై వివరాలను అధికారులు, సీఎంకు నివేదించారు. ప్రాధాన్యతల క్రమంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.

పాలమూరుపై ఆరా

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై సీఎం ఆరా తీశారు. కల్వకుర్తి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ఎందుకు ముందుకు సాగడం లేదని అధికారులను ప్రశ్నించారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. వీలైనంత త్వరగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ టన్నెల్ పనులను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తే 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని గుర్తు చేశారు.

అసంపూర్తి ప్రాజెక్టులకు గ్రీన్‌ఛానెల్

అసంపూర్తిగా ఉన్న కొన్ని ప్రాజెక్టులను గ్రీన్‌ఛానెల్ ద్వారా వేగంగా పూర్తి చేయాలని సీఎం అధికారులకు కీలక సూచనలు చేశారు. తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులను గుర్తించి ఆయకట్టు రైతులకు నీరందించే చర్యలు చేపట్టాలని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, నారాయణపేట కొడంగల్ లిఫ్ట్‌లను ప్రస్తావించి, తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టుల జాబితాను తయారు చేయాలని అన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ముందున్న ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులను వందశాతం పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు

వీసీల నియామకానికి నోటిఫికేషన్

- నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- వాటి సమర్పణకు తుది గడువు ఫిబ్రవరి 12

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల (వీసీ) నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా వీసీల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానించడం కోసం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఆదివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు వచ్చేనెల 12 సాయంత్రం ఐదు గంటల వరకు గడువుందని పేర్కొన్నారు. అర్హతలకు సంబంధించిన వివరాలు, దరఖాస్తు ఫారానికి సంబంధించి ఞఞఞ.ంఙ్ప్రవ.ఖఙ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు నమూనాతోపాటు బయోడేటా, అవసరమైన డాక్యుమెంట్లు, ఆధారాలను జతచేయాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (పీఎస్‌టీయూ), డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ), జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్, కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ), మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ), శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ), తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ), జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ)కు కొత్తగా వీసీలను నియమించనున్నట్టు వివరించారు. అయితే ఇందులో తొమ్మిది విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం నియమించిన వీసీలు కొనసాగుతున్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయానికి మాత్రం డి రవీందర్‌గుప్తాపై అవినీతి ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. వాకాటి కరుణ ఇన్‌చార్జీ వీసీగా కొనసాగుతున్నారు. పది వర్సిటీలకు 2021, మే 22న వీసీలను నియమించిన విషయం తెలిసిందే. వారి పదవీకాలం ఈ ఏడాది మే 21న ముగియనుంది.

దీంతో వీసీల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆ తర్వాత వర్సిటీల వారీగా సెర్చ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. వర్సిటీల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆ కమిటీ పరిశీలిస్తుంది. అనంతరం ముగ్గురు పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. వాటిని గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపిస్తుంది. ఆ తర్వాత వీసీలను ప్రకటిస్తుంది.

విద్యుత్ సంస్థల డైరెక్టర్ల నియామకం చేపట్టండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల్లో డైరెక్టర్ల నియామకాన్ని చేపట్టాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎమ్ రిజ్వీ ఆదేశించారు. ఈ మేరకు ఆ సంస్థల సీఎమ్‌డీలకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్లలో ఎక్కువమంది నిబంధనలకు విరుద్ధంగా సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్నారనీ, వారి స్థానంలో కొత్త వారి నియామకం చేపట్టాలని పేర్కొన్నారు. టీఎస్ ట్రాన్స్‌కోలో ఐదుగురు, టీఎస్ జెన్‌కోలో ఆరుగురు డైరెక్టర్ల నియామకం చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఆ ఉత్తర్వుల ప్రతిని ముఖ్యమంత్రి కార్యాలయానికీ, విద్యుత్‌శాఖ మంత్రి కార్యాలయానికి పంపారు. విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల పదవీకాలం రెండేండ్లు మాత్రమేననీ, ఆ తర్వాత గరిష్టంగా మరో రెండేండ్లు మాత్రమే పొడిగించే అవకాశం ఉన్నదని వివరించారు. కానీ ప్రస్తుత డైరెక్టర్లలో అనేకమంది 9 ఏండ్లకు పైగా అదే పోస్టులో కొనసాగుతున్నారని పేర్కొంటూ జాబితాను జోడించారు.

సోమనాథ్ ఆలయ భూమిలో ఆక్రమణలు తొలగింపు..

అహ్మదాబాద్: గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో సోమనాథ్ ఆలయం వెనుక ఉన్న భూమిలో ఆక్రమణల తొలగింపును అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు 21 ఇండ్లతోపాటు 150కుపైగా గుడిసెలను నేలమట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమనాథ్ ఆలయానికి చెందిన ట్రస్ట్, గుజరాత్ ప్రభుత్వానికి చెందిన 3 హెక్టార్ల భూమి (7.4 ఎకరాలు) ఆక్రమణలకు గురైంది. 21 ఇండ్లతోపాటు సుమారు 153 గుడిసెలను అక్రమంగా నిర్మించారు. కాగా, సోమనాథ్ ఆలయ భూమిలో ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ అధికారులు శనివారం మెగా డ్రైవ్ నిర్వహించారు.

దేశవ్యాప్త సమ్మెలో ఆశా, అంగన్‌వాడీలు
సమ్మె నోటీసు అందజేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 16న జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌లో రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొంటారని తెలంగాణ అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ), తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు శనివారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు,వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేసినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సునీత, పి జయలక్ష్మి కోశాధికారి పి మంగ, కార్యదర్శి జి పద్మ, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి జయలక్ష్మి, ఆర్ నీలాదేవి, కోశాధికారి పి.గంగమణి పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్మిక, ఉద్యోగ, సంఘాలకు అనుబంధ యూనియన్‌గా ఉన్నామని తెలిపారు. ఐసీడీఎస్ బడ్జెట్ పెంచాలనీ, ఎన్‌హెచ్ఎం స్కీంకు బడ్జెట్ పెంచాలనీ, ఆశాలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ జాతీయ సమ్మెతో పాటు గ్రామీణ ఇండ్ భాగస్వాములమౌతున్నామని పేర్కొన్నారు.

ఖమ్మం డీసీసీబీ ఛైర్మెన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- వ్యతిరేకంగా 11 మంది డైరెక్టర్ల ఓటు
- కోర్టు ఆదేశాల మేరకు 30వ తేదీ వరకు ఫలితం రిజర్వ్
- డీసీసీబీ ఛైర్మెన్ పదవి నుంచీ వైదొలగనున్న నాగభూషయ్య



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం డీసీసీబీ ఛైర్మెన్ పదవి కాంగ్రెస్‌కు దక్కనుంది. ప్రస్తుతం ఛైర్మెన్‌గా ఉన్న కూరాకుల నాగభూషయ్య పదవీకాలం మరో ఏడాది వరకు ఉండగానే ఆయన పదవి కోల్పోనున్నారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం సొసైటీలో ఛైర్మెన్ స్థానంపై డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారు. శనివారం జిల్లా సహకార అధికారి విజయకుమారి ఎన్నిక నిర్వహించారు. సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా.. ఈ ఎన్నికకు ఛైర్మెన్ నాగభూషయ్యతోపాటు ఓ డైరెక్టర్ సింహాద్రి గైర్హాజరయ్యారు. మిగిలిన 11 మంది సభ్యులు ఛైర్మెన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ నేపథ్యంలో వీవీ పాలెం ఛైర్మెన్ స్థానంతో పాటు ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గానూ నాగభూషయ్య వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోర్టు తీర్పు నేపథ్యంలో ఈ ఎన్నిక ఫలితాన్ని ఈనెల 30వ తేదీ వరకు డీసీవో రిజర్వ్ చేశారు. ఫలితం ప్రకటన అనంతరం డీసీసీబీ నూతన ఛైర్మెన్‌గా నాగభూషయ్య తప్పుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత నూతన ఛైర్మెన్ కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే డీసీఎంఎస్ ఛైర్మెన్ రాయల శేషగిరిరావుపై వివిధ రకాల ఆరోపణల నేపథ్యంలో వేటు పడింది. ఆయన స్థానంలో కొత్వాల శ్రీనివాస్‌ను నూతన అధ్యక్షుడిగా నియమించిన విషయం విదితమే.

కార్యదర్శులకే.. పంచాయతీ పగ్గాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదనను పక్కనపెట్టి కార్యదర్శులకే గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత అప్పజెప్పినట్టు తెలుస్తోంది.రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల ఐదేండ్ల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేనందున ప్రత్యేక అధికారుల పాలనవైపు ప్రభుత్వం అడుగులు వేసింది. దీంతో రాష్ట్రంలో ఉన్న 12769 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్టు స్పష్టమవుతుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామపంచాయతీలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో 647, సిద్దిపేట జిల్లాలో 499, మెదక్ జిల్లాలో 469 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రస్తుతం కొనసాగుతున్న గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది జనవరి 31తో ముగియనుంది. ఐదేండ్ల పదవీకాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ సమీప కాలంలోనే పార్లమెంట్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో మరో ఎన్నిక నిర్వహించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ప్రస్తుతం ఎన్నికల జరపాల్సి వస్తే పాత రిజర్వేషన్ కొనసాగించాలా లేక రిజర్వేషన్లను మార్పులు చేయాలనేది చట్ట పరిధిలో ఉన్న అంశం. మరోపక్క బీసీ జనగణన చేయడానికి ప్రభుత్వం మొగ్గు చూపుతున్నందున బీసీ జనాభా తేలిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలనేది మరొక సాంకేతిక సమస్యగా ముందుంది. మరోవైపు గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే వెంటనే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు కూడా జరపాల్సి ఉంటుంది. ఆ తర్వాత నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో కూడా ఎన్నికలు జరిపి తీరాలి. వరుసగా ఎన్నికలు జరపాల్సి వస్తే రాష్ట్రంలో అధికార యంత్రాంగం అంతా ఎన్నికల పనితోనే సరిపుచ్చుకోవాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పథకాలు ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులరీత్యా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా అభివృద్ధికి సంబంధించిన పనులు కూడా ముందుకు తీసుకెళ్లాలంటే ఆర్థిక పరిపుష్టిని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక పాలన తెచ్చి ఎన్నికలను వాయిదా వేసేందుకు నిర్ణయం తీసుకుంది.

31తో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం

రాష్ట్రవ్యాప్తంగా 12769 గ్రామపంచాయతీల పాలకవర్గాల ఐదేండ్ల పదవీ కాలం ఈ నెల 31తో ముగియనుంది. 2018లో తీసుకొచ్చిన పంచాయత్ చట్టం ప్రకారం అప్పట్లో తెలంగాణలో కొత్త రిజర్వేషన్లు ఖరారు చేసి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో 12769 మంది సర్పంచులు, 1,13,000 మంది వార్డు సభ్యులు ఎన్నికయ్యారు. వీరందరి పదవీ కాలం ఈ నెల 31తో ముగియనుంది.

ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేక అధికారుల పాలన

గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిపే అవకాశం లేనందున ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి రానుంది. ఐదేండ్ల పదవీకాలం ముగిసిన గ్రామపంచాయతీ పాలకవర్గాలు అధికారం కోల్పోతాయి. దీంతో గ్రామపంచాయతీల పరిపాలన వ్యవహారాలు, ప్రజల అవసరాలు, గ్రామఅభివృద్ధి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అమలుకు సంబంధించిన అంశాలను ఎవరు నిర్వహించాలనే సమస్య ముందుకు రానుంది. అందుకోసమే పంచాయతీ పాలకవర్గాలకు ప్రత్యామ్నాయంగా అధికార యంత్రాంగం ద్వారా పరిపాలన వివరాలు కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది.గతంలో ఒకటి రెండుసార్లు గ్రామ పంచాయతీలకు ఐదేండ్ల పదవీకాలం ముగిసిన వెంటనే ఎన్నికలు జరపడం సాధ్యం కానీ వేళ అప్పట్లో కూడా ప్రత్యేక అధికారుల పాలన అమలు చేశారు. ప్రస్తుతం కూడా ఎన్నికలు జరిగే అవకాశం లేనందున ప్రత్యేక అధికారులకే గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యతను అప్పజెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారి ద్వారానే రాబోయే కాలంలో పంచాయతీల వ్యవహారాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆయా గ్రామపంచాయతీలకు జిల్లా, మండలాల వారిగా ప్రస్తుతం పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను అటు ఇటుగా మార్పులు చేసి స్పెషలాఫీసర్ నియామకం చేశారు.

ఇప్పటికే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గస్థాయి నాయకులు, మంత్రులు, స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి సంబంధించిన విషయంలో పేర్లను ఖరారు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించినట్టు తెలుస్తున్నది. ఆయా గ్రామ పంచాయతీలకు నియమించబడిన స్పెషల్ ఆఫీసర్లు గ్రామపంచాయతీ పరిపాలన వ్యవహారాలు చూడనున్నారు. అదేవిధంగా మండల స్థాయిలోనూ స్పెషల్ ఆఫీసర్లు కొనసాగుతారు.

అవినీతి మరకంటకుండా జాగ్రత్త

2019లో ఎన్నికల్లో గెలిచిన గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. దీంతో తమ పదవీ కాలాన్ని మరో రెండేండ్లపాటు పొడిగించాలని రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఈ ఐదేండ్ల కాలంలో గత ప్రభుత్వం పరిధిలో గ్రామపంచాయతీ పాలకవర్గాల నేతృత్వంలో ఎంతో అభివృద్ధి జరిగినప్పటికీ అంత మేరకు అవినీతి అక్రమాల మార్క్ కూడా ఉన్నది. ఆ అవినీతి మరకను తమ ప్రభుత్వానికి అంటించుకోకూడదని భావించిన కాంగ్రెస్ సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించేందుకు సిద్ధపడలేదు. అత్యధిక మంది సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లు కావడం వల్ల కూడా వాళ్ల చేతికే మరి కొంతకాలం పంచాయతీల అధికారాన్ని కట్టబెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందికరమైన అంశం. దీంతో పర్సన్ ఇన్‌చార్జీల పాలన కాకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనవైపు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపిందని చెప్పొచ్చు.

యశోదలో "క్రిటికల్ కేర్ నెఫ్రాలజీ"పై అంతర్జాతీయ సదస్సు

ప్రారంభించిన గవర్నర్ తమిళి సై సౌందరరాజన్

- వైద్య వృత్తిలో ఓపిక ఉండాలని సూచన
- కిడ్నీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



నవతెలంగాణ- బేగంపేట్

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మూత్రపిండాల గాయం (ఏకేఐ) గణనీయంగా తగ్గింది. అయినప్పటికీ గర్భస్థ పిండం మరణాలు, గర్భధారణలో వ్యక్తి అనారోగ్యం ఒక ముఖ్యమైన సమస్యగానే ఉంది. అలాగే, మూత్రపిండాల వ్యాధులపై ప్రజలకు అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గర్భధారణ సమయంలో వచ్చే మూత్రపిండాల సమస్యలు, వాటికి అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్య విధానాలు, ఆ సమయంలో చికిత్స ఎలా అందించాలనే దానిపై హైదరాబాద్ హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మూడ్రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. యూఎస్ఏ, యూకే, యూరప్, లాటిన్ అమెరికాల నుంచి 30 మంది అగ్రశ్రేణి కిడ్నీ వైద్య నిపుణులు వచ్చిన ఈ సదస్సును రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కిడ్నీ వ్యాధులపై ప్రజలకు అవగాహన చాలా తక్కువని, దీనిపై వారికి అర్థం అయ్యేలా చెప్పడం చాలా కష్టంగా ఉండేదని అన్నారు. ప్రజల్లో అవగాహన లేక కిడ్నీ సమస్యలను కూడా సాధారణ సమస్యలుగా భావించి స్థానిక వైద్యులను సంప్రదిస్తున్నారని కానీ నెఫ్రాలజీలని కలవడం లేదని అన్నారు. కిడ్నీ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. వైద్య చికిత్సల కోసం ప్రజలు ఎంతో డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తోందని, అలాంటి వారికి ఆయుష్మాన్ భారత్ ఒక వరం లాంటిదని అన్నారు. వైద్య వృత్తి ఎంతో నమ్మకాన్ని కల్పిస్తుందని, తాను తెలంగాణ గవర్నర్‌గా వచ్చినప్పుడు కొత్త రాష్ట్రాన్ని ఎలా మేనేజ్ చేస్తుందని అన్నారని, కానీ తాను గైనిక్ డాక్టర్‌నని, తప్పకుండా మేనేజ్ చేయగలనని తన సన్నిహితులతో అన్నట్టు గుర్తు చేసుకున్నారు. వైద్య వృత్తిలో ఉన్న వారు ఓపికగా ఉండాలని, పేషెంట్‌తో ఉండాలని వైద్యులకు సూచించారు. వైద్యవిజ్ఞాన శాస్త్రంలో చోటుచేసుకుంటున్న సరికొత్త ఆవిష్కరణలపై దృష్టిసారించేందుకు.. వివిధ దేశాల వైద్య నిపుణుల మధ్య వైద్యవిజ్ఞానాన్ని పంచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలిచిందని అన్నారు. క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అత్యాధునిక అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్న యశోద యాజమాన్యాన్ని అభినందించారు.

యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ..ఏకేఐ నిర్ధారణ సీరం క్రియేటినిన్ పెరుగుదలపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రపంచంలో దాదాపు 850 మిలియన్ ప్రజలు ఏదో ఒక మూత్ర పిండాల వ్యాధితో సతమతమవుతున్నారని తెలిపారు. వీరిలో 5 మిలియన్ నుంచి 10 మిలియన్ మంది వరకు డయాలిసిస్ కానీ మూత్రపిండాల మార్పిడి కానీ అవసరమవుతోందని చెప్పారు. ప్రజల్లో మూత్రపిండాల వ్యాధులపైన, మూత్రపిండాల ఆరోగ్యంపైన అవగాహన పెంపొందించడానికి క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై.. ఆయా వ్యాధుల నిర్దిష్ట చికిత్సా విధానాల గురించి విస్తృతంగా చర్చించేందుకు, శిక్షణ ఇచ్చేందుకు అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన వైద్య నిపుణులు ఎందరో ఈ సదస్సులో పాలుపంచుకోటానికి ముందుకు రావటం సంతోషకరమని చెప్పారు.

కేరళకు సంఘీభావం..

- ఫిబ్రవరి 8న నిరసనకు ఏఐఏడబ్ల్యూయూ మద్దతు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫిబ్రవరి 8న దేశవ్యాప్తంగా కేరళ సంఘీభావ డేగా జరపాలని ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర వర్కింగ్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయరాఘవ్, బి.వెంకట్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదే రోజు బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ వివక్ష పూరిత చర్యలకు వ్యతిరేకంగా కేరళ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ఢిల్లీలో ఆందోళన చేయనున్నారని తెలిపారు. అలాగే అదే రోజున కేరళ ప్రజలు ఆ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయనున్నారని అన్నారు.

ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలపై వివక్ష పూరిత చర్యల అమలుతో బీజేపీ ప్రభుత్వం సమాఖ్య వాదంపై దాడికి పాల్పడిందని విమర్శించారు. ప్రధానంగా కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని దాడికి పాల్పడుతుందనీ, ఎందుకంటే కేరళ కార్పొరేట్ అనుకూల కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నదని తెలిపారు. లౌకిక, ప్రజాస్వామ్య విలువలతో సమ్మిళిత అభివృద్ధి సాధిస్తున్నదని పేర్కొన్నారు. కేరళలో కూలీలకు రోజువారీ వేతనం అత్యధికమని, వ్యవసాయ కార్మికులకు రోజువారీ వేతనం రూ.764.3 కాగా, నిర్మాణ రంగ కార్మికులకు రోజువారీ వేతనం రూ.852.5 ఉందని తెలిపారు.

అందరికీ సామాజిక భద్రత హామీతో కేరళ వామపక్ష ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తీసుకెళ్తుందన్నారు. వ్యవసాయ కార్మికులకు పెన్షన్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం కేరళ అని తెలిపారు. ఉపాధి హామీ కార్మికులకు సంక్షేమ బోర్డును కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అలాగే ఉపాధి హామీలో సోషల్ ఆడిట్‌ను అత్యుత్తమంగా నిర్వహించిందని తెలిపారు. నిత్యావసర వస్తువులతో ప్రజా పంపిణీ వ్యవస్థను అమలు చేస్తుందన్నారు. కేరళలో నాణ్యతతో కూడిన విద్యా, వైద్యా వ్యవస్థలను బలోపేతం చేసిందని అన్నారు. దేశంలోనే మానవవనరుల అభివృద్ధి ఇండెక్స్‌లో కేరళ ముందుందని తెలిపారు. ఏడేండ్లలో కేరళలో వామపక్ష ప్రభుత్వం 2,34,567 భూ పట్టాలను పంపిణీ చేసిందన్నారు. ఆరేళ్లలో ఇళ్లులేని పేదలకు మూడు లక్షలకు పైగా ఇండ్ల పంపిణీ చేసిందన్నారు. అందులో ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులేనని అన్నారు. ఈ పరిస్థితుల్లో కేరళ ప్రభుత్వంపైనే కాకుండా, కేరళలోని కార్మిక, పేద ప్రజలపైన బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తుందని పేర్కొన్నారు.

అసైన్డ్ చట్టాన్ని మార్చొద్దు..

ఏపీలో ఆందోళనకు ఏఐఏడబ్ల్యూయూ మద్దతు : బి వెంకట్



ఏపీలో అసైన్డ్ చట్టాన్ని మార్చడాన్ని ఏఐఏడబ్ల్యూయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రకటించారు. శనివారం నాడిక్కడ ఏపీ, తెలంగాణ భవన్‌లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మీడియాతో మాట్లాడారు. ఏపీలో జగన్ దళితుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శిం చారు. అసైన్డ్ భూముల లబ్ధిదారులు కోర్టుకు వెళ్లకుండా ఉండేలా నూతన చట్టాలు సవరించారనీ, విమర్శించారు. ఈ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనకు పూర్తి మద్దతును ప్రకటించారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ..



హైదరాబాద్ : త్యాగరాజ ఆరాధన ఉత్సవం 2024లో భాగంగా శనివారం శివాని సరస్వతుల గాత్ర కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అద్భుతమైన కీర్తనలతో శ్రోతలకు వీనుల విందైన సంగీతాన్ని అందించారు. చక్కని కీర్తనల ఎంపిక, మృదువైన రాగాలాపనతో కచేరి సాగింది. కచేరి అనంతరం శివానిని హెూప్ అడ్వర్టయిజింగ్ ప్రయివేటు లిమిటెడ్ డైరెక్టర్ కె. సునీత , కె ఎస్ రావు ఘనంగా సన్మానించారు.

ఇప్పుడు గుర్తొచ్చారా?

- కవితపై బీసీ విద్యార్థి సంఘం విమర్శ



హైదరాబాద్ : 10 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని గుర్తుకురాని కవిత గారికి అధికారం పోగానే పూలే దంపతులు గుర్తుకొచ్చారా అని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ విమర్శించారు.

తెలంగాణ జాగతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత గారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడాన్ని బీసీ విద్యార్థి సంఘం తరఫున ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కవిత గారు అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ఎందుకు అడగలేదని మహేష్ యాదవ్ ప్రశ్నించారు.

మైనార్టీలపై సీఎం ప్రతీకారం

- అందుకే మంత్రివర్గంలో స్థానం లేదు
- ఆర్ఎస్ఎస్ మూలాలే కారణం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్ఎస్ఎస్ మూలాలున్న ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి మైనార్టీలపై ప్రతీకారం తీర్చుకుంటున్నారనీ, అందుకే మంత్రివర్గంలో వారికి స్థానం కల్పించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు విమర్శించారు. గత ఎన్నికల్లో మైనార్టీలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చినందుకే వారిపై కాంగ్రెస్ పార్టీ పగ పట్టిందన్నారు. ఎన్నికలకు ముందు మైనార్టీ సెంటిమెంట్ కోసం షబ్బీర్ అలీ పేరును వాడుకున్న కాంగ్రెస్ ఆయనకు సలహాదారు పదవి ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. ఈ విషయంలో కాంగ్రెస్- బీజేపీది ఫెవికాల్ బంధం అని ఎద్దేవా చేశారు.

గత పార్లమెంట్ ఎన్నికల మాదిరే ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ బీజేపీ కుమ్మక్కవుతాయనీ, వీరి బంధాన్ని మైనార్టీలు అర్థం చేసుకోవాలని కోరారు. హెూం శాఖ కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డే తాజా మత ఘర్షణలకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. శనివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన మైనార్టీ విభాగం సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి 50 రోజుల పాలనలో ఒక్కరోజు కూడా మైనార్టీ సంక్షేమంపై సమీక్ష నిర్వహించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ బీజేపీకి లబ్ది చేకూర్చేలా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.

ఆటోలో కేటీఆర్...

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ముగించుకున్న కేటీఆర్ యూసఫ్‌గూడా నుంచి ఆటోలో తెలంగాణ భవన్‌కు వచ్చారు. మార్గమధ్యంలో ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతూ వారి సమస్యలు, కష్టాలు అడిగి తెలుసుకున్నారు. తాము చాలా ఇబ్బందుల్లో ఉన్నామనీ, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆటో డ్రైవర్ కోరారు. ఆటోల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి ప్రభుత్వం తమకు రీయింబర్స్‌మెంట్ చేస్తే బాగుంటుందని ఆటో డ్రైవర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఒత్తిడి తీసుకొస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ హామీ ఇచ్చారు.

పాలనలో పోటీ పడండి

మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజారంజక పాలనకంటే మరింత మెరుగైన పాలన చేసేలా ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి పోటీపడాలని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, బూడిద భిక్షమయ్య గౌడ్, ఎమ్ శ్రీనివాస్‌రెడ్డి హితవు పలికారు. శనివారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ తెచ్చిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి దుర్భాషలాడటాన్ని వారు తప్పుపట్టారు. రేవంత్‌రెడ్డిని తీవ్ర పరుష పదజాలంతో దూషించారు. కాంగ్రెస్ వాళ్లకు కోపం వస్తే ఐదేండ్లలోపే ఆయన సీఎంగా దిగిపోతారని విమర్శించారు.

అభయ హస్తం డబ్బులు రిలీజ్ చేయాలి


మంత్రి సీతక్కకు ఐద్వా వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అభయ హస్తం డబ్బులను మహిళల బ్యాంకు అకౌంట్‌లో జమ చేయాలని ఆలిండియా ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి, ఉపాధ్యక్షులు కేఎన్ ఆశాలత, సహాయ కార్యదర్శి ఎం వినోద, కె నాగలక్ష్మితో కూడిన బృందం శనివారం హైదరాబాద్‌లో మహిళా శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్, సభ్యులను వెంటనే నియమించాలని కోరారు. రాష్ట్రంలో నేటికీ మహిళలు, బాలికలపట్ల వివక్ష, లైంగిక దాడులు, హత్య లు, కిడ్నాప్‌లు కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరకట్న వేధింపులకు ఎంతోమంది మహిళలు బలవు తున్నారని చెప్పారు. పేదరిక నిర్మూలన, వృద్ధాప్య సమయం లో పెన్షన్, బీమా సౌకర్యంతోఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. 18 నుంచి 53 ఏండ్ల వయస్సున్న 47,05,672 మంది తెల్లరేషన్ కార్డు దారుల నుంచి ఏడాదికి రూ.308 వసూలు వేసిందని తెలిపారు. కార్పర్ ఫండ్ నుంచి వచ్చే వడ్డీతో వీరి నెలవారీ పెన్షన్, వారి పిల్లలకు స్కాలర్ షిప్పు, ఎల్ఐసీ ద్వారా జీవిత బీమా చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఆ పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. పేద మహిళలు చెల్లించిన డబ్బు తిరిగి ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. రూ. ఆరు కోట్ల అభయం హస్తం బకాయిలను లబ్దిదారుల అకౌంట్లలో జమచేయాలని లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నేటికీ సుమారు నాలుగు వేల మారు మూల గ్రామాలు, గూడెలకు, తండాలకు బస్సు సౌకర్యం లేదనీ, ఆ గ్రామాలకు బస్సు సర్వీసులు కల్పించాలని కోరారు.

నేడు సింగరేణి ఆఫీసర్ల సంఘం ఎన్నికలు

ఓటు వేయనున్న 2,200 మంది అధికారులు



నవతెలంగాణ - కోల్‌సిటీ

కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) ఆర్గనైజేషన్ ఎన్నికలు ఆదివారం జరుగుతున్నాయి. అర్ధరాత్రికి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. సింగరేణి సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న అధికారుల సమస్యలు, వారి సంక్షేమార్థం కంపెనీ యాజమాన్యంతో చర్చించి పరిష్కరించేందుకు స్థాపించిన అసోసి యేషన్ కొత్త కమిటీని ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికకు కార్పొ రేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ కె. గురువయ్య చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. జనవరి 12 నుంచి 19 వరకు ఎస్సీసీఎల్ బ్రాంచ్ కమిటీ, ఏరియా కమిటీల వారీగా నామినేషన్ స్వీకరణ పూర్తయింది. ఎనిమిది పదవులకు సంబంధించి దాదాపు వంద మందికిపైగా అభ్యర్థు లు బరిలో ఉన్నారు. అధ్యక్ష పోటీలో 8 మంది అభ్యర్థులు, ఉపాధ్యక్షుడికి 10, ప్రధాన కార్యదర్శి పోటీలో 4, జాయింట్ సెక్రెటరీ పదవికి 14, ట్రెజరర్ పదవికి ఇద్దరు, అసిస్టెంట్ ట్రెజరర్‌కు ముగ్గురు పోటీ పడుతు న్నారు. ఒక్కరే పోటీ పడుతున్న అభ్యర్థులు ఏకగ్రీవం కానున్నారు. సింగరేణి వ్యాప్తంగా మొత్తం 2,200 మంది ఆఫీసర్లు ఈ ఎన్నికల్లో ఓటు వేస్తున్నారు. గతంలో ఏరియాల వారీగా ఎన్నికలు నిర్వహించి వాటిలో గెలిచిన కమిటీలు సింగరేణి బ్రాంచ్ కమిటీని ఎన్నుకునే విధానం ఉండేది. ప్రస్తుతం డైరెక్ట్‌గా ఎన్నిక జరుగ నుంది. సింగరేణి బ్రాంచ్ కమిటీకి, ఏరియా కమిటీకి వేర్వేరుగా ఓటు వేసే విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. 30 ఏండ్ల కిందట నిలిచిపోయిన ఈ విధానాన్ని ప్రస్తుత ఎన్నికల్లో పునరుద్ధ రించారు. సింగరేణి బ్రాంచ్ కమిటీతో పాటు ఏరియాల వారీగా కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం, హైదరాబాద్ సింగరేణి భవన్, మణుగూరు, ఇల్లం దు, రామగుండం 1, రామగుండం 2, రామగుండం భూపాలపల్లి, జైపూర్ ఎస్టీపీపీ, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి కమిటీలకు ఎన్నిక జరుగనుంది. ఈ ఎన్నిక పూర్తయిన తర్వాత ఆదివారం రాత్రి వరకు ఫలితాలు తేలనున్నాయి.

జార్ఖండ్ సీఎంకు మళ్లీ సమన్లు

రాంచీ : భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి సమన్లు జారీ చేసింది. ప్రశ్నించేందుకు వీలుగా ఈ నెల 29 లేదా 31 తేదీల్లో అందు బాటులో ఉండాలని ఈడీ సూచించి నట్లు విశ్వసనీయ వర్గాలు శనివారం తెలిపాయి. ఈడీ పంపిన సమన్లు అందాయని, సకాలంలో సమాధానం ఇస్తానని సొరేన్‌ను ఉటంకిస్తూ ఆ వర్గాలు తెలియజేశాయి. ఈ నెల 13న సొరేన్‌కు ఈడీ తొమ్మిదోసారి సమన్లు జారీ చేసింది. ఈ నెల 27-31 తేదీల మధ్య అందుబాటులో ఉండాలని అందులో సూచించింది. అయితే ఆయన నుండి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. దీంతో ఆయనకు తాజాగా సమన్లు అంద జేసింది. ఈడీ అధికారులు ఈ నెల 20న తొలిసారిగా సొరేన్ నివాసానికి వెళ్లి ఆయన స్టేట్‌మెంటును నమోదు చేశారు. విచారణాధికారులు సుమారు ఏడు గంటల పాటు సొరేన్ నివాసంలో గడిపారు. అయినప్పటికీ విచారణ పూర్తి కాకపోవడంతో తాజాగా సమన్లు జారీ చేసినట్లు తెలిసింది.

పరువు నష్టం కేసులో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ

రూ.692 కోట్ల భారీ జరిమానా

న్యూయార్క్ : పరువునష్టం కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఎదురుదెబ్బ తిన్నారు. మన్‌హటన్ ఫెడరల్ కోర్టు 83.3 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం దాదాపు 692 కోట్ల రూపాయలు) మేర ఆయనకు భారీ జరిమానా విధించింది. ట్రంప్ తన పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ అమెరికాకు చెందిన మాజీ కాలమిస్ట్ జీన్ కరోల్ దాఖలు చేసిన కేసులో న్యూయార్క్‌లోని మన్‌హటన్ ఫెడరల్ కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. నష్ట పరిహారం కింద దాదాపు 152 కోట్ల రూపాయలు, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా మరో 540 కోట్ల రూపాయలు చెల్లించాలని ట్రంప్‌ను ఆదేశించింది.

కాగా, ఫెడరల్ కోర్టు తీర్పు హాస్యాస్పదమన్న ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా న్యాయవ్యవస్థ నియంత్రణ కోల్పోయిందన్నారు. బైడెన్ ప్రభుత్వం న్యాయవ్యవస్థను రాజకీయ ఆయుధంగా వాడుతోందని ఆరోపించారు. ఫెడరల్ కోర్టు తీర్పును సవాల్ చేయనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

డీప్ ఫేక్ కలకలం...!

అమెరికాలో అధ్యక్ష ఎన్నికల వేళ ... డీప్ ఫేక్ కాల్స్ కలకలం రేపాయి. ఈ ఎన్నికల్లో ఓటెయ్యొద్దు .. అంటూ జోబైడెన్ వాయిస్‌తో ఓటర్లకు డీప్ ఫేక్ కాల్స్ వెళ్లాయి. దీనిపై వైట్‌హౌస్ స్పందించింది. ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్ కు చెందిన అభ్యంతరకర దృశ్యాలపై కూడా వైట్ హౌస్ ఆందోళన వ్యక్తం చేసింది.

వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ మాట్లాడుతూ ... తప్పుడు చిత్రాలు, సమాచార వ్యాప్తిపై తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామన్నారు. సమస్య పరిష్కారానికి చేయగలిగిందంతా చేస్తామని చెప్పారు. ఈ డీప్ ఫేక్ కాల్స్‌ను కట్టడి చేసే విషయంలో సామాజిక మాధ్యమ సంస్థలదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ఎక్స్(ట్విటర్) వంటి సంస్థల్లో నిబంధనలు ఉన్నప్పటికీ.. టేలర్ స్విఫ్ట్ కు సంబంధించిన అభ్యంతరకర దశ్యాలను తొలగించలేకపోయారని ఆరోపించారు. అవి 17 గంటల పాటు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. 45 మిలియన్లకుపైగా వ్యూస్ వచ్చాయి. ఈ అభ్యంతరకర చిత్రాలపై టేలర్ స్విఫ్ట్ చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కాగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్ ఇప్పటికే అయోవా, న్యూ హ్యాంప్ షైర్‌లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. అధ్యక్ష పదవికి నామినేషన్ కోసం పోటీపడిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల్లో ముగ్గురు ఇప్పటికే తప్పుకున్నారు. దీంతో ప్రస్తుతం పోటీ అంతా ట్రంప్, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ మధ్యే ఉంది.

రఠ్రీ దేవి, ఆమె కుమార్తెలకు ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ : మనీ లాండరింగ్‌తో ముడిపడిన ఉద్యోగాల కోసం భూమి కేసులో ఇడి చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ఢిల్లీ కోర్టు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవి, ఆమె కుమార్తెలు మీశా భారతి, హేమా యాదవ్‌లతో పాటూ మరికొంతమందిని విచారణకు హాజరు కావాల్సిందిగా సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ముందుకు సాగడానికి అవసరమైన సాక్ష్యాధారాలు వున్నాయంటూ ఫిబ్రవరి 9న తమ ముందుకు హాజరు కావాలని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్, నిందితులను ఆదేశించారు.

ఈ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో వున్న వ్యాపారవేత్త అమిత్ కత్యాల్‌కు కూడా వారంటు జారీ చేశారు. యాదవ్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కత్యాల్‌తో పాటూ రైల్వే ఉద్యోగి, లబ్దిదారుడు హృదయానంద్ చౌదరి, షారిఖ్ బరిల పేర్లు కూడా ఈ చార్జిషీట్‌లో వున్నాయి. గతేడాది నవంబరులో కత్యాల్‌ను ఇడి అరెస్టు చేసింది. బీహార్ మాజీ సిఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు కూడా సమన్లు జారీ అయినా ఆయన ఇంకా సాక్ష్యమివ్వాల్సి వుంది. ఇప్పటికే ఒకసారి సాక్ష్యమిచ్చిన డిప్యూటీ సిఎం తేజస్వి యాదవ్‌ను మరోసారి రావాల్సిందిగా ఇడి కోరింది. ఈ కేసులో ఇడి అనుబంధ చార్జిషీట్ దాఖలు చేస్తుందని భావిస్తున్నారు.

రోడ్డుపై బైఠాయింపు

- కేరళ గవర్నరు వికృత పోకడలు!
- కేంద్రం వత్తాసు
- జడ్ ప్లస్ కేటగిరీ భద్రత



తిరువనంతపురం : కేంద్ర ప్రభుత్వ ఏజెంట్‌లా వ్యవహరిస్తూ జగడాలమారిగా పేరొందిన కేరళ గవర్నరు అరిఫ్ మహ్మద్ ఖాన్ వికృత పోకడలు అంతకంతకూ శ్రుతిమించుతున్నాయి. కేరళలో శనివారం నాడు ఆయన ప్రవర్తించిన తీరు అందరినీ విస్మయానికి గురిచేసింది. కేరళ రాష్ట్ర గవర్నరు ఆరీఫ్ మహ్మద్ ఖాన్‌కు కేంద్ర ప్రభుత్వం సిఆర్‌పిఎఫ్ బలగాలతో జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించింది. విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపడాన్ని సహించలేని గవర్నరు రోడ్డు పక్కన కుర్చీ వేసుకుని గంటసేపు బైఠాయించారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టడం, కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలకు మద్దతుగా గళాన్ని వినిపించడం, విశ్వవిద్యాలయాలపై పెత్తనం సాగించాలనుకోవడం వంటి చర్యల నేపథ్యంలో ఆరీఫ్ పట్ల రాష్ట్రవ్యాప్తంగా కొద్దిరోజులుగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దానిలో భాగంగానే విద్యార్థులు నల్ల జెండాలతో ఎదురేగి నిరసన తెలిపారు. శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిని అరెస్టు చేయాలని, కేసులు పెట్టి ఆ కాపీ తెచ్చేదాకా తాను ఇక్కడి నుంచి లేవనంటూ భీష్మించుక్కూర్చొన్నారు. అంతేకాదు నీలామల్ ప్రాంతం వద్ద కారు దిగి వారితో విద్యార్థులతో వాగ్వాదానికి దిగారు. శాంతి భద్రతలను పర్యవేక్షించే అధికారులపైనా ఆయన రుసరుసలాడారు. దాడికి పాల్పడే వారిని పోలీసులు ప్రోత్సహించేలా ముఖ్యమంత్రి విజయన్ చర్యలు తీసుకున్నారంటూ నిందలేశారు. అత్యంత నాటకీయంగా రోడ్డు పక్కనే గల టీ దుకాణంలోని కుర్చీని లాక్కుని గంట పాటు అక్కడే కూర్చుండి పోయారు. పోలీసులు వెంటనే ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆ కాపీ తీసుకువచ్చి ఇచ్చేవరకు అక్కడే వున్నారు. ఖాన్ బృందం ఆ కాపీని కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఇ మెయిల్ చేశారు. ఆ వెనువెంటనే గవర్నర్‌కు, రాజ్‌భవన్‌కు సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో భద్రతను పెంచుతున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయి.

గవర్నర్ అనాలోచిత ప్రవర్తన కేరళకే సవాలు : పినరయి విజయన్

గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ప్రవర్తన అపరిపక్వంగా ఉందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. గవర్నర్ కొంత కాలంగా వ్యవహరిస్తున్న తీరు ఏమీ బాగోలేదు. ఆయనకు ఏమైందో తెలియదు. ఇప్పుడు ఆయన చేస్తున్నది కేరళ మొత్తానికి సవాల్ అని ముఖ్యమంత్రి విలేకరుల సమావేశంలో అన్నారు. పదవుల్లో ఉన్నవారిపై నిరసనలు రావడం సహజం. ఇలాంటి నిరసనలు జరిగినప్పుడు అధికార స్థానాల్లో ఉన్నవారి వైఖరి ఎలా ఉంటుందన్నదే ముఖ్యం.

నిరసనలపై ఈ గవర్నర్ వ్యవహరించిన తీరు ముమ్మాటికీ ఆక్షేపణీయం.. సాధారణ భద్రతా చర్యలకు విరుద్ధంగా గవర్నర్ ఇప్పుడు వ్యవహరించారు. ఆందోళనకారులను నిలువరించడం పోలీసుల బాధ్యత. గవర్నర్ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఎఫ్ఐఆర్‌ను పట్టించుకోకుండా ఉండబోమని ఓ అధికారి చెప్పడం ఇదే తొలిసారి. ప్రస్తుతం సీఆర్పీఎఫ్‌కి భద్రతను అప్పగించారు. రాష్ట్ర అధినేతకు ప్రభుత్వం అత్యుత్తమ భద్రతను కల్పించింది. గవర్నర్ భద్రతను కేంద్రానికి అప్పగించడం విచిత్రంగా కనిపిస్తోంది. కేరళలోని కొందరు ఆర్ఎస్ఎస్ సభ్యులకు కేంద్రం భద్రత కల్పించింది. ఆ జాబితాలోకి గవర్నర్ కూడా చేరారు. గవర్నర్ కోరుకున్నట్లు సీఆర్పీఎఫ్ పనిచేయగలదా? చట్టం అధికారానికి మించినది. గవర్నర్ వైఖరి ఏమాత్రం అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి విషయాల్లో విజ్ఞత ప్రదర్శించాలి. ఇప్పటి వరకు గవర్నర్‌ను కోరలేదు. ఉన్నత పదవుల్లో ఉండాల్సిన వారు చూపాల్సిన పరిపక్వత గవర్నర్‌కు లేదు. ఇటువంటి వ్యక్తిని కేరళ ఇప్పటి వరకు చూడలేదు. కేరళకు సవాల్ గవర్నరే. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా గవర్నరు వ్యవహరించిన తీరు అవమానకరం. రాజ్యాంగాన్ని కూడా అవమానించడమే. విధాన ప్రకటన ప్రసంగం చదవడానికి సమయం దొరకని గవర్నర్ ఒక గంట పాటు రోడ్డుపైనే బైఠాయించారు. చట్టం అన్నిటికంటే ఉన్నత మైనదని గవర్నర్‌తో సహా అందరూ అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు.

కారును ఢీకొన్న ట్రక్కు..

- పంజాబ్‌లో ఐదుగురు మృతి

హోషియార్పూర్ : పంజాబ్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. కారులో చెలరేగిన మంటల వల్ల వారంతా సజీవదహనమయ్యారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. ఇక ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి పంజాబ్‌లోని జలంధర్ - పఠాన్‌కోట్ రహదారిపై ట్రక్కు కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. జలంధర్ నుంచి మొకేరియన్‌కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు దసూయా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ హర్ప్రేమ్ సింగ్ తెలిపారు. కారు ఉండి బస్సి గ్రామం వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత రోడ్డుకు అవతలివైపు నుంచి ఎదురుగా వస్తున్న ట్రక్కు కారును ఢీకొట్టింది. దీంతో కారులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తిని సివిల్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హర్యానాకు చెందిన ట్రక్ డ్రైవర్ సుశీల్ కుమార్‌కు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనపై విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

పాక్‌లో న్యుమోనియా విజృంభణ

- మూడు వారాల్లో 200 మందికి పైగా చిన్నారుల మృతి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో న్యుమోనియా వ్యాధి విజృంభిస్తోంది. ఈ వ్యాధి కారణంగా గత మూడు వారాల్లోనే 200 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. అతిశీతల వాతావరణం కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నట్లు పంజాబ్ ప్రావిన్సు ప్రభుత్వం వెల్లడించింది. 'పంజాబ్ ప్రావిన్సులో జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 10 వేలకు పైగా న్యుమోనియా కేసులు నమోదయ్యాయి. 220 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వీరంతా ఐదేళ్ల లోపు పిల్లలే. లాహెూర్‌లోనే 47 మంది చనిపోయారు.

నవతెలంగాణపై స్పందన

ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు

(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,050	100
22 క్యారెట్లు	57,800	100
కిలో వెండి	78,000	500

చికెన్ ధరలు

హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 107
రిటైల్ (లైవ్)	రూ. 129
స్కిన్‌తో	రూ. 187
స్కిన్‌లెస్	రూ. 213





నిర్లక్ష్యపు వెలుగులు..

నవతెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురి డివిజన్ ప్రభాత్ నగర్, సాయి నగర్ కాలనీలో ఉదయం ఆరు గంటలలోపే వీధిలైట్లు బంద్ చేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పగలు కూడా వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయి. పై అధికారుల నిర్లక్ష్యం వలనే సమయానికి వీధిలైట్లు బంద్ చేయడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

విద్యుత్ మరమ్మతుల పరిశీలన



నవ తెలంగాణ - చైతన్యపురి

విద్యుత్ అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ సబ్ స్టేషన్ల వార్షిక మరమ్మతుల్లో భాగంగా శనివారం 33/11 కెవి నాగోల్ , మారుతి నగర్ సబ్ స్టేషన్లు వాటికి అనుగుణంగా ఉన్న 11కేవీ లైన్లను మరమ్మతులు చేశారు. ఈ మరమ్మతులను సరూర్‌నగర్ ఆపరేషను డివిజనల్ ఇంజనీర్ కె కె రామకృష్ణ, లైన్స్ డివిజనల్ ఇంజనీర్ బి సంగమేశ్వర, ఏడీఈ లు తిరుపతయ్య ప్రభాకర్, బాల్యా నాయక్, ఏఈ లు పర్యవేక్షించారు.

వాటర్ వర్క్స్ ఎండీని కలసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ- ఎల్బీనగర్

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శనివారం మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ సుదర్శన్ రెడ్డిని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా గతంలో దాదాపు 80 కిలోమీటర్ల మేర నూతన వాటర్ పైప్ లైన్స్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దానికి తోడుగా మరో 18 కిలోమీటర్ల మేర అదనపు వాటర్ పైప్ లైన్స్ మంజూరు చేయాలని కోరారు. శివారు ప్రాంతాల్లో ఉన్న వారికి ఎంతో మేలు చేసినట్టు అవుతుంది అని తెలిపారు. అలాగే శివారు ప్రాంతాల అభివృద్ధి కోసం నూతన యూ.జీ.డీ.డ్రైన్స్ మంజూరు చేయాలని కోరారు. దానికి దాదాపు 40 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలన్నారు. అనంతరం మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా మరో 18 కిలోమీటర్ల నూతన వాటర్ లైన్స్ మంజూరు చేస్తామని తెలిపారు. నూతన యూ.జీ.డీ.లైన్స్ కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనకు సుధీర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ కార్పొరేట్ విధానాలను ఎండగట్టాలి

- ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు



నవతెలంగాణ - ధూల్ పేట్ / సంతోష్‌నగర్

బీజేపీ కార్పొరేట్ విధానాలను ఎండగట్టాలని తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు అన్నారు. హమాలీల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్ ఫెడరేషన్ (సీఐటీయూ) హమాలీ కార్మికులను పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆల్ హమాలీల తెలంగాణ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం సంతోష్ నగర్ ఆఫీసులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుండి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. పదేండ్లుగా రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా..కార్మిక వర్గం పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. కోడ్స్ అమలైతే కనీస వేతనాలు నిర్ణయించే విధానాలను స్వస్తి చెబుతుందన్నారు. దీంతో సంఘం పెట్టె హక్కు, సమ్మె చేసే హక్కు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వెల్ ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. పోరాటాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాలు తిరిగి 12గంటల పని విధానం అమలులోకి తెస్తుందన్నారు. కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాలలో అమలు చేయాలని చూస్తుందన్నారు. ఏండ్ల తరబడి హమాలీలుగా పనిచేసినా ఇప్పటివరకు హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని మండి పడ్డారు. ఫిబ్రవరి 16న నిర్వహించనున్న సమ్మెలో హమాలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి దండ్లు పల్లి సత్తయ్య, యాదగిరి, ఉపాధ్యక్షులు చెన్నయ్య, బి. రాములు, వీరయ్య, సత్యనారాయణ, కుర్మయ్య, నరసింహ, సాయిలు, సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రవణ్ కుమార్, మీనా, విట్టల్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఝూన్సీపై పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరం



- ఈటల రాజేందర్

నవతెలంగాణ - చైతన్యపురి

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝూన్సీపై పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాజేంద్రనగర్ లో పోలీసుల చేతిలో గాయపడి కొత్తపేట హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఝూన్సీని శనివారం ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయాలకు పెద్ద ఎత్తున భూములు అవసరం ఉంటుందన్నారు. ప్రాక్టికల్ గా నేర్చుకునే కోర్సులు కూడా ఉంటాయన్నారు. అలాంటి రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయ భూమిని కోర్టు కోసం కేటాయించారని, కోర్టు కట్టవద్దని కానీ, కోర్టుకు వ్యతిరేకంగా ఏబీవీపీ ఉద్యమాలు చేయడం లేదన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల వేల ఎకరాల భూములు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అమ్ముకోవడానికి భూములు వస్తున్నాయి కానీ కోర్టుకు లేవా? మా భూములు ఎందుకు ఇస్తున్నారని విద్యార్థులు ఉద్యమం చేస్తున్నారని వివరించారు. వారిపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల ఆగ్రహానికి గురికాకతప్పదు అని హెచ్చరించారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



కార్పొరేటర్ రంగా నరసింహా గుప్తా

నవతెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురి డివిజన్‌లోని బాబు కాంప్లెక్స్, ఇందిరానగర్, భవాని నగర్‌లలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని కార్పొరేటర్ రంగా నరసింహా గుప్తా అన్నారు. ఈ మేరకు శనివారం ఆ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త రోడ్లు , కొత్త యుజిడి లైన్స్ పనుల కోసం సుమారు రూ.30 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ.. త్వరగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్పొరేటర్ వెంట వాటర్, డ్రైనేజ్ ఏఈ రవీందర్ రెడ్డి, ఇంజినీరింగ్ ఆఫీసర్ సాయి కుమార్, వాటర్ వర్క్స్ ఇనిస్పెక్టర్ సురేందర్, జవాన్ శ్రీకాంత్,

కోదండ రామ్‌ను కలసిన ఉద్యమకారుల ఫోరం



నవతెలంగాణ-హయత్ నగర్

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరామ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రకటించడంతో..ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోదండరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన్ను కలిసిన వారిలో రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాద్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమంలో
ప్రజానాట్యమండలిది చురుకైన పాత్ర



- సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన ఘనత ప్రజానాట్యమండలిదని భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో సమానత్వం, సమాజ మార్పు, కళాకారుల సమస్యల తోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ నుండి హన్మకొండ వరకు బస్సు యాత్ర చేపట్టారు. ఈ యాత్ర శనివారం ఎల్బీనగర్ నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా సామిడి శేఖర్ రెడ్డి అధ్యక్షతన ఘనస్వాగతం పలికారు. తర్వాత ప్రజానాట్యమండలి బస్సు యాత్ర రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, పల్లె నర్సింహ తోపాటు యాత్రలో పాల్గొన్న కళాబృందం ఎల్బీనగర్ సర్కిల్ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజానాట్యమండలి సారా ఉద్యమంతో మొదలుకొని దళిత, ఆదివాసుల హక్కులపై, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, అలాగే తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిందని గుర్తుచేశారు. మతోన్మాద అనువాదాన్ని బలవంతంగా ప్రజలపైన రుద్దేస్తూ, హిందూ మత దేశంగా మార్చే ప్రయత్నాలను ప్రజల్లో అవగాహన కల్పించి, చైతన్య పరచాల్సిన బాధ్యత కళాకారులదేనని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్రను గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఈ ప్రభుత్వమైనా కళాకారులను ఆదుకోవాలని కోరారు. వారికి హెల్త్ కార్డుల తోపాటు ప్రమాద బీమా, డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులు, పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గౌడ్, ఎల్బీనగర్ నియోజకవర్గ కో కన్వీనర్ బాతరాజు నర్సింహ, నాగోల్ డివిజన్ అధ్యక్షుడు సుధాకర్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు రమావత్ నక్రు, నియోజకవర్గంలోని వివిధ శాఖల కార్యదర్శులు శ్రీదేవి, సరిత, అరుణ, సుజాత, పారిజాత, అనిత, ఉమారాణి ముత్తయ్య, నాగరాజు, అనిల్, జ్యోతి, సౌజన్య శివజ్యోతి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

నవతెలంగాణ - సంతోష్ నగర్

ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. ముసరాంబాగ్ డివిజన్ పరిధిలోని ముస్లిం సోదరులు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైద్యుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఇటువంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ముస్లిం సోదరులు, నాయకులు, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత సమాజాన్ని నెలకొల్పాలి



ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

నవతెలంగాణ - సంతోష్ నగర్

ప్రమాద రహిత సమాజాన్ని నెలకొల్పాలి అని హైదరాబాద్ జిల్లా సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కర్మన్ఘాట్ లారీ అడ్డా వద్ద శనివారం సేఫ్టీ, రోడ్డు భద్రత అవగాహన అవేర్నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ ట్రాఫిక్ సీఐ నరసింహా నాయక్, ఎస్ఐ వెంకటప్ప, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు'



నవతెలంగాణ-తుర్కయంజాల్

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్ ఈ కరుణాకర్ బాబు అన్నారు. ఈ మేరకు శనివారం డీఈ యాదగిరితో కలిసి తుర్కయంజాల్ పట్టణంలోని ఎస్సీ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం మంచిరెడ్డి కిషన్ రెడ్డి కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అభ్యర్థించడంతో.. వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కరెంటు బిల్లులను సకాలంలో చెల్లించి, సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏడీ వినోద్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రీడలతోనే మానసిక ప్రశాంతత



కార్పొరేటర్ దీపిక శేఖర్ రెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

నేటి సమాజంలో క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడలోని ఏవైఆర్ క్రీడా మైదానంలో శనివారం అల్మాస్ గూడ ప్రీమియర్ లీగ్ విజేతలు సీవైఆర్ కాలనీ జట్టుకు కప్‌తో పాటు ప్రైజ్ మనీ, రెండో విజేత ఆర్ఎంఆర్ జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, మనోధైర్యం కలుగుతుందన్నారు. అంతేకాదు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందన్నారు. లీగ్ పోటీలను ఏర్పాటు చేసిన ఏవైఆర్ గ్రౌండ్ అధినేత శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిడి వీరకర్ణా రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన
విద్యనందించడం 'శివాని' సొంతం

- కళాశాల చైర్మెన్ డాక్టర్ పి రామ్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం శివాని మహిళా కళాశాల సొంతమని ఆ కళాశాల చైర్మన్ డాక్టర్ పి రామ్ రెడ్డి అన్నారు. కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రావ్ భవనంలో శనివారం నిర్వ హించిన శివాని జూనియర్ మహిళా కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నామని, కళాశా లలో విద్యార్థినులకు అవసరమైన ఇన్ఫ్రా స్ట్రక్చర్ ను ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. అనంతరం సెక్రెటరీ, కరస్పాం డెంట్ వెదిరే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. తర్వాత విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రేమ్ నాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ అనిత , సిబ్బంది విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



'మిస్రిగంజ్ పరిధిలో తాగునీటి సరఫరా బంద్'



నవతెలంగాణ - ధూల్ పేట్

మిస్రిగంజ్ పరిధిలోని ప్రాంతాలలో రెండు(48గంటలు) రోజులు తాగునీటి సరఫరా బంద్ అని జలమండలి ఏజీఎం అబ్దుల్ హకీం తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో మిస్రిగంజ్ రిజర్వాయర్‌ను క్లీనింగ్ చేయడం కోసం షట్‌డౌన్‌ను చేపట్టమన్నారు. దీని కారణంగా పురానాపూల్‌కు సరఫరా అవుతున్న పార్ధివాడ, దూద్‌బౌలి, కబుతర్ ఖానా, సనమ్‌గల్లి, మూసబౌలి, షాహ్‌గంజ్, జలాల్ కుంచా ముర్గీ చౌక్, బారగల్లీ, భైరూపియా గల్లి, గులాబ్ సింగ్ బౌలి, చెలాపురా, హైకోర్టు, శక్కర్ కోట, కోకర్ వాడి, పెట్లబుర్జ్, రికాబ్‌గంజ్, మిరాన్‌గల్లి మంజ్, కాలిగ్‌గల్లి ప్రాంతాలలో 48 గంటల వరకు ప్రభావితమవుతుందన్నారు. ఈ ప్రాంతాలలో నీటి సరఫరా ఉండదన్నారు. ఈ అసౌకర్యాన్ని నివారించడానికి నీటిని సంప్రదాయబద్ధంగా, సౌకర్యవంతంగా ఉపయోగించాలని అభ్యర్థించారు.

బడంగ్‌పేట్‌ను ఎంతో అభివృద్ధి చేశాం



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కోట్లాది రూపాయల నిధులతో ఎంతో అభివృద్ధి చేశామని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయంలో బడంగ్‌పేట్ కౌన్సిల్ సభ్యుల పదవీకాలం నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా శనివారం జరిగిన వేడుకలకు మేయర్ హాజరై మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా తమకు, మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు, కార్పొరేటర్లకు, కో ఆప్షన్ సభ్యులకు, అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మీ అందరీ సహాయ, సహకారాలతో బడంగ్‌పేట్ అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కమిషనర్ సుమన్ రావు, డీఈఈ జ్యోతి, ఏఈ వినీల్ గౌడ్, మేనేజర్ నగేష్, ఆర్ఓ చంద్ర శేఖర్ రెడ్డి, టీపీఓ. లాలప్ప, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మేడ్చల్-ఉప్పల్
ఆదివారం | జనవరి 28, 2024 | www.navatelangana.com

ఆచార్య కోదండరాంకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ఉద్యమ నాయకులు ఆచార్య కోదండరాం ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు తామరపల్లి నరసింహారెడ్డి, అంతిరెడ్డి మాధవరెడ్డి, వేముల శంకర్‌లు శనివారం మర్యాదపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకేలు అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కోదండరాం ప్రముఖ పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నిరుదోగులు, రైతులు, ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేరబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా యాటవెల్లి హన్మంత్‌రెడ్డి నియామకం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు యాటవెల్లి హన్మంత్ రెడ్డిని శనివారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయి పదవిని కట్టబెట్టిన రాష్ట్ర అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండ తోడ్పడుతానని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన బండారి



నవతెలంగాణ-కాప్రా

రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్‌లోని రోడ్ల గురించి చర్చించినట్లు బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన వెంట కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబురాలు విజయవంతం



నవతెలంగాణ-కాప్రా

జనవిజ్ఞాన వేదిక, మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను శ్రీమేధావి జూనియర్ కళాశాల, కమలా నగర్, ఈసీఐఎల్‌లో శనివారం నిర్వహించారు. శ్రీ మేధావి జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ రవి సోమ, ప్రిన్సిపాల్ శ్రవంతి ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాప్రా, మల్కాజిగిరి మండలాల మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబురాలను తమ కళాశాల నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. చెక్‌ముకి టెస్టు రాసిన విద్యార్థులందరూ భవిష్యత్తులో సైన్స్ రంగాల్లో ఉన్నత స్థితికి చేరాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఆనంద్ కుమార్, పిట్టల నాగరాజు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక 35 ఏండ్లుగా చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలాధ్యక్షులు శ్రీనివాస్ , శివ ప్రసాద్ మాట్లాడుతూ ఈ పోటీ ల్లో ప్రతిభ కనబర్చిన వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు యూనిక్ హై స్కూల్ చింతల్ సూర్య నగర్ కుత్బుల్లాపూర్‌లో ఫిబ్రవరి నాలుగో తేదీన జరిగే జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు సోమయాచారి, శివ శంకర్ రెడ్డి, దుర్గా చారి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, శ్రీ మేధావి కాలేజ్ ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్షిప్‌లో ప్రణయ్‌రాజ్‌కు ప్రథమ స్థానం



నవతెలంగాణ-ఉప్పల్

డబ్ల్యూపీసీ తెలంగాణ రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్షిప్-2024 పోటీల్లో ఉప్పల్ లోని శేషసాయి నగర్‌కు చెందిన జె. ప్రణయ్‌రాజ్ ప్రథమ స్థానం సాధించారు. డబ్ల్యూపీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఇంటూరి రేఖ ఆధ్వర్యంలో రామచంద్రాపురం కొల్లూరులోగల వీ.డీ.ఎల్. ఫిట్‌నెస్ సొల్యూషన్స్‌లో డబ్ల్యూపీసీ తెలంగాణ రెండో రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్షిప్-2024 పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు మేడ్చల్ జిల్లా నుంచి ప్రణయ్ రాజ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. టీన్ త్రీ అండర్-60కిలోల కేటగిరీ డెడ్‌లిఫ్ట్‌లో 140 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 64 కిలోలు, పుష్ పుల్‌లో 205 కిలోల బరువు ఎత్తి ఆ మూడింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచారు. అనంతరం నిర్వాకుల నుంచి పతకాలను, ప్రశంసాపత్రాలను అందుకున్నాడు. ఈ సందర్భగా డబ్ల్యూపీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఇంటూరి రేఖ మాట్లడుతూ.. ఈ పోటీల్లో విజయం సాధించిన వారు త్వరలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రణయ్ రాజ్ మాట్లాడుతూ.. స్థానిక ద్వారకా నగర్‌లోని స్లిమ్ లయన్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ అశోక్ వద్ద శిక్షణ పొందినట్లు తెలిపారు. కోచ్ సూచనలు, సలహాలు, మెళకువలు ఈ విజయానికి ఎంతగానో దోహదపడ్డాయన్నారు.ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీసీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నేతలు, పలు ఫిట్‌నెస్ జిమ్‌లకు చెందిన కోచ్‌లు పాల్గొన్నారు.

'మత రాజకీయాలను.. పెంచి పోషిస్తున్న మోడీని గద్దె దింపాలి'



నవతెలంగాణ-కాప్రా

మత విద్వేష రాజకీయాలను పెంచి పోషిస్తున్న మోడీని గద్దె దింపాలని, సంక్షేమ ఫలాలను లబ్ధిదారులందరికీ అందించాల్సిన బాధ్యత పాలకులదేనని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఉప్పల్ మండల కౌన్సిల్ సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి పి. రామ్ నారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ మత రాజకీయాలను ప్రజలు గమనించాలని కోరారు. మతం పేరిట ప్రజల మధ్య చీలికలు తెచ్చే నీచపు పోకడలను పౌరులంతా తిప్పికొట్టాలన్నారు. మోడీ అన్ని మతాలను, కులాలను సమానత్వంగా గౌరవించాలే తప్పా.. ఒకే మతానికి వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింతగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులను అర్హులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, సీపీఐ ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి కె. ధర్మేంద్ర, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు టి. మల్కయ్య, జంగారెడ్డి, భిక్షపతి, నర్సింగ్ రావు, స్వామిదాస్, జాన్, కృపాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సామాజిక వ్యాపారుల రాజధానిగా మారుస్తాం

- ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- సోషల్ స్టార్టప్ సమ్మిట్ ఇంపల్స్ 2024 ప్రారంభం



నవతెలంగాణ-కీసర

ఈ ఏడాదిలో తెలంగాణను సామాజిక వ్యాపారుల రాజధానిగా మారుస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోషల్ ఎంటర్‌ప్రెన్యూవర్‌షిప్ (ఎస్ఈ)ను ప్రోత్సహించేందుకు ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) తెలంగాణ సహకారంతో, బాల వికాస సెంటర్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిల్ బిజినెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక వ్యాపార సమ్మిట్ ఇంపల్స్- 2024 కార్యక్రమం కీసర మండలంలోని రాంపల్లి దాయరా గ్రామంలోని బాలవికాస సెంటర్ ఫర్ సోషల్ అండ్ రెస్పాన్సిబిల్ బిజినెస్ ప్రాంగణంలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 7000 గ్రామాల్లో అనేక సామాజిక కార్యక్రమాలతో సేవలందిస్తున్న బాలవికాసను అభినందించారు. హైటెక్ సిటీలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ నూతన హంగులతో వ్యాపారాలను ప్రోత్సాహించడం ఒక వంతైతే, సమాజంలో సమస్యలను రూపు మాపడానికి అట్టడుగు గ్రామీణ ప్రాంతాల ఆలోచనలకు పదును పెడుతూ, వారి ఆలోచనల ద్వారా సమాజంలో 10మందికి ఉపయోగపడే వేదికను రూపొందించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సంక్షేమాన్ని పెంపొందించడంలో కోటీశ్వరులు కావాలని కోరుకుంటున్నామని తెలిపారు. సమాజాభివృద్ధికి ఇలాంటి సామాజిక ధృక్పతంతో చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. గ్రామీణ ప్రజల ఆలోచనలను ఆచరణలో పెట్టాలని, అందులో భాగంగానే టీ-హబ్‌తో బాలవికాస ఒప్పందం కుదుర్చుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలో సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సాహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం త్వరలో కొత్త పాలసీని తీసుకురాబోతోందని పేర్కొన్నారు. దానితో సామాజిక వ్యాపారన్ని మరింత ప్రోత్సాహంచే విధంగా దృష్టి సారిస్తామన్నారు. వచ్చే ఏడాదిలో తెలంగాణను సామాజిక పారిశ్రామికవేత్తల రాజధానిగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సదస్సుకు దేశ వ్యాప్తంగా సుమారు 500మంది సామాజిక వ్యాపార వేత్తలు, ఇంపాక్ట్ ఇన్వెస్టర్లు, పలు వ్యాపార రంగ నిపుణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 60కి పైగా సామాజిక వ్యవస్థాపకులు తమ సామాజిక వ్యాపార ఉత్పత్తులను సోషల్ స్టార్టప్ ఎక్స్ పో లో ఆవిష్కరించారు. బాల వికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి మాట్లాడుతూ.. బాలవికాస 45 ఏండ్లుగా చేస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. నూతన ఆవిష్కరణలు ఆదాయాన్ని సమకూర్చేకంటే సమాజంలోని సమస్యలను తీర్చే విధంగా ఉండాలన్నారు. పెరుగుతున్న జనాభాకు ఉద్యోగ అవకాశలు కల్పించడం ఏ ప్రభుత్వం ద్వారా కాదని, ఇలాంటి ఆలోచనలతో ఉన్న వారికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తే కొంతమందికి ఉపాధి దొరుకుతుందని మంత్రి శ్రీధర్ బాబు కి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాలవికాస వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా జింగ్రాస్, జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి , మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, అరవింద్ ఐ కేర్ సిస్టం డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ ప్రజ్ఞా, బీవీరాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మెన్ విష్ణు రాజు, డైరెక్టర్ రాహుల్ భరద్వాజ్, డైరెక్టర్ సునీతా రెడ్డి, బాలవికాస మేనేజర్లు లతా, ప్రతాప్ రెడ్డి, మంజుల, శివరాం,ముస్కె బాల్ రెడ్డి, విజేందర్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై నోటీసులు ఇచ్చి.. చేతులు దులుపుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు

- గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి
- దీనంతటికీ కారణం ప్రజాప్రతినిధుల ఒత్తిడేనా





నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులతో సరిపెట్టుకుంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట్, సోమారం, పూడూరు గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. అక్రమ నిర్మాణదారులపై పంచాయతీ కార్యదర్శులు పెంచుకుంటున్న మమకారమో లేక అభిమానమో తెలియదు గానీ అక్రమ నిర్మాణాలను ఆపకుండా నోటీసులతో సరిపెట్టుకోవడం పట్ల ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. పేదవాడు చిన్నపాటి గృహ నిర్మాణం చేపడితేనే దగ్గరుండి కూల్చివేసే అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసిన నోటీసులతో సరిపెట్టుకోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గృహ నిర్మాణాలు పూర్తయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై ఆంతర్యం ఏమిటోనని గుసగుసలాడుకుంటున్నారు. ఉన్నత స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు అక్రమ నిర్మాణాల పట్ల పలువురు ఫిర్యాదులు చేసినా పట్టించుకోక పోవడానికి కారణాలు ఏమిటో తెలియాల్సి ఉంది. సోమారం గ్రామంలో చేపడుతున్న అక్రమ నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్‌ను వివరణ కోరగా ఈ నెల 19 తేదీన మొదటి నోటీస్ ఇచ్చామని తెలిపారు. కాగా అప్పటికే అక్రమ నిర్మాణం పూర్తయి పెయింటింగ్ దశకు రావడం గమనార్హం.

శివ నగర్ కాలనీ అభివృద్ధికి కృషి : బండారి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ శివనగర్ కాలనీ అభివృద్ధి కి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కాలనీ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. నూతన డ్రయినేజీ, రోడ్లకు ప్రతిపాదనలు పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాలనీ అసోసియేషన్ సభ్యులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని గోపాల్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లడుతూ.. సీసీ కెమెరా ఏర్పాటుతో ఇండ్లు, ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలతోపాటు ఇతర ప్రాంతాల్లో భద్రతా నిఘా పెంచుకోవచ్చని తెలిపారు. కాలనీల్లో దొంగతనాలు జరిగే దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. దొంగలకు పట్టించటంలో సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమం లో కాలనీ ప్రెసిడెంట్ హేమలత, చైర్మెన్ శ్రీహరి, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని నూతన సలహాదారులు టి.సత్యరెడ్డి సమక్షంలో శనివారం ఎన్నుకున్నారు. సలహాదారులుగా కె.చంద్ర మోహన్, టి.సత్యారెడ్డి, అధ్యక్షుడిగా కె.వెంకటాచారి, ఉపాధ్యక్షులు గా పిఎస్. జగదీశ్వర్, కృష్ణ, కె.మధుబాబు, ఎస్. భువనచంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వి సాంబశివరా వు, సంయుక్త కార్యదర్శులుగా యు.ఈశ్వరరావు, పి.వెంకటేశం, ఈ.రామచంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమేష్ బాబు, వి.ప్రమోద్ కుమార్, డి సురేష్, కోశాధికారిగా టి.నరేందర్ రెడ్డి ఎన్నికయ్యారు.

కార్యవర్గ సభ్యులుగా ఓంకార్, అమర్, అఖిల్, రవీంద్ర కుమార్, కుమారస్వామి, వాసుదేవన్, వెంకటేశ్వర్లు లక్ష్మి సూర్యనారాయణ మూర్తి, సంతోష్, రాజశ్రీ, యం. శ్రీనివాస్‌జీ, రాందాస్, ఎన్నికయ్యారు

బోరు బావి తవ్వించిన రాజిగళ్ల నవీన్ కుమార్



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడుచింతలపల్లి మండలం ఉద్దేమర్రి గ్రామంలోని సౌడమ్మ దేవాలయం వద్ద నీటి సదుపాయం కోసం వార్డు సభ్యులు రాజిగాళ్ల నవీన్ కుమార్ శనివారం బోరు బావి తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవుల వినతి మేరకు బోరు బావి తవ్వించినట్లు పేర్కొన్నారు. రాజిగళ్ల నవీన్ కుమార్‌కు యాదవ సంఘం వారు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

గద్దర్ విగ్రహావిష్కరణను అడ్డుకోవడం హేయం

- ఆయన జయంతి, వర్ధంతిని, ప్రభుత్వమే నిర్వహించాలి
- మహనీయుల ఉత్సవ కమిటీ



నవతెలంగాణ- జవహర్‌నగర్

బహుజన రాజ్యాధికారం కోసం ఎన్నో కలలుగన్న ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక చిహ్నం ఏర్పాటును వ్యతిరేకించడం హేయమైన చర్య అని జవహర్ నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మొగిలి పాక పరశు రాములు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ..గద్దర్ జయంతి సందర్భం గా రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్ మున్సిపాలిటీలో గద్దర్ స్మారక చిహ్నం ఏర్పాటును కొన్ని అదృశ్య శక్తులు అడ్డుకోవడం పిరికిపంద చర్య అని మండిపడ్డారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి గద్దర్ కృషి చేశారని చెప్పారు. గద్దర్ విగ్రహ ఆవిష్కరణకు అడ్డంకులు సృష్టిస్తుంటే ప్రభుత్వం చోద్యం చేస్తుందని ఎద్దేవా చేశారు. జనవరి 31న గద్దర్ విగ్రహావిష్కరణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తామని జవహర్ నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపా రు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అవాంతరాలు లేకుండా కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సైనికపురిలో ఆటమ్స్ సెలూన్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హెయిర్ బ్యూటీ, నెయిల్ సర్వీసులను సరికొత్తగా అందిస్తూ కస్టమర్స్‌ను ఆకట్టుకుంటున్న ఆటమ్స్ సెలూన్ మూడో బ్రాంచ్‌ను సైనికపురి డిఫెన్స్ కాలనీవాసుల కోసం అందుబాటులోకి తెచ్చింది. శనివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆటమ్స్ సెలూన్ బిజినెస్ హెడ్ శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ హెయిర్ బ్యూటీ, బ్రైడల్, నెయిల్ ఆర్ట్ వంటి అన్ని సర్వీసెస్‌ను ఎక్స్‌పర్ట్స్‌తో అందిస్తున్నాం అన్నారు. కస్టమర్లకు అందుబాటులో ఉండే విధంగా ప్రైజ్ అమైబిషన్ క్వాలిటీ సర్వీస్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ బ్రాంచ్‌ను ఓపెన్ చేశామని తెలిపారు.

విద్యార్థులను తీర్చిదిద్దేలా అనురాగ్ యూనివర్సిటీ కృషి

- సీఈవో ఎన్. నీలిమ



నవతెలంగాణ-ఘట్కేసర్

అధ్యాపకులు నిత్యం అధ్యాయనం చేసినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ఆ దిశగా అనురాగ్ యూనివర్సిటీ యాజమాన్యం కృషి చేస్తుందని అనురాగ్ యూనివర్సిటీ సీఈవో ఎన్. నీలిమ అన్నారు. శనివారం ఘట్కేసర్ మండలం వెంకటాపూర్ యూనివర్సిటీ ఆవరణలో నిర్వహించి న అనురాగ్‌సెట్ 2024 ప్రెస్‌మీట్‌లో సీఈవో ఎస్. నీలిమ, రిజిస్ట్రార్ డాక్టర్ బాలాజీ ఉల్లాతో కలిసి మాట్లాడుతూ.. అనురాగ్ సెట్ ద్వారా మెరిట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.6.5 కోట్ల స్కాలర్ షిపులు అందిస్తామన్నారు. ఇంజనీరింగ్, వ్యవసాయం, నర్సింగ్ కోసం ఈ ఏడాది అనురాగ్ సెట్ ఫిబ్రవరి 11 నుంచి షెడ్యూల్ చేశామన్నారు. ఈ పరీక్షలను ఆఫ్ లైన్ ఆన్ లైన్‌లో నిర్వహిస్తామని చెప్పారు. 1 నుంచి 10 ర్యాంకు సాధించిన విద్యార్థులకు 100 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామని పేర్కొన్నారు. అంటే రకూ.11,40,000 స్కాలర్ షిప్, 11 నుంచి 25 వరకు ర్యాంక్ సాధించిన వారికి 50 శాతం ఫీజు రాయితీ అంటే రూ.8, 70,000 స్కాలర్ షిప్, 26 నుంచి 100 ర్యాంక్ సాధించిన విద్యార్థులకు 26 శాతం ఫీజు రాయితీ రూ.2,58,000 అందిస్తున్న ట్లు ఆమె తెలిపారు. ఈఏపీసెట్ లో 1 నుంచి 10వేల ర్యాంక్ సాధించిన విద్యార్థులకు 300 శాతం ఫీజు రాయితీలంటే రూ.70,000, 10001 నుంచి 15000 వరకు ర్యాంక్ సాధించిన విద్యార్థులకు 25 శాతం, 18001 నుంచి 28000 ర్యాంక్ సాధించిన విద్యార్థులకు 10 శాతం ఫీజు రాయితీ, జేఈఈలో 1 నుంచి 50 వేట ర్యాంక్ సాధించిన విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ రూ. 6. 70,00, 80001 నుంచి 78000 ర్యాంక్ సాధించిన విద్యార్థులకు 25 శాతం. 75001 నుండి లక్ష ర్యాంక్ సాధించిన విద్యార్థుకు 10 శాతం రాయితీ ఇవ్వడానికి యాజమాన్యం నిర్ణయించిందని అన్నారు. 10 ప్లస్2 స్కోర్‌తో అనురాగ్ సెట్ ద్వారా 73 శాతం కన్న ఎక్కు వచ్చి యునివర్సిటీలో చేరుతున్న 500 మంది విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందిస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియ ట్ విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఈఏపీ సెట్‌లో 20వేల ర్యాంక్ సాధించిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రాయితీ ఇస్తామన్నారు. ఈ ఏడాది స్పోర్ట్స్ కోటా ద్వారా అడ్మిషన్లు పొందే విద్యార్థులకు 100శాతం ఫీజు రాయి తీతో కూడిన స్కాలర్ షిప్, రానున్న విద్యా సంవత్సరం లో వికి, ఇతర ఆర్ట్స్‌లో అడ్మిషన్లు పొందే విద్యార్థుల కు స్కాలర్‌షిప్పు అందించాలని యాజమాన్యం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి. విజయ్ కుమార్, అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ మహీపతి శ్రీనివాస్ రావు, ఎక్సామినేషన్ డీన్ ప్రొఫెసర్ ముత్తారెడ్డి, అకాడమిక్ డీన్ కె. సుధీర్ రెడ్డి, డీన్ విష్ణుమూర్తి, డాక్టర్ తార సింగ్ ఠాకూర్, అనురాగ్ పల్లా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చెన్నకేశవ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు స్నాక్స్ వితరణ



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యేవరకు ప్రతీరోజు సాయంత్రం స్నాక్స్ వితరణ చేయడానికి ఉమ్మడి శామీర్‌పేట మాజీ ఎంపీపీ బి.చంద్రశేఖర్ యాదవ్ ముందుకువచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ వెంకటేశం, ఉపాధ్యాయులు తిరుమలేష, నాగ శారద, అన్నపూర్ణ, అమీనా, వనజ, వరలక్ష్మి, శ్రీదేవ్షి, మంజుల, శైలజ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్‌లో 2 వారాల బయోటెక్నాలజీ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

[illegible]హెచ్ బయోటెక్నాలజీ విభాగంలో ఈ నెల 29వ తేదీ నుంచి 8 ఫిబ్రవరి వరకు [illegible] ఉద్యోగులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవటానికి వినియోగించుకోవాలని కో ఆర్డినేటర్లు తెలిపారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు




నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి సర్కిల్ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ ఇండస్ టవర్స్ లిమిటెడ్ వారు, బస్తీ మధ్యలో టవరు నిర్మాణం చేపడుతున్నారని అంజయ్యనగర్ బస్తీ వాసులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ నరసింహ యాదవ్ తెలిపారు. అందుకు శనివారం ఎమ్మెల్యే సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించి జీహెచ్ఎంసీ డిసి, టౌన్ ప్లానింగ్ ఏసిపికి వారిపై తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ గౌడ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్ రావు, ఏనుగుల తిరుపతి, డివిజన్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు చిన్ననాటి నుంచే విద్యతోపాటు, క్రీడల్లో రాణించి మండల, రాష్ట్ర, దేశ ప్రతిష్ట ఇనుమడింప జేయాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. డిసెంబర్ 20 న తేదీన జరిగిన మండల స్థాయిలో కబడ్డీ పోటీల్లో జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ కు చెందిన చైతన్య విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రన్నర్స్ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు, ట్రస్మా రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు, పాఠశాల చైర్మెన్, కర స్పాండెంట్ శివరాత్రి యాదగిరితో కలిసి రన్నర్స్ ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అప్పుడే వారు ఉన్నత శిఖరాల అధిరో హిస్తారని ఆకాంక్షించారు. విద్యార్థులు చేసిన పలు విన్యాసాలు, ప్రదర్శించిన పిరమిడ్, మార్చ్ పాస్ట్, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ శివరాత్రి సాయితేజ, డైరెక్టర్లు శివరాత్రి మంగాదేవి, డాక్టర్ శివరాత్రి శృతివిద్య, శివరాత్రి నిఖిల్, ఎస్.ఎస్.యు.ఐ.రాష్ట్ర నాయకులు గొల్ల జాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృతజ్ఞత యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా రాష్ట్రంలోనే 85,576 ఓట్ల అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞత యాత్రలో భాగంగా శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ 25వ డివిజన్ పరిధిలోని ఆల్విన్ మాజీ ఎంప్లాయిస్ ఎన్టీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన కృతజ్ఞత యాత్ర సమావేశంలో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గౌడ్‌తో కలిసి పాల్గొన్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి మరోసారి పట్టం కడుతూ అఖండ మెజారిటీని అందించిన కుత్బుల్లాపూర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఎంఎల్ఏ గెలుపునకు కృషి చేసిన కార్పొరేషన్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ,కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసి బీఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్ కన్నుమూత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్ (95) అల్వాల్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులున్నారు. గత ఏడాది ఆయన కుమారుడు రమేశ్ కుమార్ మరణించారు. 1978-83 కాలంలో కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి జనతా పార్టీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సంతాపం

కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే బి.మచ్చేందర్ రావు మరణ వార్త తెలుసుకొన్న మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మృతుడి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మచ్చేంధర్ ప్రజల మనిషి అని,ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కంటోన్మెంట్ నియోజ కవర్గం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఢిల్లీ పరమేష్, డోలి రమేష్, పవన్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి



- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ మూసాపేట్‌కు చెందిన చున్నుపాషా తిరిగి సొంతగూటికి చేరారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను మియాపూర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో మరింత అభివృద్ధి చెందే విధంగా చూడాలన్నారు. కాలనీ సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వారికి బండి రమేష్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలని తెలిపారు. మూసాపేట్‌కి చెందిన చున్ను పాషా, వహీద్, లక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి బండి రమేష్ పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి రఘు, తూము వేణు, సతీష్ గౌడ్ డివిజన్ ప్రెసిడెంట్, తూము సంతోష్, స్వరూప, ఎల్లేష్, కాజా పాషా, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, పార్టీ శ్రేణులు శనివారం శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారు.

నవతెలంగాణ-దుండిగల్



కలిసి పని చేద్దాం రండి..!

- కాంగ్రెస్‌ను వీడిన నేతలకు అధిష్టానం పిలుపు
- గ్రేటర్‌లో అసెంబ్లీ ఫలితాల విశ్లేషణతో ఆహ్వానం
- అంతర్మథనంలో పార్టీని వీడిన పలువురు నేతలు



'పార్టీలో అన్యాయం జరిగిన మాట వాస్తవమే. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు జెండా మోసి.. అధికారంలోకి వచ్చే ముందు పార్టీని వీడటం దురదష్టకరం. జరిగింది.. జరిగిపోయింది. సర్దుకుపోదాం రండి. అందరం కలిసి పని చేసి రానున్న పార్లమెంట్, లోకల్‌బాడీ, మున్సిపాల్టీ ఎన్నికల్లో పార్టీని గెలిపించుకుందాం' అంటూ టికెట్ ఆశించిన భంగపడి పార్టీని వీడిన వారితో కాంగ్రెస్ అధిష్టానం సంప్రదింపులు చేస్తోంది.

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా.. నగరంలో పరాజయాన్ని మూటకట్టుకోవాల్సి వచ్చింది. దీంతో అధిష్టానం అంతర్మథనంలో పడింది. టికెట్ దక్కలేదని కొందరు.. గుర్తింపు ఇవ్వడం లేదని మరికొందరు.. ప్రలోభాలకు లొంగి ఇంకొందరు ఎన్నికలకు ముందు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కొందరు నాయకులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. జిల్లాలోని ఐదు స్థానాల్లోనూ ఓటమి పాలు కావడాన్ని కాంగ్రెస్ జీర్ణించు కోలేకపోతోంది. సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో గడ్డు పరిస్థితి ఏర్పడటాన్ని పార్టీ తీవ్రంగా పరిగణించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, అందుకు కారణాలను విశ్లేషించి.. కనీసం జీహెచ్ఎంసీ ఎన్నికల వరకైనా సంస్థాగతంగా బలపడేందుకు పార్టీని వీడిన పాత పార్టీ శ్రేణులను తిరిగి ఘర్ వాపసీకి చర్యలకు ఉపక్రమించింది.

కీలక నేతలపై నజర్..

గత ఎన్నికల ముందు ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో టికెట్ ఆశించిన కీలక నేతలు పార్టీని వీడారు. దాదాపు జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగింది. కొందరు బీఆర్ఎస్, మరికొందరు బీజేపీలో చేరారు. ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ముఖ్య నేతలు పార్టీని వీడారు. వారి వెంట పార్టీ క్యాడర్ సైతం నడిచింది. అంతకు ముందు సైతం ముఖ్యమైన మరికొందరు నేతలు పార్టీని వీడారు. తిరిగి వారిని పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇక్కడే ఉండాలా..? కాంగ్రెస్‌లో చేరాలా..? అని అంతర్మథనంలో పడ్డారు. లోక్‌సభ, జీహెచ్ఎంసీ ఎన్నికలే టార్గెట్‌గా అధికార కాంగ్రెస్ ఘర్ వాపసీకి సిద్ధమైంది. మరో రెండు నెలల్లో లోక్‌సభ, ఏడాదిన్నర కాలంలో బల్దియా ఎన్నికలు జరగ నుండటంతో సంస్థాగతంగా బలపడేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. మళ్లీ ఆ పరిస్థితి రావద్దని ఇప్పటి నుంచే ప్రయత్నిస్తోంది.

నేతల్లో అంతర్మథనం..

ఊహించని విధంగా హస్తం అధికారంలోకి రావడంతో పార్టీ మారిన వారిలో అంతర్మథనం మొదలైంది. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ మల్కాజిగిరి టికెట్ ఆశించారు. అనూహ్యంగా ఆ టికెట్‌ను అప్పటి అధికార బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు ఖరారు చేశారు. మనోవేదనతో నందికంటి శ్రీధర్ బీఆర్ఎస్‌లో చేరారు. ఉప్పల్‌కు చెందిన రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అసెంబ్లీ టికెట్లు ఆశించి భంగపడ్డారు. దీంతో ఇరువురు నేతలూ టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ శిరీష కూడా బీఆర్ఎస్‌లో చేరారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి గెలుపొందినా.. పార్టీ అధికారంలోకి రాకపోవడంతో వీరిద్దరికీ నిరాశే మిగిలింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఖంగుతిన్నారు. ఈ ఇద్దరు నేతలు రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు. ఇక వీరితోపాటు మరి కొందరు చోట, మోటా నాయకులు సైతం పార్టీని వీడి ఆహ్వానం రావడంతో కాంగ్రెస్‌లో చేరాలా..? బీఆర్ఎస్‌లోనే కొనసాగాలా..? అనే సందిగ్ధంలో పడ్డారు. వీరు అధికార పార్టీలో చేరుతారా..? లేదా..? తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

జేఎన్టీయూహెచ్‌లో ఇద్దరు ప్రొఫెసర్లు కన్వీనర్లుగా నియామకం




నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణా స్టేట్ కౌన్సిల్ అఫ్ హైయర్ ఎడ్యుకేషనల్ వారు 2024లో జరగనున్న TS EAPCET 2024 గాను జేయన్‌టీ యూనివర్సిటీలో సివిల్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్.డీన్ కుమార్‌ను బీటెక్, బిఈ, బి ఫార్మ్, ఫార్మ్ డీ తదితర కోర్సులకు కన్వీనర్‌గా నియామకం చేసినట్టు సెక్రటరీ స్టేట్ కౌన్సిల్ డా.శ్రీనివాస్ రావు తెలియచేశారు. అదే విధంగా జేయన్‌టీయూలో మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి డాక్టర్ ఎ.అరుణ కుమారిని ఎమ్ఇ, యంటెక్, ఎమ్ ఫార్మ్, యంఆర్క్, ఫార్మ్ డీ(జూఎ)పరీక్షల నిర్వహించడం కోసం వారిని కన్వీనర్‌గా నియామకం చేసినట్టు తెలంగాణా స్టేట్ కౌన్సిల్ అఫ్ హైయర్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ ప్రొఫెసర్ యన్.శ్రీనివాస్‌రావు తెలియ చేశారు. జేఎన్టీయూ హెచ్ యూనివర్సిటీలో పలువురు ఆచార్య బృందం డాక్టర్ బి.డీన్ కుమార్ డాక్టర్ ఎ.అరుణ కుమారిలకు అభినందనలు తెలియచేశారు.

థామస్ అల్వా ఎడిషన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బడంగ్‌పేటలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం థామస్ హల్వా ఎడిషన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న బీ గ్రేడ్ కాంట్రాక్టర్లు, ప్రయివేటులో పనిచేసే ప్రయివేటు ఎలక్ట్రిషన్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో గానీ ఇండస్ట్రియల్ రంగంలో గానీ, కమర్షియల్ కాంప్లెక్స్‌లో గానీ, గృహ సముదాయాల్లోగానీ పని చేస్తున్న ఎలక్ట్రిషన్‌లందరూ వైర్‌మెన్ పార్మెట్‌ను లేక సూపర్‌వైజర్ పర్మిట్‌ను తీసుకోవాలని ఎలక్ట్రిషన్లను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీ మాట్లాడుతూ ప్రతి ఎలక్ట్రిషన్ నైపుణ్యంతో పాటు, ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు ద్వారా వైర్ మెన్ గానీ, సూపర్‌వైజర్ గానీ, పర్మిషన్ తీసుకోవాలని సూచించాడు. తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి థామస్ అల్వా ఎడిషన్ జన్మదినం జరుపుకోవడం చాలా సంతోషకరం అన్నారు8. ఈ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామల శ్రీకాంత్ రెడ్డి, నాగయ్య, కొండ బాల్ రెడ్డి, రవీంద్ర చారి, శ్రీనివాస్ నేత, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

డిపి పల్లి సబ్‌స్టేషన్ 33/11 కెవి మిలీనియం ఫీడర్‌లో మరమ్మత్తుల విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు గండి మైసమ్మ, ఎస్‌బివికే కన్వెన్షన్, మిలీనియం ఇండస్ట్రీ పరిసర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు అంతరాయానికి సహకరించాలని బౌరంపేట్ విద్యుత్ శాఖ ఏఈ బి.సాయి కిరణ్ తెలిపారు.

చేతివృత్తుల వారికోసం ఎంఎస్ఎంఈలో సెమినార్



- ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుధీర్ కుమార్

నవతెలంగాణ-బాలానగర్

దేశ ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద ఈ నెల 29న సూక్ష్మచిన్న తరహా పరిశ్రమల డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ ఆఫీస్, హైదరాబాద్ (ఎంఎస్ఎంఈ) డిఎఫ్ఓ బాలానగర్, హైదరాబాద్‌లో 18 ట్రేడ్ సంస్థలతో నిమగ్నమైన కళాకారులు, చేతివృత్తుల వారి ప్రయోజనం కోసం సెమినార్-కమ్-అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనుందని ఎంఎస్ఎంఈ ప్రకటన విడుదల చేసింది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని లబ్ధిదారులకు ఉ:10.15 గంటల నుంచి ఈ పథకం కింద కార్పెంటర్, బోట్ మేకర్, ఆర్మరర్, కమ్మరి, తాళాలు వేసే వారు, సుత్తి, టూల్ మేకర్, శిల్పి, స్టోన్ బ్రేకర్, గోల్డ్ స్మిత్, కుమ్మరి, చెప్పులు కుట్టేవారు, తాపీ పని చేసేవారు వంటి 18 ట్రేడ్‌లకు శిక్షణ, సాంకేతికత, క్రెడిట్ మార్కెట్ సపోర్టు కోసం నిబంధనలు రూపొందించబడ్డాయి. బుట్ట, చాప, చీపురు మేకర్, కాయిర్ నేత, బొమ్మలు, బార్బర్, గార్మెంట్ మేకర్, చాకలి, టైలర్, ఫిషింగ్ నెట్ మేకర్. ఈ కార్యక్రమానికి వివిధ ట్రేడ్‌ల నుండి సుమారు 200 మంది పాల్గొనే అవకాశం ఉందని ఎంఎస్ఎంఈ తెలిపింది. పై పేర్కొన్న వృత్తి దారులు, ట్రేడ్‌లలోని పాల్గొని తమ, తమ వృత్తిలో ప్రయోజనాలు పొందాలని వారు కోరారు.

మాజీ సైనికుడు బంగార్రావు మృతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మాజీ సైనికుడు, సైనిక్ విహార్ కాలనీ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త, మండెల బంగారావు మరణించారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మృతుని నివాసానికి వెళ్లి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని కుటుంబీకులను పరామర్శించి తన సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ...బంగారావు నిస్వార్థ సేవకు చిరునామా అన్నారు. ఇలాంటి వారు చాలా అరుదుగా ఉంటారని ఈ సందర్భంగా తను దేశానికి, ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.

ఓయిస్టర్ కిడ్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శుక్రవారం రాత్రి సివిఆర్ గార్డెన్‌లో జరిగిన ఆయుష్ స్టార్ ప్లే స్కూల్ వార్షికోత్సవం కనులవిందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు తమ ఆటపాటలతో మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి గాయకులు ఓయూ జేఏసీ చైర్మెన్ దరువు అంజన్న మాట్లాడుతూ.. ఈ కార్పోరేట్ విద్యా వ్యవస్థలో సంస్కృతి సాంప్రదాయాలకు విలువనిస్తూ చిన్నపిల్లలకు మంచి విద్యా బుద్ధుల్ని నేర్పుతూ, సరైన మార్గంలో నడుపుతున్న స్కూల్ యజమాన్యాన్ని కొనియాడారు. చిన్నపిల్లలు తమ బుడిబుడి పలుకులతో ప్రార్థన గీతం, సరస్వతీ మాత గీతం, అన్నపూర్ణేశ్వరి గీతాన్ని అదేవిధంగా వేమన పద్యాలను చక్కగా వినిపించారని అన్నారు. సైనికుల యొక్క వీరోచిత పోరాటాన్ని గుర్తుచేస్తూ స్కూల్లో దేశభక్తిని పెంపొందింప చేయడం మంచి విషయమని, స్కూల్ యజమాన్యం అయినటువంటి వాసవి భాగ్యలు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల క్రితం ఈ యొక్క స్కూల్‌ని స్థాపించడం జరిగిందని, అప్పటినుండి ఇప్పటివరకు మంచి ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.

ధ్రువ పత్రాలతో వచ్చి వాహనాలు తీసుకోండి...



- మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న గుర్తు తెలియని 80 ద్విచక్ర వాహనాలను సంబంధించిన యజమానులు ధ్రువ పత్రాలతో వచ్చి వాహనాలు తీసుకోనిపోవాలని మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్ కోరారు. ఇందు కోసం సదరు వాహన యజమానులు మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ 8712662463 నెంబర్ల లో సంప్రదించాలని ఆయన కోరారు.

క్రీడలతో ఆరోగ్య పరిరక్షణ : ఎమ్మెల్యే



నవతెలంగాణ-బాలానగర్

క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి, ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాజీవ్ గాంధీనగర్‌లో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, కులాలకు మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉండాలని ఆయన కోరారు. ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటుగా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ నగర్ అధ్యక్షులు అజీజ్, ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్, యూత్ అసోసియేషన్లు క్రీడాకారులు పాల్గొన్నారు.



కాప్రా డివిజన్ గాంధీనగర్ బస్టాప్‌ను రెండు నెలల క్రితం ఓ ప్రయివేటు ప్లాట్ యజమాని కూల్చి పడివేయడంతో బస్తీవాసుల, గాంధీనగర్ వెల్ఫేర్, యూత్ అసోసియేషన్ ల సభ్యులందరూ కలిసి తమతమ సొంత ఖర్చులతో యథా స్థానంలో తిరిగి పునఃనిర్మించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ మహేష్ , సభ్యులు యమ్ భిక్షపతి , జి సత్తయ్య, జి. నర్సింహా , జి. సత్యనారాయణ , ఎస్. కుమార్ , నాగేందర్ , జి. కృష్ణ , ఎస్. దశరత్ , జి.కృష్ణ , గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి సత్యనారాయణ, సభ్యులు జి బాలయ్య , ఎన్ యాదగిరి, జి.కృష్ణ , జి.విజయ్ కుమార్ , బి.రాకేష్ , జి.శివకుమార్ , బి.వీరేష్ , హరిబాబు , జి. రాజు , గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

కాప్రా శ్రీ భావనాఋషి కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లి, పద్మశాలి టౌన్ షిప్ సొసైటీ ముందు మెయిన్ గేట్ ఆవరణలో గణతంత్ర దినోత్సవము పురస్కరించుకొని సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు , కార్యదర్శి పున్న రమేష్ , కోశాధికారి అవ్వారు రామకృష్ణ , కార్యవర్గ సభ్యులు వీడేం సుదర్శన్ , గుర్రం విశ్వేశ్వర్ రావు , బి శివలీల , జి. మల్లేశ్వరి కాలనీ వాసులు, సొసైటీ సభ్యులు తదితరుల పాల్గొని పతాక ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు.
నవతెలంగాణ-కాప్రా



పీడీఎస్‌యూ విద్యానగర్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - ముషీరాబాద్





ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం విద్యానగర్ నూతన కమిటీని శనివారం మార్క్స్ భవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం నూతన అధ్యక్షులు గౌతం, ప్రధాన కార్యదర్శి అసిఫ్, ఉపాధ్యక్షులు సాయి, సహాయ కార్యదర్శి గణేష్ ,కోశాధికారి ప్రవళిక సభ్యులుగా గణేష్, చరణ్, పవన్, శివలు ఉన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గంతో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మహేష్,గడ్డం శ్యామ్ లు మాట్లాడుతూ. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం- 2020 పేరుతో విద్యను కాషాయికరణ, కార్పోరేటీకరణను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆశాస్త్రీయ భూతవిద్య, జ్యోతిష్యంను విద్యార్థుల మెదల్లో చొప్పిస్తూ సమాజంను తిరోగమనం వైపు తీసుకెళ్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నూతన జాతీయ విద్యా విధానం ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి కంచనపల్లి శ్రీను, జిల్లా నాయకులు గణేష్,పవన్ ,శ్రీకాంత్,మహేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.



నాయి బ్రాహ్మణ జన సంస్థ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నాయి బ్రాహ్మణ జన సంస్థ క్యాలెండర్-2024 ను పద్మశ్రీ అవార్డు గ్రహీత డి.ఉమామహేశ్వరి ఆవిష్కరించారు. ప్రముఖ నాట్య గురువు కళా కృష్ణ, ప్రముఖ కవి, సంస్థ గౌరవ సలదారులు డాక్టర్ రాపోలు సుదర్శన్, ప్రముఖ కార్టూనిస్ట్ నారు, బీజేపీ రాష్ట్ర నాయకులు సూర్య పల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, సినీ డైరెక్టర్ రాము,పాయింట్ అవుట్ న్యూస్ ఛానల్ సీఈవో రామకృష్ణ, నాయి బ్రాహ్మణ జన సంస్థ అధ్యక్షులు శ్రీధర్ మురహరి తదితరులు పాల్గొన్నారు.



రక్త దానం చేసి మానవత్వం చాటుకున్న బేగంపేట్ టీటీఐ సిబ్బంది

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రమాదానికి గురైన వ్యక్తికి అత్యవసరంగా రక్తదానం చేసిన (టీటటీఐ) బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం కరీంనగర్‌కు చెందిన పంజర్ల దేవరాజు రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలతో కొట్టు మిట్టాడుతూ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అయితే అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న ఏసీపీ శంకర్ రాజు వెంటనే స్పందించారు. తన వద్ద పనిచేస్తున్న సిబ్బంది అయాన్‌ను సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు పంపించి బాధితునికి రక్త దానం చేయించి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా రక్త దానం చేసిన అయాన్‌ను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఎవరైనా ఆపదలో వున్నప్పుడు అత్యవసర పరిస్థితులలో వారికి టీటీఐ బేగంపేట్ తప్పక సహాయంగా ఉంటుందని తెలిపారు. వెంటనే స్పందించి ప్రాణాలు కాపాడడంతో సాయపడిన ఏసీపీతోపాటు బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ సిబ్బందిని బాధితుని కుటుంబసభ్యులు, డాక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు.



ఎన్. గౌతమ్ రావుకు సత్కారం

నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులుగా గౌతమ్ రావు రెండవసారి ఎన్నికైన సందర్భంగా బీజేపీ నగర కార్యాలయంలో కోవిద ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అనూహ్య రెడ్డి ఆధ్వర్యంలో కొంతమంది కళాకారులు గౌతమ్ రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేతలు సందీప్ సాయి, లంకల దీపక్ రెడ్డి, సూర్య ప్రకాష్ సింగ్, చిట్టి శ్రీధర్, సుప్రియ గౌడ్, శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.





శ్రీ కాళీ కాళభైరవ కల్యాణంలో పాల్గొన్న గవర్నర్ తమిళి సై, మంత్రులు

నవతెలంగాణ-ముషీరాబాద్

కుర్తాళం శ్రీ సిద్దేశ్వర పీఠం ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నోటి ప్రత్యాంగీర మహాయాగం శనివారం ఏడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీ కాళీ కాళభైరవ కల్యాణం జరిపించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ తమిళి సై, రాష్ట్ర డిప్యూటీ సిఎం ముల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు శ్రీ సిద్ధేశ్వరనంద భారతి జ్ఞాపికలు అందజేసి వారిని ఆశీర్వదించారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను పలువురిని ఆకట్టుకున్నాయి. భరత నాట్యం చేసిన కళాకారులను అతిథులు సత్కరించారు. ఈకార్య క్రమంలో రమ్యానంద భారతి స్వామి, కార్యక్రమం ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్ తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- తెలంగాణ 'అరసం' ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్
- అరసం జిల్లా విస్తృత స్థాయి సమావేశం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రగతిశీలత, ప్రజాభాష, సామాజిక దృష్టి ప్రసరించిన ప్రజాసాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలంగాణ 'అరసం' ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ పేర్కొన్నారు.ఆకలి, దారిద్ర్యం, రాజకీయ బానిసత్వం, సాంఘిక వెనుకబాటు వంటి ప్రధాన సమస్యలపై సాహిత్యాన్ని సృష్టించి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు.శనివారం హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్, ఐపీసో రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) హైదరాబాద్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాపోలు సుదర్శన్ సమక్షంలో 'అరసం' హైదరాబాద్ జిల్లాకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 'అరసం' హైదరాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా ఎస్.సూర్యప్రకాష్, ఉపాధ్యక్షులుగా జి.రామ్మోహన్ రెడ్డి, వి.వి.చారి, కుమార్ దోసల, సరోజ్ బాల ఠాకూర్, ప్రధాన కార్యదర్శిగా జి.చంద్రమోహన్ గౌడ్, సహాయ కార్యదర్శులుగా డా.ఎస్.విజయభాస్కర్, బి.వెంకటేశ్వర్లు, జి.శివకుమార్, డి.కె.నాయక్, కోశాధికారిగా అటుకుల రాజు, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ వేముల నారాయణ, ఛత్రపతి శివాజీ, కె.కిషన్, ఎన్.ఆర్. శ్రీనివాస్, ఆర్.సృజన్ కుమార్, బి.మాధవి, బి.నాగరాజులు ఎన్నికైయ్యారు.

ఈ సందర్భంగా రాపోలు సుదర్శన్ నూతన కమిటీని అభినందిస్తూ 'అరసం'కు దేశంలో ఘనమైన చరిత్ర ఉందని, పదునెక్కిన అభ్యుదయ సాహిత్య ఉద్యమకారులను తయారు చేసిందని, సకల ప్రజా పోరాటాలకు స్ఫూర్తినిచ్చే సాహిత్యాన్ని దశాబ్దాలుగా 'అరసం' కవులు, రచయితలు సమాజానికి అందిస్తూ వస్తున్నారని తెలిపారు.వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి, పోత సురేందర్ రెడ్డి, వయ్యి సామేలు వంటి తెలంగాణ ప్రముఖ సాహితీ వేత్తలు 'అరసం' హైదరాబాద్ జిల్లా కమిటీలో సేవలందించారని గుర్తు చేశారు.కవులు, నేటికీ కొనసాగుతున్న ఫాసిస్ట్ ధోరణినికళాకారులు వ్యతిరేకిస్తు, సాహిత్య కళారంగాలను పరిరక్షించాలని కోరుతూ 'విలువైన గతం, బలమైన వర్తమానం, ఆశావహమైన భవిష్యత్తు' అన్న లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన 'అరసం' హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.సూర్యప్రకాష్, జి.చంద్రమోహన్ గౌడ్‌లు మాట్లాడుతూ రచనకు, కవిత్వానికి భాష గొప్ప మూలకమని, మాతభాష తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి కవులు రచయితలు కృషి చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా చూడాలన్నారు. భాష పునర్నిర్మాణం కృషి చేస్తూ 'అరసం' వికాసానికి పని చేస్తామన్నారు.తమ ప్రతిభను గుర్తించి ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన 'అరసం' రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలుపుతూ, హైదరాబాద్ జిల్లాలో 'అరసం' బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ఫిబ్రవరి 1 నుంచి గ్రాండ్ నర్సరీ మేళా

- 5 రోజుల పాటు ఆల్ ఇండియా హార్టీకల్చర్, అగ్రికల్చర్ షో
- బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-అంబర్‌పేట



నేడు మొక్కలు నాటడం అంటే రాబోయే తరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మంత్రి తుమ్మల 15వ గ్రాండ్ నర్సరీ మేళా బ్రోచర్ ఆవిష్కరించారు. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా లో అల్ ఇండియా హార్టీకల్చర్, అగ్రికల్చర్ షో ఫిబ్రవరి 1నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ షో లో హార్టీకల్చర్ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయల తోటలు, ఎరువులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, అగ్రికల్చర్ ఎనర్జీ సేవింగ్ టెక్నాలజీ, అగ్రికల్చర్ సైన్స్, ఎడ్యుకేషన్, ఫుడ్ ఇండస్ట్రీ ఉత్పత్తులు ప్రదర్శిస్తారని తెలిపారు. హైడ్రోఫోనిక్, టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్ వంటి నూతన టెక్నాలజీ ఈ షోలో ప్రదర్శిస్తారని చెప్పారు. దేశ వ్యాప్తంగా 60కు పైగా నర్సరీ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా ముంబయి, డార్జిలింగ్, కోల్ కతా, ఢిల్లీ, హర్యానా, ముంబయి, బెంగుళూరు, పూణే, షిర్డీ, కడియం, చెన్నై తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చిన ప్లాంట్స్ ప్రదర్శిస్తారు మేళా ఇన్‌చార్జ్ ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ నెక్లెస్ రోడ్ లో ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు.. సౌది అరేబియా నుంచి వచ్చిన టిష్యూకల్చర్ వెరైటీ డేట్ ఫామ్ ప్రత్యేక అందుబాటులో ఉంటుందని వివరించారు.

ప్రజాస్వామ్యాన్ని చైతన్యపరిచేలా కళ ఉండాలి



- బిగ్‌బాస్ లాంటి నేరపూరిత షో వల్ల సమాజం చెడిపోతుంది
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

నవతెలంగాణ - ముషీరాబాద్

కళ అనేది ప్రజాస్వామ్యాన్ని చైతన్యపరిచే విధంగా ఉండాలని, బిగ్‌బాస్ లాంటి నేరపూరిత షో వలన సమాజం చెడిపోతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ ఆధ్వరంలో దేశ వ్యాపితంగా జరుగుతున్న కళాజాతలో భాగంగా రాష్ట్రంలో రెండు రోజులుపాటు జరుగు ప్రజానాట్యమండలి జాతాను హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద గల ప్రముఖ ఉర్దు కవి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మఖ్దూం మొహినోద్దీన్ విగ్రహం వద్ద నివాళులర్పించి, డప్పు కొట్టి జాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ. దేశ వ్యాప్తంగా కళారంగాన్ని నాశనం చేసేది మోడీ అయితే బిగ్‌బాస్ లాంటి షో వల్ల సమాజం చెడిపోతున్నదని అన్నారు. రాబోయే బిగ్‌బాస్ షో ను కళాకారులందరూ ధ్వంసం చేయాలని పిలుపునిచ్చారు. కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అనే నినాదంతో తెలంగాణ ప్రజా నాట్యమండలి పనిచేస్తున్నన్నారు. ఈ రెండు రోజుల పాటు జరుగు ప్రజానాట్యమండలి జాతా విజయవంతం కావాలని, ప్రజలందరూ స్వాగతించాలని కోరారు. జాతా ప్రారంభానికి ముందు గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాప రెడ్డి విగ్రహానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్. బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి చాయదేవి నివాళ్లులర్పించారు. నవయుగ, విప్లవ కవి శ్రీశ్రీ విగ్రహానికి ప్రజాకళ కారులు పాటలతో నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్.బోస్ , హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయ దేవి , తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా , అధ్యక్షులు కే శ్రీను, దళసభ్యులు కే లక్ష్మి నారాయణ, కే ఉప్పలయ్య, వి.కొండల్ రావు, రవి కళాకారులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి కాలమాని ఆవిష్కరణ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శనివారం హిమాయత్‌నగర్ లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ నూతన సంవత్సర-2024 కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్రలు సంయుక్తంగా మాట్లాడుతూ యువజన, విద్యార్థి సమస్యల పరిష్కార ఏజెండానే ఏఐవైఎఫ్ ప్రధాన కర్తవ్యం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ చేయాలని, గత పాలకులతో యువత విసుగు చెందారని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిరుద్యోగుల పక్షాన నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీమాన్, నేతలు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనవాదం రాజకీయ ఉద్యమంగా మారాలి



- డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

బహుజనవాదం బలమైన రాజకీయ ఉద్యమంగా మారితేనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. బంధు సొసైటీ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడారు. రాజ్యాధికారంతోనే బహుజనులకు సామాజిక,ఆర్థిక,రాజకీయ అభివద్ధి జరుగుతుందన్నారు. బహుజనుల మహనీయుల విగ్రహాలు గ్రామాల్లో ఎన్ని పెట్టినా అధికారం దక్కదన్నారు. బహుజనుల ఓట్లు బహుజనులు వేసుకుంటేనే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. అధిపత్య పార్టీలకు ఓట్లు వేసినంతకాలం బహుజనులు బతుకులు మారవన్నారు. రాష్ట్రంలో ఉన్న కుల సంఘాల నాయకులకు స్పష్టమైన లక్ష్యం ఉండాలన్న ఆయన.. కుల సంఘాల నాయకులు ఎన్నికల చివరి రోజుల్లో ఆధిపత్య పార్టీలకు అమ్ముడుపోతున్నారని తెలిపారు. బహుజనుల ఎన్నో ఏండ్లుగా పాలితులుగానే ఎందుకు ఉంటున్నారో నిరంతరము ఆలోచించి, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి అప్పికట్ల భారత్ భూషణ్ అధ్యక్షత వహించగా ప్రో.ముత్తయ్య, ప్రో.ఇటిక్యాల పురుషోత్తం, ప్రో.నతానియెల్, ప్రో.జి.కనకయ్య, జూపాక సుభద్ర,పల్లర్ల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీసీలను వంచించే ఆలోచనలను విరమించుకోవాలి



- ఎంపీ ఆర్. కృష్ణ య్య, ఎన్. మారేష్

నవతెలంగాణ - ముషీరాబాద్

బీసీలను వంచించే ఆలోచనలను విరమించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ మారేష్ అన్నారు. ఎన్ మారేష్ ఏపీ బీసీ కమిషన్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విద్యా నగర్ బీసీ భవన్ లో 30 బీసీ సంఘాల సమావేశమై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్ కష్ణయ్య, మారేష్ మాట్లాడుతూ జనాభా ప్రకారం కులాల కార్పొరేషన్లకు, ఫెడరేషన్లకు బడ్జెట్ కేటాయించి వారి ఆర్థికాభివృద్ధి కి చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు. బి.సి కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి గ్రూపులుగా వర్గీకరిం చడానికి కులాల వారి జనాభా లెక్కలు ఉపయోగపడు తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టడానికి అంగీకరించకుండా బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని తెలిపారు. బీజేపీలో ఉన్న బీసీ నాయకులందరూ కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని కోరారు. జనగణన పట్టికలో 34 కాలమ్స్ పెట్టడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకించడం దుర్మార్గం అని అన్నారు. ఒక్క రూపాయి అదనపు ఖర్చు లేకుండా దేశంలోని కులాల వివరాలన్నీ వస్తాయని.. ఎందుకు బీజేపీ ప్రభుత్వం అంగీకరించడం లేదని ప్రశ్నించారు.

బి.సి.కులాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన చారిత్రిక సమయం ఆసన్నమైందన్నారు. ఈ ప్రజాస్వామ్య దేశంలో బి.సి. కులాలకు అన్ని రంగాలలో వాటా ఇచ్చే సమయం ఆసన్నమైందని తెలిపారు. లేనిపక్షంలో కేంద్రం బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో గుజ్జ కష్ణ, నీల వెంకటేష్, జి. అంజి, రాజేందర్, కోట్ల శ్రీనివాస్, మహేందర్, అది మల్లేశం పటేల్, నందా గోపాల్, రాజ్ కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

పదకొండేండ్ల ప్రస్థానంలో శ్రీగాయత్రి సేవలు భేష్



- శ్రీ గాయత్రి టెక్నో స్కూల్ 11వ వార్షికోత్సవ వేడుకలలో వక్తలు

నవతెలంగాణ-మెహిదీపట్నం

విద్యారంగంలో పదకొండేండ్లుగా శ్రీ గాయత్రీ ఈ-టెక్నోస్కూల్ అందిస్తోన్న సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. మణికొండలోని శ్రీ గాయత్రి ఇ-టెక్నోస్కూల్ పదకొండో వార్షికోత్సవ వేడుకలు గోల్కొండ ప్రాంతంలోని తారామతి బారాదరిలో నిర్వహించారు. సాయుధ దళాల త్యాగాలను కండ్లకు కట్టినట్టు చూపించేలా మిలటరీ డ్యాన్స్, అన్ని రాష్ట్రాల సంస్కతిని ప్రతిబింబించే ప్రదర్శనలు, తెలంగాణ సంస్కతికి ప్రతీకగా నిలిచే డ్యాన్స్, జాతీయ సమైక్యత, సమగ్రతను ప్రస్ఫుటించే ప్రదర్శనలు, అమ్మానాన్న థీమ్‌తో రూపొందించిన భావోద్వేగ నత్యం హైలైట్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఎంతోమంది విద్యార్థులు మణిమ కుటాలుగా తయారయ్యారని ప్రశంసించారు. అలాంటివాళ్లు ప్రస్తుతం చాలామంది ఉన్నత స్థితిలో ఉన్నారని అభినందించారు. ఇకపైనా ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలని, గాయత్రి స్కూల్‌లో చదివిన విద్యార్థులు సమాజంలో మంచి మార్పులు తీసుకొచ్చే ప్రముఖులుగా ఎదగాలని ఆకాంక్షించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంతో నత్యాలు చేశారు. అంకితభావం కలిగిన అధ్యాపకుల పర్యవేక్షణలో సాగిన ఈ ఉత్సవంలో విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను అత్యున్నతంగా ప్రదర్శించారు. కొన్ని ట్రెండింగ్ నత్యాలు ఆహూతుల్లో జోష్ నింపాయి. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి ఈ-టెక్నో స్కూల్ చైర్మన్ కొంపల్లి మధు సూధన్, డైరెక్టర్లు సమియుద్దీన్, విజయ్, అడ్వకేట్ కీర్తి ప్రభాకర్, ఎస్‌సీఈఆర్‌టీ అధికారి సురేష్,సీఈవో సర్వేశ్వరరావు, ప్రిన్సిపాల్ రచన,మేనేజర్ హరి తో పాటు పలువురు అతిథులు పాల్గొన్నారు.

సమాజ మార్పునకు చిత్ర కళ దోహదం చేస్తుంది



- వెంకట రమణ 'కళా ప్రపంచం' ఆవిష్కరణలో వక్తలు

నవతెలంగాణ-ముషీరాబాద్

సమాజ మార్పునకు చిత్ర కళ దోహదం చేస్తుందని, చిత్రకారుల కృషి చరిత్ర గతిని మారుస్తుందని ప్రముఖ చిత్రకారుడు రావూరి సుభాష్ బాబు అన్నారు. శనివారం డబ్బీకార్ అధ్యక్షత న సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఎల్. ఆర్. వెంకట రమణ వ్యాసాల సంపుటి కళా ప్రపంచం ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజానికి చిత్రకారుల అవసరం ఉందని చెప్పారు. తెలంగాణలో పోరాటాలను చిత్త ప్రసాద్ బొమ్మలు రికార్డు చేశాయన్నారు. తోట వైకుంఠం, సూర్య ప్రకాష్ వంటి వారు తెలంగాణ గ్రామీణ ప్రకృతి ని తమ బొమ్మలలో చూపారు అని చెప్పారు. అనంతరం తెలంగాణ సాహితి కార్యదర్శి కె. ఆనందాచారి మాట్లాడుతూ. ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిత్రకారులను పరిచయం చేసిన ఈ పుస్తకాన్ని కవులు, రచయితలు, కళాకారులు తప్పక చదవాలని అన్నారు. ప్రముఖ కవి ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ టాగోర్, పికాసో, సాల్వడార్ డాలీ వంటి వారిని పరిచయం చేసిన ఈ పుస్తకం సిలబస్ లో పెట్టాలని కోరారు. చిత్రకారుల ను గురించి యువతకు తెలియజేయుటకు ఈ గ్రంథము ఉపకరిస్తుందని అన్నారు. ఈ సభలో ఎస్. రఘు, కూరెళ్ళ శ్రీనివాస్, డాక్టర్ రూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

చిరంజీవికి అభినందన సత్కారం

నవతెలంగాణ-హిమాయత్ నగర్



నటుడు మెగాస్టార్ చిరంజీవికి భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా వీబీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడిపడిగె రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిరంజీవిని శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

సెకండ్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-ఉప్పల్

కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరుగుతున్న సెకండ్ ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు ఉప్పల్ కృష్ణవేణి విద్యార్థులు సెలెక్ట్ అయినట్లు డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఎం.విద్యా. ఎం. శ్రీజ. పి. లక్ష్మీ ప్రియాంక. డి. లహరి సెలెక్ట్ అయ్యారు. ఆ విద్యార్థులను డైరెక్టర్ శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జి, ప్రిన్సిపాల్, టీచర్స్ శనివారం అభినందించారు.

రోడ్డుపై హోర్డింగ్‌లను తొలగించాలి : మాజీ సర్పంచ్



నవతెలంగాణ-ఘట్కేసర్

వాహనాదారులకు ఇబ్బందులు కలిగించే రోడ్డుపై ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ పరిధిలో అక్రమంగా హోర్డింగ్‌లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇలాంటి హోర్డింగ్‌లతో వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. హోర్డింగ్‌ల ఏర్పాటుతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. హెచ్‌ఎండీఏలో హోర్డింగ్‌ల ఏర్పాటుకు ఎవరు అనుమతి ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం ఘోరమన్నారు. బస్సులను బస్ స్టాప్ నుంచి ఎదులాబాద్ రోడ్డు వైపు, ఔటర్‌రింగ్ రోడ్ వైపు వెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారా శ్రీనివాస్‌గౌడ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

65వ సీటీ కన్వర్జెన్ సమావేశంలో కీలక అంశాలపై చర్చ

- పాల్గొన్న పోలీస్ కమిషనర్లు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు
- డగ్స్ నివారణ, రోడ్ల విస్తరణ, ట్రాఫిక్, పార్కింగ్,పారిశుధ్యంతోపాటు ఇతర సమస్యల పరిష్కారాలపై చర్చ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పౌరులకు మెరుగైన సేవలందించడంతోపాటు, గ్రేటర్‌లో సమస్యలను పరిష్కరించేందుకు (65వ సిటీ కన్వర్జెన్ మీటింగ్) సీటీ సమన్వయ సమావేశంలో కీలక నిర్ణయాలపై చర్చించారు. ముఖ్యంగా హైదరాబాద్ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖలు ఒకే వేదికగా సమన్వయంతో పనిచేయాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రోడ్ల విస్తీరణ, జంక్షన్ల అభివద్ధికి, గ్రేటర్ హైదరాబాద్‌లో సిగ్నల్ రహిత రవాణా వ్యవస్థ మెరుగు పరచడం కోసం గతేడాది ఆగస్టు 7న జీహెచ్‌ఎంసీ వేదికగా 64వ సీటీ కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన బంజారా హిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం 65 సిటీ కన్వర్జెన్స్ సమావేశం జరింగింది. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతీ, హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి కలెక్టర్లు, మెట్రోరైల్, జలమండలి, ఎలక్ట్రిసిటీ, హెచ్‌ఎండీతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా మహా నగరంలో చోటు చేసుకున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యల పరిష్కారం, పాదాచారులకు ప్రమాదాల నివారణకు ఫుట్‌పాత్‌లు, డివైడర్ల నిర్మాణంతోపాటు ఇతర ఎన్‌ఫోర్సుమెంట్‌పై సమావేశంలో చర్చించారు. జనావాసాలకు దూరంగా ఉండేలా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి శివారు ప్రాంతాలల్లో డంప్ యార్డ్ లు ఏర్పాటు చేసుకోవడం, ముఖ్యంగా వ్యవసాయానికి యోగ్యత లేని భూములు గుర్తించాలని చర్చించినట్టు తెలిసింది. రానున్న ఎండాకాలాన్ని దృష్టి ఉంచుకుని నీటి సరఫరాపై చర్చించినట్టు తెలిసింది. గంజాయి, డ్రగ్స్ విక్రయాలు, సరఫరాపై ఉక్కుపాదం మోపాలని సమావేశంలో చర్చించినట్టు సమాచారం. ముఖ్యంగా పబ్‌లు, హుక్కా సెంటర్లు, ఫామ్ హౌస్‌ల చుట్టూ పోలీసుల నిఘా పెంచే విధంగా నిర్ణయాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. మల్టీ లెవల్ పార్కింగ్ కు ప్రణాళిలపై దృష్టి సారించారు. ముఖ్యంగా నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టునున్నట్టు తెలిసింది.

మహిళల అభివృద్ధికి చట్టాలపై అవగాహన అవసరం

- హైకోర్టు న్యాయమూర్తి సురపల్లి నంద
- ఏ వేకింగ్ ద యూత్ వితిన్ వర్క్ షాప్



నవతెలంగాణ-బంజారా హిల్స్

మహిళలు సంపూర్ణంగా అభివృద్ధి సాధించాలంటే భారత రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలపై సమగ్ర అవగాహన అవసరమని హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద సూచించారు. శనివారం బంజారా హిల్స్ శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో శ్రీ సత్య సాయి ఆర్గనైజేషన్స్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థునుల కోసం "ఏవేకింగ్ ద యూత్ వితిన్" పేరిట ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా సురపల్లి నంద, (ఐఏఎస్)అధికారిని ఉదయలక్ష్మి,సత్య సాయి ఇనిస్ట్యూషన్స్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ స్టేట్ ఇంచార్జ్ మాధవి లతలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆకాశంలో సగం అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని చెబుతున్నా ఇప్పటికీ ఎంతో వివక్ష కొనసాగుతుందని అన్నారు. కోట్లాదిమంది మహిళలు ఉండగా వేళ్లపై లెక్కించగలిగినంత మహిళలు మాత్రమే అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. సొంత కుటుంబం నుంచి వివక్షకు గురవుతున్న మహిళలు బడిలో పనిచేసే చోటా మరింత ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రతీ మహిళ తన హక్కులు బాధ్యతలను తెలుసుకోవడం ద్వారా అవకాశాలను చేజిక్కించుకోవడంతోపాటు సమాజానికి ఆదర్శంగా నిలవవచ్చున్నారు. విద్యార్థి దశలోనే ఉన్నత ఆశయాలను నిర్దేశించుకుని వాటి సహకారం కోసం ఇష్టంగా శ్రమించాలని సూచించారు. గొప్పగా అభివృద్ధి సాధించిన వారంతా గొప్ప గొప్ప కుటుంబాలలో జన్మించిన వారు కాదన్న విషయం గుర్తించాలన్నారు. అభివృద్ధికి దగ్గర దారులు ఉండవని ఈ రంగంలోకి ప్రవేశించాలనుకుంటున్నారో స్పష్టత కలిగి ఉండి నిరంతర సాధన చేయడం ద్వారా అత్యున్నత అవకాశాలను చేర్చించుకోవచ్చులను అన్నారు.

జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అల్విని క్లబ్ చైర్మెన్‌గా జీ.వీ.ఎన్.రాజు



నవతెలంగాణ-కల్చరల్

జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా అల్విని క్లబ్ జోన్ XII చైర్మెన్‌గా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు జీ.వీ.ఎన్.రాజు సంస్థ కార్యాలయంలో పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఆయన 38 సంవత్సరాలు క్రితం ఒక సభ్యునిగా చేరి అనంతర కాలంలో జాతీయ శిక్షకునిగా సేవలందించి చైర్మెన్ పదవికి ఎంపికయ్యారు. సంస్థ జాతీయ సలహాదారు సునీల్ కుమార్ ఉపాధ్యక్షుడు వినయ్ మెహతా,నేషనల్ డైరెక్టర్ మనోజ్ తక్కర్‌లు తమ అభినందనలు రాజు కు తెలిపారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ గత 107 సంవత్సరాలుగా అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తిత్వ వికాసం స్వచంద సంస్థ. ఈ సంస్థ నుంచి శిక్షణ పొందిన వారిలో ప్రముఖులు నాటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ, జపాన్ ప్రధాని , గోవా ప్రస్తుత ముఖ్య మంత్రి, పార్లమెంట్ సభ్యులు, పలువురు ప్రముఖులు ఉన్నారు

నాగారంలో ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు



నవతెలంగాణ-కీసర

విద్యార్థుల్లో శాస్త్రీయత ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించేందుకే చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక కీసర మండల కమిటీల ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను శనివారం నాగారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి మండల స్థాయి ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కీసర మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నాగారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ఈ పరీక్ష రాస్తున్న విద్యార్థిని విద్యార్థులందరూ భవిష్యత్తులో సైన్స్ రంగాల్లో ఉన్నత స్థితికి చేరాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే, వివిధ రకాల పోటీపరీక్షలలో పాల్గొనాలని సూచించారు. లక్ష్యాన్ని సాధించేంతవరకు ఆపకుండా ప్రయత్నాలను చేస్తూనే ఉండాలంటూ కోరారు. జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక గత 35 ఏండ్లుగా పాఠశాల స్థాయి విద్యార్థిని, విద్యార్థులకు ఈ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థి తను స్వతహాగా ప్రతి విషయాన్ని పరిశీలించి విషయాలపై అవగాహన పెంచుకునే విధంగా, సైన్స్ ప్రయోగాలు నిత్యజీవితంలో మన చుట్టూ దొరికే వస్తువులతో చేస్తూ సైన్స్ ఎలా నేర్చుకోవచ్చు తెలియజేస్తుందని వారన్నారు. జన విజ్ఞాన వేదిక కీసర మండలం ప్రధాన కార్యదర్శి పటేల్ నరసింహులు మాట్లాడుతూ.. మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో కీసర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో కీసర, రాంపల్లి, నాగారం పాఠశాల విద్యార్థులు మండలం స్థాయి పరీక్షల్లో ప్రతిభ చూపి, జిల్లా స్థాయి పరీక్షలకు ఎంపికయ్యారు. ప్రవేట్ పాఠశాల నుండి పుడమి నైబర్ హుడ్, నాగారం సెరినిటీ హై స్కూల్, సెంట్ జోసెఫ్ పార్సల్ విద్యార్థులుజిల్లాస్థాయి చెకుముకి ఎంపికయ్యారు. ఫిబ్రవరి 4వ తేదీన చింతల్ సూర్య నగర్ కుత్బుల్లాపూర్ లో యూనిక్ హై స్కూల్ జిల్లాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్యాం కుమార్, వివిధ పాఠశాల నుండి విచ్చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులు లేకుండా ప్రసవం చేసిన నర్సులు



- నిర్లక్ష్యంతో మృతి చెందిన పసికందు
- వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్

నవతెలంగాణ-ఉప్పల్

ప్రసవం కోసం వస్తే పసి బిడ్డ ప్రాణం తీసిన సంఘటన ఉప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురికి చెందిన ఓ మహిళను కాన్పు కోసం ఉప్పల్ ప్రభుత్వ వైద్య కేంద్రానికి తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యు రాలు అందుబాటులో లేకపోవడంతో నర్సులు ప్రసవం చేశారు. దీంతో పసికందు మృతి చెందింది.

ప్రభుత్వం అధికారుల పై చర్యలు తీసుకోవాలి
-ఐద్వా నాయకురాలు వినోద



వైద్యుల నిర్లక్ష్యంతోనే పసికందు మృతి చెందిందని, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి ఐద్వానాయకురాలు వినోద డిమాండ్ చేశారు. వైద్యుల సంరక్షణలో కాన్పు చేస్తే ఇలాంటి సంఘటనలు జరగవని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంతో తల్లులకు కడుపు కోతలు మిగులుస్తున్నారని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకో వాలన్నారు.



చక్రిపురం శ్రీచక్రి విద్యానికేతన్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరైయ్యారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి ఆవిష్కరణలు చేసి ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ములుగు ప్రతాప్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు,డివిజన్ నాయకులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.-నవతెలంగాణ,కాప్రా

కండ్లకోయ ఐటీ పార్క్‌ను ప్రారంభించి..

మెట్రోరైల్‌ను మేడ్చల్ వరకు విస్తరించాలి

- కొంపల్లి ఐటీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ - మేడ్చల్

కండ్లకోయ గేట్‌వే ఐటీ పార్కును పనులు ప్రారంభించి, మేడ్చల్‌కు మెట్రో రైలు విస్తరించాలని కోరుతూ కైటియా అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు శనివారం టిఎస్ఐఐసీ వైస్ చైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డిని కలిసి కోరారు. ఈ సందర్భంగా ఓరుగంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కండ్లకోయ గేట్‌వే ఐటీ పార్క్ ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరించినట్లు తెలిపారు. ఐటీ పార్క్ ఏర్పాటుతో కండ్లకోయ, మేడ్చల్ ఎంతగానో అభివృద్ధి చెందుతుందని అన్నారు. 200 చిన్న, మధ్యతరహా ఐటీ కంపెనీలు, యువ



పారిశ్రామికవేత్తలు ఈ ప్రాజెక్ట్ కార్యకలా పాలను ప్రారంభించేందు కు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. హైదరాబా ద్ ఉత్తర ఆవరణలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి మెట్రో రైలు కనెక్టివిటీని మేడ్చల్‌కు వరకు పొడిగించాలనే ప్రతిపాదిం చినట్లు వెల్లడించారు. కూడా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సమర్పించారు. టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి సాను కూలంగా స్పందించి ఐటీ పార్క్ అభివృద్ధిని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మేడ్చల్‌కు మెట్రో రైలు కనెక్టివిటీ కోసం అభ్యర్థనను హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు పరిశీలన కోసం పంపారని పేర్కొన్నారు.

బీఎంఆర్ఎస్ గ్రామర్ హై స్కూల్‌లో ఆకట్టుకున్న వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఎంఆర్ఎస్ గ్రామర్ హై స్కూల్‌లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పిరమిడ్స్, మార్చ్ పాస్ట్ అతిథులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు స్వాతంత్ర సమరయోధుల వేషాధారణలో వచ్చి తమ దేశభక్తిని చాటుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు విద్యార్థులు బాల్యం నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని, ఉన్నత స్థానాలను అధిరోహించాలని తెలిపారు. స్కూల్ కరస్పాండెంట్ బి.జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు మెడల్స్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ రావుల మహేందర్ రెడ్డి, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్, 1వ వార్డు కార్పొరేటర్ బింగి జంగయ్య, 19వ వార్డు కార్పొరేటర్ పవన్ సామల, డా.జి.వేంకటేశ్వర రాజు, వీహెచ్‌పీ సంపర్క్ ప్రముఖ్ గూడూరు మహేందర్ రెడ్డి విశ్వ హిందూ పరిషత్ ప్రాంత (రాష్ట్ర) కమిటీ సభ్యులు, డా.మధుసూధన్ రెడ్డి ఎండీ.విజయ డెంటల్, డా. జనార్ధన్ రెడ్డి ఎండీ.సాయి స్వరూప హాస్పిటల్, బి.రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మంచి పనులకు హృదయం స్వచ్ఛంగా ఉండాలి



- ప్రముఖ సంపాదకుడు రామ చంద్ర మూర్తి

నవతెలంగాణ-కల్చరల్

డబ్బు ఎంతో మంది వద్ద ఉండవచ్చు కానీ ఇతరులకు సహాయ పడేందుకు మంచి పనులకు హృదయంలో స్వచ్ఛత ఉండాలనీ ప్రముఖ సంపాదకుడు కె.రామచంద్ర మూర్తి అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై విద్యార్థి నాయకుడు తెలంగాణ అభిమాని ఫణి భార్గవ్ యాది లో పేరిట జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా రామచంద్ర మూర్తి పాల్గొని నగదు పురస్కారాలు ప్రముఖ జర్నలిస్టు పీ.ఆంజనేయులుకు, హేమలతలకు, ఆర్థిక సహకారం ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్ట్ నర్సింగ్ రావు కుటుంబానికి, విద్యార్థిని సాదియా బేగం కు ఆర్థిక సాయం, ఆత్మీయ సత్కారం దిక్షిర్ లతకు అందించి మాట్లాడారు. కుమారుడు మరణించినా ఆయన పేరిట పురస్కారాలు అందిస్తూ శాశ్వతం గా ఫణిని యాదిలో నిలుపు తున్నారని అన్నారు. ఎందరో ప్రముఖ వ్యక్తులు మరణించిన తరువాత వారి పేరిట వారి గురించి ఆలోచించి సమయం కూడా లేకున్న పరిస్థితులలో ఇట్టి కార్యక్రమం జరిగిటం ఆదర్శ వంతం గా ఉందన్నారు. సాహితీ వేత్త డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ ఫణి భార్గవ్ విద్యార్థి నాయకుడుగా ఎంతో ఎదిగారన్నారు. ఆయన ఉజ్వల భవిష్యత్ అర్ధాంతరంగా ముగియటం బాధా కరం అన్నారు. బాల భవన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ ఏం కే.రాము అధ్యక్షత వహించిన సభలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, నేటి నిజం సంపాదకుడు బైశ దేవదాసు పాల్గొని ఫణి భార్గవ్ జీవిత విశేషాలు ప్రశంసించారు. కార్యక్రమానికి తొలుత నాట్య గురువులు తులసి, సుష్మ, శిష్య బృందం చేసిన శాస్త్రీయ నృత్యాలు , మంజుల గానం ఆకట్టుకున్నాయి.



గన్‌ఫ్రాండీలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టీఎస్జీవోస్ యూనియన్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యూకేషన్ హైదరాబాద్ యూనిట్ అధ్యక్షుడు, కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ అధ్యక్షుడు వి.డేవిడ్, కోశాధికారి ఎస్.డీ ప్రేమ్ కుమార్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, ఈసీ ముజాహీద్, ప్రాథమిక సభ్యులు సూర్య, రమేష్, అరుణ, లావణ్య, కె.పి.అనురాధ, సచిదానంద చారి, జి.రాజ్‌కుమార్, విజయలక్ష్మి, ప్రవీణా, చక్రవర్తి, డి.శ్రీకాంత్, ఖనీజ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎమ్మెల్సీ జనాబ్ అమీర్ అలీఖాన్‌ను కలిసిన ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమతులైన సియాసత్ ఉర్దూ పేపర్ ఎడిటర్ జనాబ్ అమీర్ అలీ ఖాన్‌ని టీఎన్జీవోస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.యస్.ఎం.హుస్సేనీ (ముజీబ్) మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ వర్గానికి అమీర్ అలీఖాన్ సేవలు ఎంతో అవసరమని, రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో రాష్ట్రానికి మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గవర్నర్ కోటాలో ప్రొఫెషన్ కోదండరాంని అమీర్ అలీ ఖాన్‌ని నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శిరసు వంచి ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో మొహమ్మద్ నసీరుద్దీన్ వికాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త వల్ల అనారోగ్యాలకు గురవుతున్నాం

- శ్రీనగర్ కాలనీ వాసులు ఆవేదన



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ లోతుకుంట శ్రీనగర్ కాలనీ లక్ష్మీ కళామందిర్ థియేటర్ సమీపంలో ఉన్న ప్రయి వేటు స్థలంలో మున్సిపాలిటీ సిబ్బంది చెత్త వేయడం ఇబ్బందికరంగా ఉన్నదంటూ శ్రీనగర్ కాలనీ వాసులు వాపోతున్నారు. ఆ స్థలంలో చికెన్ వేస్ట్, వ్యర్థ పదార్థాలు కాల్చడం వల్ల అనేక రోగాలకు గురవుతున్నామని కాలనీ వాసులు వెంకటేష్, గంగరాజులు తెలిపారు. ఇప్పటికైన మున్సిపాలిటీ అధికారులు చొరవ చూపి చెత్తను కాలనీ సమీపంలో కాకుండా దూరంగా వేరేచోటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

75 పడకలు, 125 మంది సిబ్బందితో మరిన్ని సమగ్ర సేవలు



- 29 న రీహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్న చినజీయర్ స్వామి
- సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-బేగంపేట్

మహానగరంలో ఉన్న ప్రజలకు రీహాబిలిటేషన్ సేవలు అవసరమని కానీ ఇప్పుడు 5,820 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఈ కొరతను కొంతమేర తీర్చేందుకు అనంత రీహాబిలిటేషన్, పెయిన్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రాన్సిషనల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు సంస్థ సీఈఓ, తెలంగాణ ఆరోగ్యశ్రీ ట్రస్టు మాజీ సీఈఓ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. రీహాబిలి టేషన్ కేంద్రాన్ని 29 వతేదీ ఉదయం10.30గంటలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి ప్రారంభిస్తాని,కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి, కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కరరావు, సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురవారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త జూపల్లి రామేశ్వరరావు, ఎంపీ టీజీ వెంకటేష్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ లాంటి ప్రము ఖులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా అనంత రీహాబిలిటేషన్, పెయిన్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రాన్సిషనల్ కేర్ సెంటర్ గురించి డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ, "రోజుకు 24 గంటలూ క్రిటికల్ కేర్ ఫిజిషియన్లు, జనరల్ ఫిజిషియన్లు కలిసి.. ఇన్ఫెక్షన్లతో బాధపడే రోగులకు పాజిటివ్, నెగెటివ్ ప్రెజర్ రూమ్స్‌లో చికిత్సలు అందిస్తారని, ప్రతి ఒక్క రోగికి వారి అవసరాలకు అను గుణంగా ప్రత్యేక ఆహారాన్ని అందించేందుకు డైటీషియన్ సేవలు ఉంటాయన్నారు. నొప్పి నివారణ చికిత్సల విషయంలో అంతర్జాతీయంగా ప్రత్యేక శిక్షణ పొందిన డాక్టర్ అనూష తల నుంచి కాలి వేళ్ల వరకు శరీరంలో ఎక్కడ ఎలాంటి నొప్పి ఉన్నా నయం చేస్తారని, 75 గదులతో దక్షిణ భారతంలోనే అత్యంత పెద్ద రీహాబిలిటేషన్ కేంద్రాల్లో ఇది ఒకటి అవుతుందన్నారు. కార్డియాలజీ, రెస్పిరేటరీ, స్పోర్ట్స్‌మెడిసిన్, న్యూరోసర్జరీ, ఆర్థోపెడిక్ లాంటి విభాగాల్లో శిక్షణ పొందిన 10 మంది ఫిజియోథెరపిస్టులు రోగులకు చికిత్స అందిస్తారని అని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. రీహాబిలిటేషన్ సేవలతో పాటు పాలియేటివ్ కేర్ సేవలు కూడా అందించే ఈ ఆస్పత్రిలో ప్రధానంగా డాక్టర్ అనూష కారుమూరి, డాక్టర్ కిషోర్ కారుమూరి, డాక్టర్ అజయ్, డాక్టర్ వెంకట్, ఇంకా క్రిటికల్ కేర్ స్పెషలిస్టులు, జనరల్ ఫిజిషియన్లు, ఇతర వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు.పూర్తిస్థాయి బ్యాకప్ కార్డియాలజీ, వెంటిలేషన్, ఇతరత్రా సేవలు అందుబాటులో ఉన్నాయని అనంత ప్రమోటర్ డాక్టర్ ఎంఎస్ ఆనందరావు వివరించారు.

అందం ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తుంది

- స్రవంతి చోకరపు



నవతెలంగాణ-బంజారాహిల్స్

జీవితంలో అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలని ప్రతి ఒక్కరికి ఉంటుందని ఆలాంటి శైలి ప్రస్తుత ఇప్పటి జనరేషన్లలో కన్పిస్తుంటుందని నటి స్రవంతి చోకరపు అన్నారు. బంజారాహిల్స్‌లోని రోడ్ నెంబర్.1 లో ఢిల్లీ ఆధారిత వెల్నెస్ చైన్ బ్రాండ్ నెలకొల్పిన హబీబ్స్ హెయిర్ అండ్ బ్యూటీ తెలుగు రాష్ట్రాల 18వ సెలూన్ బ్రాంచ్‌ను శనివారం నటి స్రవంతి చొకరపు, హబీ బ్స్ ఫౌండర్ హబీబ్ అహ్మద్, అమన్ అహ్మద్ కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందం ఆత్మ విశ్వాసాన్ని కూడా మరింత పెంపొందిస్తుందని, జాతీయ, అంతర్జా తీయ సెలూన్ బ్రాండ్లు ఒకప్పుడు ఎంతో ఖరీదు పాటు పరమితంగా ఉండేవని, కాని ఇప్పుడు ఈసౌందర్య పోషక సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ 2024 డిసెం బర్ నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా 35కి పైగా సెలూన్‌లను ఏర్పాటు చేయను న్నామని హబీబ్స్ ఫౌండర్ హబీబ్ అహ్మద్, మాస్టర్ ఫ్రాంచైజీలు గౌతమ్ మంఘనాని, ప్రశాం త్‌లు తెలిపారు.ఈ రంగంలోమహిళా యువ వ్యాపార వేత్తలను ప్రోత్సహించేందుకు ఫ్రాంచైజీ లను కూడా ఇస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

వైద్య అనుబంధ వృత్తులకు ఉజ్వల భవిష్యత్తు





- నిమ్స్ డైరెక్టర్ డా.నగరి బీరప్ప

నవతెలంగాణ-బంజారాహిల్స్/సిటీబ్యూరో

పంజాగుట్టలోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ, వైద్య విద్య అనుబంధ డిగ్రీ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శనివారం నిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో నిమ్స్ డైరెక్టర్ నిమ్స్ విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య నగరి బీరప్ప పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైద్య అనుబంధ వృ త్తి విజ్ఞాన కోర్సులకు, సాంకేతిక నిపుణులకు అత్యంత డిమాండ్ ఉంటుందని, వైద్యఆరోగ్య వృత్తి విద్యార్తులుగా మూడు సంవత్సరాల పాటు క్రమశిక్షణతో నిమ్స్‌లో శిక్షణ పొందిన వారికి ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధి పొందే అవకాశం ఉందని తెలిపారు. దేశ, విదేశాల్లో నిపుణులైన చాలా ఉందని వారికి సదవకాశాలున్నాయని, నిమ్స్ త్వరలో నాలుగు వేల పడకల ఆసుపత్రిగా అభి వృద్ధి చెందనున్నదని, వారికి అందులో కూడా వారికి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఆసోసియేట్ డీన్ డా. ఓ.సాయిసతీష్ మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు కఠినమైన శిక్షణ అభ్యసించినపుడే నిష్ణాతులైన సాంకేతిక నిపుణు లుగా రూపుదిద్దుకుంటారన్నారు.ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు మోటివేటర్ ఆనంద్ సిరిప్రగడ ఉపన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందనీ విద్యార్థినిలు విద్యార్థులు పలు సంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించే అందరిని మెప్పించారు. నిమ్స్ నెఫ్రాలజీ హెడ్, ఫార్మర్ డా"గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 'టమ్ కమ్' ద్వారా నర్సింగ్, పారామెడికల్ సాంకేతిక నిపు ణుల కు విదేశాలలో ఉద్యోగావకాశాలను కల్పిస్తుందని ఈ అవకాశాన్ని వినియోగించు కావాలన్నారు.

నిమ్స్ డీన్ డా.రాజశే ఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శాంతివీర్ అధ్యాప కులు, సాంకేతిక విద్య కోఆర్డినేటర్స్ భరత్ భూషణ్, శ్రీనివాస్, దామోదర నాయుడు, దుర్గ,మల్లికా ర్జున్, అనురాధ, శ్రీధర్,శైలజ, నర్సింహమూర్తి, వివేకా నంద పాల్గొ న్నారు. విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాం స్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఫ్రెషర్స్ డే సందర్భగా నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు డైరెక్టర్, డీన్ బహుమతి ప్రదానం చేశారు.

ఒకే వేదికపై మహిళా వ్యాపారవేత్తల వస్త్రోత్పత్తులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆధునిక సంప్రదాయ మేళవింపు కలగలిపిన, స్వాన్ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ రెండు రోజుల వస్త్ర ప్రదర్శన టాలీవుడ్ నటి రాశి సింగ్ శనివారం ఫిలింనగర్‌లో (ఎఫ్ఎన్ సీసీ) హాలులో శనివారం ప్రారంభిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైనర్లు,మహిళా వ్యాపా రవేత్తల వస్త్రోత్పత్తులు ఒకే వేదికలో ఏర్పాటు చెయడం అభినందనీయమనీ నటి రాశిసింగ్ అన్నారు. ప్రదర్శనలో ఉంచిన హ్యాండ్‌లూమ్ అండ్ సిల్క్‌తో పాటు విభిన్న రకాల ఉత్పత్తులు ఎంతో ఆకట్టుకునే విధంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అనంతరం నిర్వాహకులు అంజలిరెడ్డి, స్వాతి వేములలు మాట్లా డు తూ ఔత్సాహిక మహిళా ఫ్యాషన్ డిజైనర్లు, మహిళా పారిశ్రామికవేత్తలు వేలాది సమకాలిన, సాంప్రదాయ చేనేత చీరలు, పట్టు, డిజైనర్ దుస్తులు, ఆభరణాలు, లైఫ్ స్టైల్ ఉపకరణాలు, గృహాలంకరణలు వంటి మరెన్నో ఇక్కడ కొలువు దీరాయని, ఈ ప్రదర్శన ఆదివారం రాత్రి వరకు కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఓయూలో విద్యార్థినులకు భద్రత కరువు!

- మొన్న పీహెచ్‌డీ విద్యార్థినుల హాస్టల్.. నేడు సికింద్రాబాద్ హాస్టల్‌లో..
- రక్షణ చర్యలు ఎక్కడ ? అలంకార ప్రాయంగా సెక్యూరిటీ..
- కరువైన నైట్ పెట్రోలింగ్.. పూర్తిస్థాయిలో భద్రత..
- రాత్రయ్యిందంటే భయాందోళనలో హాస్టల్ విద్యార్థినీలు







నవతెలంగాణ-ఓయు

ఓయూకి గత 4సంవత్సరాల నుండి అధిక రెట్టింపు సంఖ్యలో విద్యార్థినీలు ప్రవేశాలు పొందు తున్న విషయం తెల్సిందే. విద్యార్థినులను దృష్టిలో ఉంచుకుని వారికి సౌకర్యాలు కల్పన, కనీస వసతుల కల్పన పక్కన పెడితే రక్షణ చర్యలు చేపట్టడంలో ఓయూ సిబ్బంది వైఫల్యం చెందారు అన డానికి ఉదాహరణయే ఇటీవలే వరుస సంఘటనలు..

ఇప్పటి వరకు జరిగిన సంఘటనలు...

2011 సంవత్సరంలో తెల్లవారుజామున 3గంటల సమయంలో ఓ ఆగంతకుడు లేడీస్ హాస్టల్ మెయిన్ గేట్ నుండి విద్యార్థినుల గదుల్లోకి వెళ్లే ప్రయత్నాలు చేశారు. అది గమనించి కేకలు వేయడంతో హాస్టల్ వెనుక వైపు కూలిపోయిన ప్రహరీ దూకి తప్పించుకుయారు. దీనితో నాటి స్టూడెంట్ డీన్‌కు విద్యార్థులు తమ ఆవేదన వ్యక్తం పరిచారు. ఆ అంశాన్ని మరచి పోయిన కొన్ని నెలల వ్యవధిలోనే ఒక వ్యక్తి లేడీస్ హాస్టల్ లోకి దూకి ఏకంగా ఓఅమ్మాయి ల్యాప్‌టాప్‌ను అపహరించుకుపోయాడు.ఈ రెండు ఘటనల్లో నిందితులను నేటి వరకు గుర్తించ లేదు.

2019.సంవత్సరంలోకత్తితో దాడి...

2019 సం,ఆగస్టు 15న, తెల్లవారు జామున 3గంటల సమయంలో ఒక వ్యక్తి లేడీస్ హాస్టల్ వెనుక వైపు ఉన్న గోడ దూకి లోపలికి వచ్చాడు. హాస్టల్ 2వ, ఫ్లోర్ వెళ్లి దర్జాగా ఫోన్ మాట్లాడుతూ కారిడార్‌లో తిరుగుతూ కనిపించినట్లు వారు తెలిపారు. వాష్ రూమ్ వద్దకు వెళ్లి ఒక విద్యార్థిన్ని కత్తితో బెదిరిస్తున్న ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి సదరు గర్ల్ సెల్ ఫోన్ లాక్కొని పారిపోయారు. దీనితో విద్యార్థులు కొన్ని రోజుల పాటుగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పోలీసులు సన్నీ, పి.రమేష్ అనే నిందితులను అరెస్టు చేశారు.

ఈ జనవరి 3న, గుర్తు తెలియని వ్యక్తి ఓయూ పీహెచ్‌డీ విద్యార్థినుల వసతి గృహంలోకి గోడ దూకి రావడంతో విద్యార్థుల అరుపులతో అక్కడి నుండి పారిపోయారు. దానికి ఆగంతుకుడు వదలి వెళ్లిన చెప్పు ఆధారంగా, సీసీ కెమెరాల సహాయంతో ఓయూ పోలీసులు దర్యాప్తు చేసి జంగరాజు అనే వ్యక్తి అరెస్ట్ చేశారు.

ఇక నేడు సికింద్రాబాద్‌లో...

సికింద్రాబాద్ పీజీ కళాశాలలో మహిళ హాస్టల్‌లోకి శుక్రవారం అర్ధరాత్రి ఆగంతకులు చొరబడినట్లు పలువురు మహిళ విద్యార్థులు తెలపడంతో ఒక్కసారిగా హై టెన్షన్ మొదలైంది. పీజీ కాలేజీ హాస్టల్లోకి ఇద్దరు అగంతకులు చొరబడి అలజడి సృష్టించారు. విద్యార్థులు దేహశుద్ధి చేశారు. బాత్రూం కిటికీలు పగల గొట్టి లోపలికి వచ్చి విద్యార్థులపై దాడికి ప్రయత్నించారు. విద్యార్థినులు అప్రమత్తమై ఒకరిని పట్టుకొని స్థానిక బేగంపేట పోలీసులకు అప్పజెప్పారు. మరొకరు పరారైనట్లు తెలిపారు. హాస్టల్‌లో తమకు రక్షణ కరువైందని, హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని శనివారం ఉదయం నిరసనకు దిగారు. సంఘటన తెలుసు కున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియ దర్శిని, ఏసీ పి.రామలింగరాజు, సీఐ భాస్కర్, కాలేజీ ఎదుట భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని డీసీపీ హామీ ఇవ్వడంతో విద్యార్థులు నిరసనవిర మించారు. కాలేజీలో చొరబడిన నిందితులను పట్టుకుంటామని ఆమె హామీ ఇచ్చారని, విద్యా ర్థులకు రక్షణ కల్పి కల్పిస్తా మని ఇలాంటి సం ఘటనలు మరోసారి కాకుం డా చూస్తామని హామీ ఇచ్చారు. నిందితులను త్వరలో అదు పులో తీసుకొని విచారణ చేపడు తున్నామని, ముమ్మ రంగా దర్యాప్తు చేస్తున్నట్లు బేగంపేట పోలీసులు తెలిపారు. ఇక్కడ ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో పాటుగా కనీసం ముళ్ల కంచె కూడా ఏర్పాటు చేయని పరిస్థితి ఏర్పడిందని విద్యార్థునీలు ఆవేదన చెందుతున్నారు.

వరుస ఘటనలు పునరావృతం అవుతున్న రక్షణ చర్యలు కరువు..

ఓయూ పరిపాలనా భవన్‌చుట్టూ నిత్యం సెక్యూరిటీతో పాటుగా ముళ్ల కం చెలు ఏర్పాటు చేశారు.105 చరిత్ర గల యూనివర్సిటీల అమ్మాయిల రక్షణచర్యలు ఎక్కడ అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులకు వారి కార్యాలయాలకు అన్ని హంగులు ఉంటాయి. కానీ హాస్టల్‌లో చదువు తున్న విద్యార్థినీలకు మాత్రం రక్షణ చర్యలు లేకరాత్రి అయితే బిక్కు బిక్కుమంటూ భయంతో కాలం వెళ్లదీసునట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు కోట్లు వెచ్చించి బిసెక్యూర్ సంస్థ మాజీఆర్మీ సైనికు లతో సెక్యూరిటీ ఏర్పాటు చేసిన ఇలా అమ్మాయి లకు రక్షణ కరువైంది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వంకూడా లేడీస్ హాస్టల్ రక్షణ విషయంలో రిపోర్టు అడిగినట్లు సమాచారం.ఇది ఇలా ఉండగా విద్యారినులకు ఓయూ లోపల అడవుల్లో మరుగు దొండ్లు ఏర్పాటు చేయడంతో రాత్రి అయితే వారు భయాందోళనకు గురవుతున్నట్లు వారు తెలి పారు. ఇప్పటికైన ఘటనలు జరిగినప్పుడు కాకుండా ప్రతిష్టాత్మక బందోబస్తు ఏర్పాటు చేయాలని, పోలీసులు కూడా రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రహరీ ఎత్తు పెంచి ఐరన్ ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వారంలో ఒక్కసారైన పర్యవేక్షించాలని విద్యార్థినీలు కోరుతున్నారు.

తెలంగాణ తల్లి 14వ వార్షికోత్సవం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోయిన్‌పల్లి ప్లేగ్రౌండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం నిర్మించి 14 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం 'తెలంగాన తల్లి వార్షికోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపాధ్య క్షుడు జంపన్న ప్రతాప్ తెలంగాణ విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వ హించారు. అనంతరం కంటోన్మెంట్ పారిశుధ్య కార్మికులకు స్వీట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆనాడు విగ్రహం నిర్మించే తరుణంలో పోలీ సులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఉద్యమకారులు వీరారెడ్డి, ప్రభుదాస్, ప్రభు గుప్త, సుకుమార్, ప్రభు గౌడ్‌లు విగ్రహ ఏర్పాటుకు విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జంపన ప్రతాప్ షకీబ్, సిరాజ్, అజిత్,వర, పవన్,చోటు, మౌలా, దఫెదర్ గణేష్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఓయూలో ముగిసిన 'సీఎఫ్ఆర్‌డీ' వర్క్‌షాప్

- సెర్చ్ టెక్నిక్స్‌పై మూడవ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్



నవతెలంగాణ-ఓయూ

తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి శాస్త్రీయ పరి కరాలను బహిర్గతం చేయడం సుసంప న్నమైన అనుభవం" అని ఓయూ సైన్స్ కళాశాల డీన్ ప్రొ. కరుణ సాగర్ దాసరి అన్నారు. శని వారం సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ నిర్వహించిన మూడవ "ఇంట ర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఆన్ రీసెర్చ్ టెక్నిక్స్" అనే అంశంపై ఓయూ సీఎఫ్ఆర్‌డీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన శనివారం సాయంత్రం వర్క్‌షాప్ ముగిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఓయూ సైన్స్ కళాశాల డీన్ ప్రొ.కరుణసాగర్ దాసరి హాజరై మాట్లాడుతూ యువ విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చిది ద్దాలని పిలుపునిచ్చారు.అందివచ్చిన అవకాశ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, శాస్త్రీయ పరిణామాలను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌరవ అతిథి సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. బి వీరయ్య పాల్గొని మాట్లాడారు. అనంతరం సిఎఫ్ఆర్‌డి డైరెక్టర్ ప్రొ.బి.సందీప్త మాట్లాడుతూ సైన్స్‌లో ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్‌లో అపూర్వమైన మార్పులు వస్తున్న నేపథ్యంలో ఇది చాలా కీలకమని అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌ను సందర్శించి, వారం రోజుల పాటు చేపట్టిన కార్యక్రమాలను ఆమె వివరించారు. ఇటువంటి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలలో పాల్గొనేవారి ఉపాధిని అవకాశాలు మెరుగుపడతాయని ఆమె అన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ బయో కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొ. బి.మంజుల, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ హమీదా, డాక్టర్ పి.మురళీ ధర్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కోఆర్డినేటర్, హెచ్‌డీసీ, పీహెచ్‌డీ, ఎంస్సీ, బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా విద్యార్థులకు రక్షణ కల్పించాలి

- ఓయూ విద్యార్థి సంఘాలు
- ఓయూ వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఆర్ట్స్ కళాశాల ఎదుట దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఓయూ

ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కళాశాల లేడీస్ హాస్టల్‌లో శుక్రవారం రాత్రి ప్రవేశం చిన అగంతకులను కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనకు విసీ, రిజిస్ట్రార్‌లు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం వారి దిష్టిబొమ్మను ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నా యకులు మాట్లాడుతూ గతంలో పలుమార్లు మహిళా విద్యార్థులకు భద్రత కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. అంతేకాకుండా ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలనికోరారు. ఇప్పటికై అధికారులు స్పందించి మహిళా విద్యార్థులకు రక్షణ కల్పించాలని లేకపోతే మహిళా విద్యార్థులను కలుపుకొని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చ రించారు. విద్యార్థులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసు కోవాలని ప్రభుత్వాన్ని ఓయూ విద్యార్థులు కోరారు. కార్యక్ర మంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, ఏఎంఎస్ఏ, ఎంఎస్ఎఫ్, ఏఎస్ఏ, టీఎస్‌యూ, టీఎస్ఎఫ్, ఏఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

వీసీ రవీందర్ యాదవ్ వెంటనే రాజీనామా చేయాలి : ఏబీవీపీ



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట వీసీ రవీందర్ యాదవ్ దిష్టిబొమ్మను ఏబీవీపీ ఓయూ శాఖ ఆధ్వర్యంలో దహనం చేశారు. శుక్రవారం అర్ధ రాత్రి సికింద్రాబాద్ పీజీ కళాశాల లేడీస్ హాస్టల్‌లో ముగ్గురు ఆగంతకులు కిటికీలు పగలకొట్టి ప్రవేశం చిడం ఈ వీసీ నిర్లక్ష్యా నికి నిదర్శమన్నారు. ఈ మధ్య కాలంలో ఉస్మానియా యూనివర్సిటీలోనీ పీహెచ్‌డీ లేడీస్ హాస్టల్లో చొరబడిన ఘటన మరవక ముందే మరొకసారి ఓయూసబ్ క్యాంపస్ అయిన సికింద్రాబాద్ పీజీ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమన్నారు. సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ వీసీ రవీందర్ యాదవ్ రాజీనామా చేయాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో మహిళల పట్ల రక్షణ కల్పించి ఆ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జాయింట్ సెక్రటరీ, విద్యానగర్ విభాగం కన్వీనర్ పృథ్వీతేజ , స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అలివేలి రాజు ,స్టేట్ అల్ యూనివర్సిటీస్ కో కన్వీనర్ గణేష్ సాగర్, ఓయూ వైస్ ప్రెసిడెంట్ సాయి, విద్యార్థి,విద్యార్థినులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టుదలతో కష్టపడి పనిచేస్తే విజయం

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పట్టుదలతో కష్టపడి పని చేస్తే జీవితంలో విజయం సాధిస్తారని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం మూసారాంబాగ్లోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గహంలో 10వ తరగతి చదువుతున్న వసతి గహ విద్యార్థులకు ఏర్పాటుచేసిన ప్రేరణ మరియు శిక్షణా తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ టాలెంట్ లేకున్నా పట్టుదల, కష్టపడే తత్వం, నమ్మకం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. టాలెంట్ ఉండి కష్టపడే తత్వం లేకపోతే మీరు అనుకున్నది సాధించలేరని,ఏవో చిన్న చిన్న వాటితో సరిపెట్టుకోవాల్సి ఉంటుందని అన్నారు. జీవితంలో ముందుకు వెళ్లాలంటే టాలెంట్ ఒకటే సరిపోదని, పట్టుదల,నమ్మకం, కష్టపడే తత్వం ఉంటే విజయం సాధిస్తారని అన్నారు.పెద్ద పెద్ద వ్యాపారాలలో విజయవంతమైన వారు కూడా పెద్ద టాలెంట్ ఉన్నవాళ్లేమీ కాదని వారికి కష్టపడే తత్వం, పట్టుదల ,ఏదో చేయాలన్న తపన ఉండబట్టి వారు విజయం సాధించారని అన్నారు. ఇవి ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని, ఏదో చేయాలి, ఏదైనా సాధించాలని పట్టుదల ఉంటే జీవితంలో విజయం దానంతట అదే వస్తుందని అన్నారు.10వ తరగతి అనేది టర్నింగ్ పాయింట్ అని, దీనిని తేలికగా తీసుకుంటే అది పెద్ద భారంగా మారుతుందని, మీరు కష్టపడి చదివి విజయం సాధిస్తే అది మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిన వాళ్ళు అవుతారని అన్నారు. నేను మీ ముందు కూర్చోవడానికి చదివే కారణమని, చదువు ఉంటే ఏదైనా సాధించవచ్చు అని అన్నారు. మా తల్లిదండ్రులు పిల్లలు బాగా చదవాలని, మంచి స్థాయిలో ఉండాలని జేయంతో చదివిస్తే నేను ఈ స్థాయికి వచ్చానని అన్నారు. మీరు మంచి స్థితికి చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తే అదే తల్లిదండ్రులకు మీరిచ్చే గౌర వం అన్నారు.మీరు మంచి ఆహారం తీసుకోవాలని ఎక్సర్సైజులు చేయాలని,ఆరోగ్యంగా ఉంటే మంచిగా చదవగలరని మీరంతా మంచి శక్తి కలిగి ఉన్నారని, మీరు కష్టపడాలి,కష్టపడందే ఏమీ రాదని అన్నారు. కష్టపడి చదవండి మీ లక్ష్యాన్ని సాధించండి. ఈ రెండు నెలలు ఒక ప్రణాళిక ప్రకారం బాగా కష్టపడి చదవాలని ఆత్రుత పడొద్దని ధైర్యంగా ఎదుర్కోవాలని అప్పుడే మీరు పరీక్షలు బాగా రాయగలం అనే నమ్మకం వస్తుందని అన్నారు. మీరు ఎక్కువగా మోడల్ టెస్ట్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలని, స్లిప్ టెస్టులు ఎక్కువగా రాసి రివిజన్ చేసుకున్నట్లయితే పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోగలరని అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. మనసును కుదుటగా ఉంచుకొని కష్టపడితే విజయం సాధిస్తారని అన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు కలెక్టర్ పరీక్షల మెటీరియల్ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆశన్న, ఆర్ సి ఓ ఆదిత్య వర్మ,హాస్టల్ వార్డెన్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



చైతాలి దాస్... చిన్నతనం నుండి ఖైదీలను చూస్తూ పెరిగింది. మొదట్లో వారు భయంకరమైన వ్యక్తులుగా ఆమెకు కనిపించారు. వయసు పెరిగే కొద్దీ వారూ సాధారణ మనుషులే అని గ్రహించింది. పేదరికం, అవకాశల లేమి వారిని నేరస్థులుగా మార్చిందని తన అధ్యయనంలో తెలుసుకుంది. అందుకే ఖైదీలకు, మహిళలకు, పిల్లలకు సాధికారత కల్పించడం తన బాధ్యతగా భావించింది. దీని కోసమే 'జూట్ స్టోరీ బియాండ్ బార్స్'ను ప్రారంభించింది. ఆమె చేసిన ఈ చిన్న ప్రయత్నం ఎందరి జీవితాల్లో వెలుగులు నింపిందో, ఎందరిలో మార్పు తెచ్చిందో మనమూ తెలుసుకుందాం...

ఖైదీలలో మార్పు కోసమే...

చైతాలి దాస్‌కు తన ఐదేండ్ల వయసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయిన తన తండ్రితో కలిసి కోర్టు గదిని సందర్శించడం తొలి జ్ఞాపకాలలో ఒకటి. అక్కడ ఓ పోలీసు వ్యాన్ నుండి నేరారోపణలకు పాల్పడిన వ్యక్తులు దిగుతుంటే చూసింది. వారి చేతులకు బేడీలతో పాటు, నడుము చుట్టూ మందపాటి తాడు కట్టి వుంది. ఆశ్చర్యానికి గురై ఆ వ్యక్తుల గురించి తన తండ్రిని అడిగింది. నిందితులు పోలీసు వ్యాన్ నుండి దిగడంతోనే వారి కుటుంబ సభ్యులు పరుగెత్తుకుంటూ వారి వద్దకు వచ్చారు. కానీ పోలీసులు అడ్డుకున్నారు. ఆ కుటుంబాల వేదన, బాధ చైతాలీని తీవ్ర ప్రభావానికి గురి చేశాయి. 'ఈ ఖైదీలు భయంకరమైన వ్యక్తులని అనుకున్నాను. అయితే వారు కూడా మార్పు వచ్చే సాధారణ మానవులే అని ఎదుగుతున్నప్పుడు తెలుసుకున్నాను' అంటూ ఆమె గుర్తు చేసుకున్నారు.



మహిళల సాధికారత కోసం

శిక్షాకాలం ముగిసిన తర్వాత కూడా జీవితకాలం ఆ కళంకాన్ని భరించాల్సిన ఖైదీల దుస్థితిని దృష్టిలో ఉంచుకుని చైతాలి 2016లో 'జూట్ స్టోరీ బియాండ్ బార్స్' ప్రాజెక్టును ప్రారంభించారు. ఇది మహిళల సాధికారత కోసం పని చేసే రక్షక్ ఫౌండేషన్ కింద ప్రారంభించబడింది. ఖైదీల నైపుణ్యం, జీవనోపాధి, అభివృద్ధి, సామాజిక చేరిక, పర్యావరణ పరిరక్షణ దీని ముఖ్య ఉద్దేశం. పునరావాసం, జీవనోపాధి అవకాశాలను కల్పించడం ద్వారా ఖైదీలు, ఇతర వెనుకబడిన మహిళలకు సాధికారత కల్పించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఇది మొదట కేవలం శిక్షణా ప్రాజెక్ట్‌గా ప్రారంభించినప్పటికీ 2021 నాటికి ఇది పూర్తి స్థాయి స్టార్టప్‌గా పరిణామం చెందింది. 'రూట్ టు జ్యూట్ ద్వారా ఖైదీలు గౌరవంగా బతికేందుకు జీవనోపాధిని కల్పించాలి. దీని కోసం నేను ఏదైనా చేయాలనుకున్నాను' అని ఆమె పంచుకున్నారు.

మేకింగ్ ఆఫ్ ది జ్యూట్ క్వీన్

పశ్చిమ బెంగాల్‌లోని అలీపూర్‌లో పుట్టి పెరిగిన చైతాలి ఇల్లు అలీపూర్ సెంట్రల్ జైలు, ప్రెసిడెన్సీ కరెక్షనల్ హోమ్ మధ్య ఉంది. సమీపంలోని పోలీసు స్టేషన్ నుండి విచారించబడుతున్న వ్యక్తుల అరుపులు విన్నట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. జైలుకు సమీపంలో పెరిగిన ఆమె జైలు ప్రపంచం గురించి చాలా అధ్యయనం చేశారు. ఇదే ఖైదీల పట్ల ఆమెకు సానుభూతిని పెంపొందించడానికి సహాయపడింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత ఆమె కార్పొరేట్ ప్రపంచంలోకి ప్రవేశించారు. కొంత కాలం తర్వాత తన కుటుంబాన్ని చూసుకుంటూ స్టాక్ మార్కెట్‌లో కొనసాగారు. ప్రస్తుతం 50 ఏండ్ల చైతాలి సామాజిక కార్యక్రమాల్లో భాగం కావాలని కోరుకుంటున్నారు. తన తల్లి నుండి ఆమె ఈ సేవా గుణాన్ని అలవర్చుకున్నారు. ఎప్పుడూ ఇతరులకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటారు. భర్త కూడా ఆమెకు మద్దతు ఇస్తున్నారు.

రక్షక్ ఫౌండేషన్ ద్వారా...

ఎన్నో ఏండ్లుగా ఆమె అనేక ఎన్‌జీఓలతో కలిసి పనిచేశారు. 2014లో రక్షక్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఇది ఖైదీలు, నిరుపేదలకు సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. మొదట్లో ఖైదీలకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు అందించింది. నెమ్మదిగా కుకీ మేకింగ్, యోగాను పరిచయం చేశారు. తర్వాత చెక్క పని, పెయింటింగ్‌లో శిక్షణ ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్‌లు ఆరు నెలల నుండి ఏడాది పాటు కొనసాగేవి. అన్ని ప్రాజెక్ట్‌లలో 'జూట్ స్టోరీ బియాండ్ బార్స్' ఆమెను ఎంతగానో ఆకర్షించింది. తర్వాత కాలంలో ఇది పూర్తి స్థాయి వ్యాపారంగా మారింది. 'నేను మహిళలు, పిల్లల కోసం పని చేయాలని భావించాను. అయితే మొదట్లో నా పనిని చాలా మంది పెద్దగా మెచ్చుకోలేదు. ఖైదీలను మార్చడం అసాధ్యమని ప్రజలు నమ్ముతారు. ఇలాంటి అడ్డంకులు ఎన్ని ఉన్నప్పటికీ నేను ముందుకు వెళ్లాను' ఆమె చెప్పారు.



స్థిరమైన వ్యాపారంగా...

ఖైదీలకు శిక్షణ అందించేందుకు ఆమె నేషనల్ జ్యూట్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎన్‌జేబీ)తో కలిసి పనిచేశారు. 45 రోజుల పాటు సాగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని మొదట డమ్ డమ్ సెంట్రల్ కరెక్షనల్ హోంలో నిర్వహించారు. తర్వాత అలీపూర్ సెంట్రల్ జైలు, ప్రెసిడెన్సీ కరెక్షనల్ హోమ్‌లో శిక్షణా సమావేశాలు జరిగాయి. జైలు అధికారులు యంత్రాలను అందించగా చైతాలి ముడిసరుకుతో పాటు శిక్షకులను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సెషన్లలో ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్లలో పెట్టారు. వచ్చిన డబ్బు ఖైదీల ఖాతాలో జమ చేశారు. తర్వాత కాలంలో జనపనార వస్తువులను ఉత్పత్తి చేయిస్తూ వారికి సాధికారత కల్పించడానికి శిక్షణా సెషన్‌లను అందించాలనే ఆలోచన వచ్చింది. అయితే అప్పట్లో పూర్తి స్థాయిలో శిక్షణా సెషన్‌లు ఏర్పాటు చేసి దీన్ని ఓ స్థిరమైన వ్యాపారంగా మార్చడానికి వారి వద్ద ఎలాంటి ప్రణాళికా లేదు. దాంతో అప్పటి శిక్షణ వారికి సరిపోలేదు. కనుక 2021లో చైతాలి భారత ప్రభుత్వంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఆఫ్ ఇన్నోవేషన్ పార్క్ ద్వారా స్టార్టప్‌ను పొందారు. రెండేండ్ల తర్వాత ఆ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించడానికి ఆఫ్‌లైన్ స్టూడియోను కూడా ప్రారంభించారు.

ఆర్థిక సమస్యలతోనే...

చైతాలి నేరస్థులను అంటిపెట్టుకొని ఉన్న కళంకాన్ని తొలగించాలనుకుంటున్నారు. శిక్ష ముగిసిన తర్వాత కూడా నేరస్థులను అదే దృష్టితో సమాజం చూస్తుందని ఆమె అంగీకరించారు. ప్రజల అభిప్రాయాలను మార్చడంలో వృత్తి శిక్షణ ఒక మంచి పాత్ర పోషిస్తుందని ఆమె దృఢంగా విశ్వసించారు. 'వృత్తి శిక్షణలో పాల్గొనడం ద్వారా ఈ ఖైదీల పట్ల ప్రజల అవగాహనలు మార్చే అవకాశం ఉంటుంది. అలాగే జీవనోపాధిని పొందేందుకు అవసరమైన నైపుణ్యాలు వారికి అందుతాయి' అని ఆమె చెప్పారు. 'పేదరికంతో కనీస వనరులు అందుబాటులో లేకపోవడం వల్లనే వారు నేరాలకు పాల్పడుతున్నారని ఆమె అభిప్రాయం. సమాజంలో సమగ్రమైన, సహాయక వాతావరణం పెంపొందించగలిగితే నేరాలను నిరోధించడం సులభమని ఆమె అంటున్నారు.

– సలీమ

గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు

భారతదేశం జనపనారను అత్యధికంగా ఉత్పత్తి చేస్తుంది. అయినా అది పెద్దగా ఉపయోగంలో లేదు. పైగా దాని ఉత్పత్తులను అందరూ పాతవిగా భావిస్తున్నారు. అందుకే మరచిపోయిన జనపనారను పునరుద్ధరించాలని ఆమె భావించారు. ఇప్పుడు జనపనారతో హస్తకళలు, రగ్గులు, బట్టలు, హ్యాండ్‌బ్యాగ్‌లు వంటివి ఉత్పత్తి చేస్తున్నారు. వీటి ధర రూ. 100 నుండి మొదలై రూ. 5,000 వరకు ఉంటుంది. ఆమె ఫౌండేషన్ 2021న ప్రపంచంలోనే అతి పెద్ద జనపనార సంచిని ఉత్పత్తి చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకుంది. ఆ బ్యాగ్ 30.68 మీటర్ల వెడల్పు, 24.87 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఇప్పటివరకు ఆమె బృందం కోల్‌కతాతో పాటు చుట్టుపక్కల 2,000 మంది ఖైదీలు, 15,000 మంది నిరుపేద మహిళలకు జనపనార ఉత్పత్తులను ఉత్పత్తి చేయడంలో శిక్షణ ఇచ్చారు. కెనడా, స్విట్జర్లాండ్ వంటి దేశాలకు కూడా జ్యూట్ ఉత్పత్తులను విక్రయించడం ప్రారంభించారు.



యూపీలో సీట్ల సర్దుబాటులో తొలి అడుగు

లక్నో : రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు ప్రయత్నాల్లో తొలి అడుగు పడిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తెలిపారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలోని 11 కీలకమైన లోక్‌సభ స్థానాలకు సంబంధించి చర్చల్లో పురోగతి సాధించామని ఆయన చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. దేశంలో అత్యధికంగా లోక్‌సభ స్థానాలు ఉన్న రాష్ట్రం ఇదే.

'కాంగ్రెస్‌తో మా సహృద్భావ పొత్తులో తొలి అడుగు పడింది. పదకొండు కీలకమైన స్థానాల విషయంలో పురోగతి ఉంది. ఇది కొనసాగుతుంది. ఇండియా జట్టుతో చరిత్రను మార్చేయాలన్నదే మా లక్ష్యం' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో అఖిలేష్ తెలియజేశారు. మరోవైపు కాంగ్రెస్ మీడియా విభాగం అధిపతి జైరాం రమేష్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అశోక్ గెహ్లాట్, అఖిలేష్ యాదవ్ మధ్య సీట్ల సర్దుబాటుపై నిర్మాణాత్మక చర్చలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చర్చలు తుది దశకు చేరుకున్నాయని సమాజ్‌వాదీ పార్టీ నేత ఫక్రుల్ హసన్ చాంద్ తెలిపారు. 'ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ పెద్దది. ఢిల్లీ చేరాలంటే యూపీ మీదుగానే పోవాలి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, రాష్ట్రీయ లోక్‌దళ్ ఇస్తున్న సందేశం ఇండియా కూటమిని బలోపేతం చేస్తుంది' అని చాంద్ అన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ యూపీ నుండి రెండు స్థానాలు గెలుచుకుంది. ఆ పార్టీకి 7.53% ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల నాటికి కాంగ్రెస్ బలం బాగా తగ్గింది. ఆ పార్టీ 6.36% ఓట్లతో కేవలం ఒకే స్థానాన్ని దక్కించుకుంది.

హాస్టల్ విద్యార్థినుల బాత్‌రూంలోకి దుండగులు..

(మొదటిపేజీ తరువాయి)

హాస్టల్ ప్రాంగణంలోకి శనివారం తెల్లవారుజామున ముగ్గురు ఆగంతకులు గోడ దూకి ప్రవేశించారు. స్నానాల గదిలోకి చొరబడి సైగలు చేశారు. వారిని గమనించిన విద్యార్థినులు పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒక వ్యక్తి దొరికాడు. ఇద్దరు పరారయ్యారు. దొరికిన వ్యక్తికి విద్యార్థినులు దేహశుద్ధి చేసి బేగంపేట పోలీసులకు అప్పగించారు.

కళాశాల ఎదుట విద్యార్థినుల ఆందోళన

హాస్టల్లో తమకు భద్రత కరువైందని, రక్షణ కల్పించాలంటూ విద్యార్థినులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. కళాశాల గేట్లు మూసివేసి నిరసన తెలిపారు. ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సీసీ టీవీలు ఏర్పాటు చేసి.. చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీసీ వచ్చి తమకు సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. డీసీపీ రోహిణి ప్రియదర్శిని అక్కడకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. డీసీపీ హామీతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.

ఎప్‌సెట్ కన్వీనర్‌గా డీన్‌కుమార్

(మొదటిపేజీ తరువాయి)

టి మృణాళినిని ఎంపిక చేశారు. ఇప్పటికే అన్ని ప్రవేశ పరీక్షలకు సంబంధించిన రాతపరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే.

ప్రవేశ పరీక్షల కన్వీనర్ల వివరాలు

సెట్	విశ్వవిద్యాలయం	కన్వీనర్	రాతపరీక్షల తేదీలు
ఎప్‌సెట్	జేఎన్టీయూహెచ్	బి డీన్‌కుమార్	మే 9 నుంచి 11 వరకు (ఇంజినీరింగ్) మే 12 నుంచి 13 వరకు (అగ్రికల్చర్, ఫార్మసీ)
పీజీఈసెట్	జేఎన్టీయూహెచ్	ఎ అరుణకుమారి	జూన్ 6 నుంచి 8 వరకు
ఐసెట్	కేయూ	ఎస్ నర్సింహ్మచారి	జూన్ 4 నుంచి 5 వరకు
ఈసెట్	ఓయూ	శ్రీరాం వెంకటేశ్	మే 6
లాసెట్	ఓయూ	బి విజయలక్ష్మి	జూన్ 3
ఎడ్‌సెట్	ఎంజీయూ	టి మృణాళిని	మే 23
పీఈసెట్	ఎస్‌యూ	రాజేష్‌కుమార్	జూన్ 10 నుంచి 13 వరకు

బీజేపీలో చేరితే పాతిక కోట్లు

న్యూఢిల్లీ : పార్టీ ఫిరాయిస్తే ఆమ్‌ఆద్మీకి చెందిన ఏడుగురు ఢిల్లీ ఎమ్మెల్యేలకు పాతిక కోట్ల రూపాయలు ఇస్తామని బీజేపీ ప్రలోభపెట్టిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణ చేశారు. ఈ మేరకు తమ పార్టీ ఎమ్మెల్యేలతో బీజేపీ బేరసారాలు నడిపిందని, మద్యం పాలసీ కుంభకోణంలో తనను అరెస్ట్ చేస్తానని కూడా బెదిరించిందని ఆయన చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యేలు జరిపిన సంభాషణలను రికార్డు చేశామని ఆప్ తెలిపింది. 'ఇటీవల ఢిల్లీకి చెందిన ఏడుగురు ఆప్ శాసనసభ్యులను బీజేపీ సంప్రదించింది. కొద్ది రోజుల్లో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తామని, ఆ తర్వాత ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకుంటామని చెప్పింది. 21 మంది శాసనసభ్యులతో చర్చలు జరిపామని, మిగిలిన వారిని కూడా సంప్రదిస్తున్నామని తెలిపింది. ఆ పని పూర్తయిన తర్వాత ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వాన్ని పడగొడతామని అన్నారు. మీరు కూడా రావచ్చని మా ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆఫర్ ఇచ్చారు. పార్టీ మారితే పాతిక కోట్లు ఇస్తామని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు టిక్కెట్లు కూడా ఇస్తామని ఆశ పెట్టారు' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కేజ్రీవాల్ శనివారం పోస్ట్ చేశారు.

ఇప్పటి వరకూ 21 మంది ఎమ్మెల్యేలను సంప్రదించామని బీజేపీ చెబుతున్నప్పటికీ ఏడుగురితో మాత్రమే చర్చించిందని తమ వద్ద సమాచారం ఉన్నదని కేజ్రీవాల్ తెలిపారు. బీజేపీ ఇచ్చిన ఆఫర్‌ను వీరందరూ తిరస్కరించారని చెప్పారు. ఎన్నికల్లో ఆప్‌ను ఓడించే సత్తా లేకపోవడంతో దొడ్డిదారిన ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 'దీనర్థం ఏమిటంటే మద్యం కుంభకోణంపై విచారణ కోసం నన్ను అరెస్ట్ చేయడం లేదు. కానీ వారు ఢిల్లీలోని అమ్‌ఆద్మీ పార్టీని కూలదోసేందుకు కుట్ర చేస్తున్నారు. గత తొమ్మిది సంవత్సరాల్లో వారు మా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అనేక కుట్రలు పన్నారు. అయితే వారు విజయం సాధించలేకపోయారు. దేవుడు, ప్రజలు మాకు ఎల్లవేళలా మద్దతు ఇస్తూనే ఉన్నారు. మా ఎమ్మెల్యేలందరూ కలసికట్టుగా ఉన్నారు. ఈ సారి కూడా వారు తమ నీచమైన ప్రయత్నాల్లో విఫలమవుతారు' అని కేజ్రీవాల్ అన్నారు.

ఢిల్లీ ప్రజల కోసం తమ ప్రభుత్వం ఎన్ని పనులు చేసిందో బీజేపీకి తెలుసునని, వారు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినప్పటికీ వాటిని ఎదుర్కొని నిలబడ్డామని కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ ప్రజలు ఆప్‌ను అపారంగా ప్రేమిస్తారని, కాబట్టి ఎన్నికల్లో ఆప్‌ను ఓడించే సత్తా వారికి లేదని తెలిపారు. అందుకే మద్యం కుంభకోణం పేరు చెప్పి తనను అరెస్ట్ చేయడం ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టాలని భావిస్తున్నారని విమర్శించారు. రాజధానిలో రాజకీయ అశాంతిని సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రాష్ట్ర మంత్రి అతిష్ ఆరోపించారు. 'కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తామని, 21 మంది ఎమ్మెల్యేలను లోబరచుకుంటామని, ప్రభుత్వాన్ని కూలదోస్తామని వీడియో టేపులో వారు చెప్పారు. తమకు ఇవ్వజూపిన సొమ్మును ఆప్ ఎమ్మెల్యేలందరూ తిరస్కరించారు. ప్రభుత్వాలను పడగొట్టడం బీజేపీకి అలవాటే. మధ్యప్రదేశ్, కర్నాటక, అరుణాచల్‌లో వారు చేసింది అదే పని' అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గెలవలేని చోట ప్రజా ప్రభుత్వాలను కూలదోసేందుకు బీజేపీ ప్రయత్నిస్తూ ఉంటుందని ఎద్దేవా చేశారు.

హమాస్‌తో యుద్ధం చేసేందుకే..

(మొదటిపేజీ తరువాయి)

ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. గడచిన ఐదేండ్లలో వ్యవసాయం (-0.6 శాతం), వ్యవసాయేతర (-1.4 శాతం) రంగాలు రెండూ ప్రతికూలతల్ని ఎదుర్కొన్నాయి. దీంతో గ్రామీణ పేదరికం పెరిగింది. దేశంలో 2014లో పురుషుల రోజువారీ వేతనం రూ. 220గా ఉంది. అదే 2022-2023లో 212గా ఉంది. ఉద్యోగాల కల్పన 30 నెలల కనిష్టానికి పడిపోయింది. దీంతో చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయి. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకం కింద పనికోసం డిమాండ్ రోజురోజుకి పెరుగుతున్నది. మోడీ ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో నిధులను తగ్గించింది. కానీ గ్రామీణ నిరుద్యోగం ఎక్కువగా ఉన్నందున రూ. 28,000 కోట్లు కేటాయించవలసి వచ్చింది. 14వ ఆర్థిక సంఘం (2015- 2020)లో వాగ్దానం చేసిన దానికంటే పంచాయతీలకు వాస్తవ నిధుల పంపిణీ 10.4 శాతం తక్కువగా ఉంది. అంతేకాకుండా, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) అమ్మకాలు గతేడాది (2023)లో ఎటువంటి పెరుగుదల లేదు. గృహాల పొదుపులు 50 ఏండ్ల కనిష్ట స్థాయికి వెళ్లాయి. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన 21 సంవత్సరాల కనిష్టంగా ఉంది. 2018-19, 2022-23 మధ్య ప్రజల నుంచి వ్యక్తిగత పన్ను వసూళ్లు 50.55 శాతం పెరిగాయి. అయితే కార్పొరేట్ పన్ను వసూళ్లు 2.72 శాతం మాత్రమే పెరిగాయి.

ఇవన్నీ ఆర్థిక అసమానతల్ని తెలియజేస్తోందని, గతేడాది కూరగాయల ధరలు 60 శాతం పెరిగి ప్రజలపై పెనుభారం మోపాయని ఖర్గే అన్నారు. ఇంకొద్దిరోజులే మోడీ ప్రభుత్వం అధికారంలో ఉండనుంది. త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్.. మోడీ ప్రభుత్వపు చివరి బడ్జెట్ అని ఖర్గే అన్నారు. గతేడాది డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాలు ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల భర్తీకి భవన నిర్మాణ కార్మికుల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానించాయి. కేంద్ర ప్రభుత్వం కనీసం పదివేల మంది కార్మికులను అక్కడకు పంపాలని యోచిస్తోంది. ఈ కార్మికులను నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) ఎంపిక చేస్తుంది. ఇజ్రాయెల్‌కు ఉత్తరప్రదేశ్, హర్యానాల నుండి పంపే కార్మికుల కోసం చట్టపరమైన చర్యలకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ నెల ప్రారంభంలో అన్నారు.

బీఆర్ఎస్‌లో ఆ మూడు ఎంపీ సీట్లకు ఫుల్ డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

తదితరులు పోటీ చేయాలని భావిస్తున్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచిన కొత్త ప్రభాకరరెడ్డి ఈసారి దుబ్బాక నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సంగతి తెలిసిందే. సికింద్రాబాద్ పార్లమెంటు నుంచి సీనియర్ నేత, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మెన్ రావుల శ్రీధర్‌రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ కుమారుడు సాయి కిరణ్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, సీనియర్ నేత దాసోజు శ్రావణ్ టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. ఇక్కడి నుంచి గత ఎన్నికల్లోనూ సాయికిరణ్ పోటీ చేసిన సంగతి విదితమే. ఇక దేశంలోనే అతి పెద్దదైన మల్కాజిగిరి నుంచి జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు డాక్టర్ భద్రారెడ్డి తదితరులు పోటీ చేయాలని భావిస్తున్నారు. బీఆర్ఎస్ బాస్ వీరిలో ఎవరెవరికి టిక్కెట్లను కేటాయిస్తారో వేచి చూడాల్సిందే. మరోవైపు ఈ మూడు స్థానాలు కాకుండా మిగతా 14 స్థానాల్లో పోటీ చేసేందుకు కొద్ది మంది మాత్రమే ముందుకొస్తున్నారు. అయా ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కువగా గెలవటం, క్షేత్రస్థాయిలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైతం అధికార పార్టీ వైపు చూస్తుండటంతో వాటికి డిమాండ్ కాస్త తగ్గినట్టు తెలుస్తోంది.

త్వరలో కుల గణన

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలన్నీ వేర్వేరు చోట్ల విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ హబ్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. దీంతో పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణ, మరింత మెరుగవుతుందని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవటం ద్వారా వారిలో ప్రతిభా పాటవాలతో పాటు, పోటీ తత్వం పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్ ల నిర్మాణానికి సరిపడే స్థలాలను గుర్తించాలనీ, వీలు కాకుంటే ప్రత్యామ్నాయంగా అదే సెగ్మెంట్లో మరో పట్టణం లేదా మండల కేంద్రాలను ఎంచుకోవాలని సూచించారు. ఇప్పటికే 20 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్ గా తీర్చిదిద్దే అవకాశాలుంటే పరిశీలించాలని ఆదేశించారు. వీటి నిర్మాణం, నిర్వహణకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద నిధులు సమీకరించాలని సూచించారు.

బీసీ స్టడీ సర్కిళ్లను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్ గా ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు

ఇక ఆటే మిగిలింది..

(మొదటిపేజీ తరువాయి)

మనమంతా ఇక్కడ ఉన్నామని, పార్టీకి మీరే బలమని, ప్రజల కోసమే పనిచేసే మనమంతా సంయమనంతో ఉండాలని పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. శుక్రవారం నుంచి జరుగుతున్న అధికారుల బదిలీల విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, ఏది జరిగినా మనం ప్రభుత్వంలో ఉన్నామనే విషయాన్ని గుర్తెరిగి, పరిస్థితిపై పూర్తి స్పష్టత వచ్చేంత వరకూ ఎవరూ ఎలాంటి కామెంట్లు చేయరాదని సూచించారు.

పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చూపుతాం

(మొదటిపేజీ తరువాయి)

వల్ల జిల్లాల్లో ఓటర్లు బీఆర్ఎస్‌కు దూరమయ్యారన్నారు. అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌ను ఆదరించారని చెప్పారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోట అని రుజువు చేస్తూ ఎమ్మెల్యేగా మూడోసారి మాగంటి గోపీనాథ్‌ను గెలిపించారని, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. వంద రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే, ప్రజల తరఫున పోరాటం చేసి కాంగ్రెస్ నాయకులను పరుగులు పెట్టిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటే అని, ఎంపీ సీట్లు పంచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో చేరిన విష్ణువర్ధన్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు, వనజా సంగీత, పార్టీ అన్ని డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేటీఆర్ యూసఫ్‌గూడ నుంచి తెలంగాణ భవన్ వరకు ఆటోలో వెళ్లారు. ఆటో డ్రైవర్లకు సంఘీభావం తెలుపుతూ అండగా ఉంటామని చెప్పారు.

దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యాన్ని అడ్డుకోవాలి

- వాణిజ్యపన్నుల శాఖకు సౌత్‌సేన ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ భారతదేశంలో స్థానికుల వ్యాపారాలను దెబ్బతీసేలా అనైతిక వ్యాపారం చేస్తున్న ఉత్తరాదిపై చర్యలు తీసుకోవాలని సౌత్‌సేన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఆ సంస్థ అధ్యక్షులు రవి వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, చెన్నై, త్రివేండ్రం వంటి పెద్ద నగరాల్లో వ్యాపారాలను తమ గుప్పిట్లో తీసుకొని ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా స్థానికులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది వ్యాపారులకు రక్షణ కల్పించి ఉత్తరాది వారి జీరో దందాను అరికట్టాలని కోరారు.

స్పిన్ టెస్టులో ఇంగ్లాండ్ పోరాడుతోంది. ఏకపక్షంగా ముగుస్తుందనుకున్న తొలి టెస్టులో ఇంగ్లాండ్ గట్టిగా ప్రతిఘటించింది. ఒలీ పోప్ (148 బ్యాటింగ్) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. కఠిన పరిస్థితుల్లో కెరీర్ అత్యుత్తమ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. అజేయంగా 148 పరుగులు సాధించిన ఒలీ పోప్ ఒంటిచేత్తో ఇంగ్లాండ్‌ను కష్టాల్లో నుంచి బయటపడేశాడు. 190 పరుగుల లోటు నుంచి పోరాడిన ఇంగ్లాండ్.. రెండో ఇన్నింగ్స్‌లో 126 పరుగుల ముందంజలో నిలిచింది. పోప్ పోరాటంతో ప్రస్తుతం 316/6 పరుగులు చేసిన ఇంగ్లాండ్.. మరో మరిన్ని పరుగులు జోడించటంపై దృష్టి పెట్టనుంది. మూడో రోజు ఆటలో ఇంగ్లాండ్ ఆకట్టుకున్నా.. ఉప్పల్ టెస్టు ఇప్పటికీ టీమ్ ఇండియా గుప్పిట్లోనే ఉంది. నేడు నాల్గో రోజు ఆటలో తొలి గంటలో ఇంగ్లాండ్ కథ ముగిస్తే.. ఆతిథ్య భారత్ గెలుపు లాంఛనమే!.

పోప్ పోరాటం

- అజేయ సెంచరీతో చెలరేగిన పోప్
- 126 పరుగుల ఆధిక్యంలో ఇంగ్లాండ్
- ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 316/6

భారత్ తొలి ఇన్నింగ్స్ 436/10

నవతెలంగాణ-హైదరాబాద్

ఒలీ పోప్ (148 బ్యాటింగ్, 208 బంతుల్లో 17 ఫోర్లు) అదరగొట్టాడు. 10 ఫోర్లతో 154 బంతుల్లోనే సెంచరీ బాదిన ఒలీ పోప్ కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్ నమోదు చేశాడు. ఓ ఎండ్‌లో సహచర బ్యాటర్లు స్పిన్ వలలో చిక్కుకుని విలవిల్లాడినా.. ఒలీ పోప్ స్పిన్ సవాల్‌ను బజ్‌బాల్‌తో తిప్పికొట్టాడు. అజేయ శతకంతో ఇంగ్లాండ్‌ను కష్టాల కడలి నుంచి బయటపడేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగుల లోటు అధిగమించిన ఇంగ్లాండ్..నాల్గో ఇన్నింగ్స్‌లో భారత్‌కు సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని నిర్దేశించేందుకు సిద్ధమైంది. బెన్ డకెట్ (47, 52 బంతుల్లో 7 ఫోర్లు), బెన్ ఫోక్స్ (34, 81 బంతుల్లో 2 ఫోర్లు), జాక్ క్రాలీ (31, 33 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నారు. రెండో ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి ఇంగ్లాండ్ 316 పరుగులు సాధించింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ 126 పరుగుల ముందంజలో కొనసాగుతుంది. భారత బౌలర్లలో పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (2/29), రవిచంద్రన్ అశ్విన్ (2/93), అక్షర్ పటేల్ (1/69), రవీంద్ర జడేజా (1/101) రాణించారు.



సూపర్ పోప్ : ఒలీ పోప్ (148 బ్యాటింగ్)

ఇంగ్లాండ్‌కు అదిరే ఆరంభం

రెండో ఇన్నింగ్స్‌లో సైతం ఇంగ్లాండ్‌కు అదిరే ఆరంభం లభించింది. 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటు బెన్‌స్టోక్స్ సేనపై ఒత్తిడి పెంచలేకపోయింది!. ఏ పరిస్థితుల్లోనైనా ఎదురుదాడి చేయాలనే వ్యూహం అమలు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (31), బెన్ డకెట్ (47) దంచికొట్టారు. 9.2 ఓవర్లలోనే తొలి వికెట్‌కు 45 పరుగులు జోడించారు. జాక్ క్రాలీ ఓ సిక్సర్, నాలుగు ఫోర్లతో చెలరేగాడు. ఆరంభంలో వేగంగా పరుగులు జోడించి లోటు పూడ్చే ప్రయత్నం చేశాడు. జోరుమీదున్న ఓపెనర్లకు చెక్ పెట్టేందుకు కెప్టెన్ రోహిత్ శర్మ బంతిని అశ్విన్ చేతికి అందించాడు. అశ్విన్ ఆఫ్ కట్టర్‌ను డిఫెండ్ చేయబోయిన క్రాలీ స్లిప్స్‌లో రోహిత్ శర్మకు చిక్కాడు. దీంతో ఇంగ్లాండ్ ధనాధన్ ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. మరో ఓపెనర్ బెన్ డకెట్ (47)తో కలిసి ఒలీ పోప్ (148) జోరు కొనసాగింది. ఈ ఇద్దరూ దూకుడుగా ఆడారు. దీంతో 15 ఓవర్లలో ఇంగ్లాండ్ 89/1తో నిలిచింది. క్రాలీ, డకెట్, పోప్ దూకుడుతో తొలి 15 ఓవర్లలో ఇంగ్లాండ్ బజ్‌బాల్ గేమ్‌ను చూపించింది. 5.93 రన్‌రేట్‌తో పరుగులు పిండుకుంది.

మనోళ్ల మ్యాజిక్ షో

లంచ్ విరామం అనంతరం ఇంగ్లాండ్ ఆట కట్టించారు మనోళ్లు. తొలి సెషన్లో వేగంగా పరుగులు చేసిన ఇంగ్లాండ్‌కు ముకుతాడు వేశారు. ఈ సెషన్లో ఇంగ్లాండ్ ఏకంగా నాలుగు వికెట్లు చేజార్చుకుని కష్టాల్లో కూరుకుంది. ఓ ఎండ్‌లో ఒలీ పోప్ నిలకడగా మెరిశాడు. ఆరు ఫోర్లతో 54 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. అర్థ సెంచరీకి చేరువైన బెన్ డకెట్ (47)ను బుమ్రా క్లీన్‌బౌల్డ్ చేశాడు. బుమ్రా సంధించిన లెంగ్త్ బాల్‌ను కవర్స్ మీదుగా కొట్టబోయిన డకెట్.. ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో వికెట్‌ను కోల్పోయాడు. దీంతో 68 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. డకెట్, పోప్ రెండో వికెట్‌కు 57 బంతుల్లోనే 68 పరుగులు జోడించటం విశేషం. ఈ జోడీ ఏకంగా 7.15 రన్‌రేట్‌తో టీ20 విధ్వంసం సృష్టించారు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ (2) వరుసగా రెండో ఇన్నింగ్స్‌లో తేలిపోయాడు. బుమ్రా బంతికి వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. 6 బంతుల్లో 2 పరుగులు చేసిన జో రూట్.. మూడో వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరుకున్నాడు. అప్పటికి ఇంగ్లాండ్ స్కోరు 117/3. పోప్‌కు జతకలిసిన జానీ బెయిర్‌స్టో (10) క్రీజులో కుదురుకున్నట్టే కనిపించాడు. కానీ రవీంద్ర జడేజా మాయజాలంతో జానీ బెయిర్‌స్టో కంగుతిన్నాడు. జడేజా వేసిన బంతిని ఆడకుండా బెయిర్‌స్టో వదిలేయగా బంతి నేరుగా వికెట్లను ముద్దాడింది. దీంతో బెయిర్‌స్టో కథ ముగిసింది. తొలి ఇన్నింగ్స్ హీరో బెన్ స్టోక్స్ (6)ను అశ్విన్ మాయ చేశాడు. 33 బంతులు ఆడిన స్టోక్స్‌ను అశ్విన్ అద్భుత బంతితో సాగనంపాడు. టెస్టుల్లో అశ్విన్‌ను ఏకంగా 12వ సారి అవుట్ చేసిన అశ్విన్.. ఉప్పల్‌లో అత్యుత్తమ బంతిని సంధించాడు. స్టోక్స్ నిష్క్రమించే సమయానికి ఇంగ్లాండ్ స్కోరు 163/5. అప్పటికి ఆ జట్టు మరో 27 పరుగుల తొలి ఇన్నింగ్స్ వెనుకంజలోనే నిలిచింది. టీ విరామ సమయానికి బెన్ ఫోక్స్ తోడుగా ఒలీ పోప్ అజేయంగా నిలిచాడు. 172/5తో ఇంగ్లాండ్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది.

పోప్ శతక జోరు

ఒత్తిడిలో రెట్టింపు దూకుడు చూపిస్తామని ఇంగ్లాండ్ మరోసారి రుజువు చేసింది. చివరి సెషన్లో ఒక్క వికెటే చేజార్చుకున్న ఇంగ్లాండ్ ఏకంగా 144 పరుగులు పిండుకుంది. ఒలీ పోప్ ధనాధన్ షోతో రెచ్చిపోయాడు. పది ఫోర్లతో 154 బంతుల్లో సెంచరీ సాధించిన పోప్.. ఇంగ్లాండ్‌ను మెరుగైన స్థితిలో నిలిపాడు. ఒలీ పోప్ పోరాటానికి వికెట్ కీపర్ బెన్ ఫోక్స్ (34, 81 బంతుల్లో 2 ఫోర్లు) జతకలిశాడు. ఈ జోడీ ఆరో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నమోదు చేసింది. 183 బంతుల్లో 112 పరుగులు చేసింది. ఇందులో ఒలీ పోప్ 65 పరుగులు చేయగా.. ఫోక్స్ 34 పరుగులు జోడించాడు. దీంతో ఇంగ్లాండ్ ఉప్పల్ టెస్టులో ఆధిక్యంలోకి అడుగుపెట్టింది. ప్రమాదకరంగా మారిన ఈ జోడిని అక్షర్ పటేల్ విడదీశాడు. వికెట్‌కు తక్కువ ఎత్తులో బంతిని సంధించిన అక్షర్ పటేల్.. బెన్ ఫోక్స్‌ను సాగనంపాడు. టెయిలెండర్ రెహాన్ అహ్మద్ (16 బ్యాటింగ్, 31 బంతుల్లో 2 ఫోర్లు)తో కలిసి పోప్ పోరాటం కొనసాగించాడు. పోప్, అహ్మద్‌లు ఏడో వికెట్‌కు 62 బంతుల్లో అజేయంగా 41 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 316/6 పరుగులు చేసింది. మరో నాలుగు వికెట్లు చేతిలో ఉండటంతో.. నేడు ఉదయం సెషన్లో మరో 50-100 పరుగులైనా చేయాలనే వ్యూహంలో కనిపిస్తుంది. ప్రస్తుతం 126 పరుగుల ముందంజలో నిలిచిన ఇంగ్లాండ్.. ఆతిథ్య భారత్‌కు 200 పైచిలుకు లక్ష్యం నిర్దేశిస్తే ఉప్పల్ టెస్టు మరింత రక్తికట్టనుంది.

స్కోరు వివరాలు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 246/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 436/10

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : జాక్ క్రాలీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 31, బెన్ డకెట్ (బి) బుమ్రా 47, ఒలీ పోప్ బ్యాటింగ్ 148, జో రూట్ (ఎల్బీ) బుమ్రా 2, జానీ బెయిర్‌స్టో (బి) జడేజా 10, బెన్ స్టోక్స్ (బి) అశ్విన్ 6, బెన్ ఫోక్స్ (బి) అక్షర్ 34, రెహాన్ అహ్మద్ బ్యాటింగ్ 16, ఎక్స్‌ట్రాలు : 22, **మొత్తం : (77 ఓవర్లలో 6 వికెట్లకు) 316.**

వికెట్ల పతనం : 1-45, 2-113, 3-117, 4-140, 5-163, 6-275.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 12-3-29-2, రవిచంద్రన్ అశ్విన్ 21-3-93-2, అక్షర్ పటేల్ 15-2-69-1, రవీంద్ర జడేజా 26-1-101-1, మహ్మద్ సిరాజ్ 3-0-8-0.

నిండుకుండలా స్టేడియం!

సంప్రదాయ టెస్టు క్రికెట్‌కు ఆదరణ తగ్గుతుందనే చర్చకు ఉప్పల్ టెస్టు సరికొత్త కోణం అందించింది. భారత్, ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్‌కు అభిమానులు పోటెత్తటంతో స్టేడియం నిండుకుండను తలపిస్తోంది. టెస్టు మ్యాచ్‌కు 5-10 వేల మంది అభిమానులు వస్తేనే గొప్ప అనుకుంటున్న రోజుల్లో.. రోజుకు 30 వేల మంది అభిమానులు రావటం అసాధారణం. తొలి రోజు 24000, రెండో రోజు 30,886, మూడో రోజు 30,598 మంది స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షించారు. శనివారం సెలవు కాకపోయినా.. స్టేడియం నిండిపోయింది. దీంతో హైదరాబాద్ టెస్టులో అభిమానుల హాజరు అంశంలో సరికొత్త రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా స్కూల్ స్టూడెంట్స్, భారత సాయుధ దళాల కుటుంబ సభ్యులకు ఉచిత ప్రవేశం, భోజనం సౌకర్యం కల్పించిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్.. ఉప్పల్ టెస్టు మ్యాచ్‌ను పండుగలా జరుపుతోంది. ఉప్పల్ టెస్టుకు ఈ స్థాయిలో అభిమానులు రావటంపై క్రికెట్ అభిమానులు తెగ సంబుర పడుతున్నారు.


స్టేడియం కలియతిరిగిన జగన్‌మోహన్‌రావు : హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు టెస్టు మ్యాచ్ సందర్భంగా స్టేడియం అంతా కలియతిరిగారు. ప్రతి స్టాండ్‌ను తనిఖీ చేశారు. ఆహార స్టాల్స్‌ను పరిశీలించి నిర్దేశించిన ధరల కంటే అధిక మొత్తానికి సమోసాలను విక్రయిస్తున్న వెండర్‌ను స్టేడియం నుంచి బయటకు పంపించేశారు. మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన పాఠశాల విద్యార్థులు, సాయుధ దళాల కుటుంబ సభ్యులతో కలిసి మ్యాచ్‌ను వీక్షించారు. అభిమాన క్రికెటర్ల ఆటను ప్రత్యక్షంగా చూడటం ఎలా ఉందని ఈ సందర్భంగా స్కూల్ స్టూడెంట్స్‌ను అడిగి తెలుసుకున్నారు. జవాన్ల కుటుంబాలు, స్టూడెంట్స్‌కు అందిస్తున్న ఉచిత భోజనం, త్రాగునీరు సదుపాయాల్లో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని సిబ్బందిని ఆదేశించారు.



స్కూల్ స్టూడెంట్స్‌తో కలిసి మ్యాచ్ వీక్షిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్

చాంప్ బోపన్న

- మెన్స్ డబుల్ టైటిల్ సొంతం
- టైటిల్ నిలుపుకున్న సబలెంక



మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న చరిత్ర సృష్టించాడు. ఓపెన్ శకంలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. 43 ఏండ్ల 329 రోజుల వయసులో రోహన్ బోపన్న ఆస్ట్రేలియన్ ఓపెన్ మెన్స్ డబుల్స్ విజేతగా అవతరించాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ ఎబ్డెన్ జతగా ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. 7-6(7-0), 7-5తో వరుస సెట్లలో విజయం సాధించాడు. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో సాధించిన బోపన్న, మాథ్యూ జోడి.. రెండో సెట్లో సైతం ఇటలీ జంటపై గెలుపొందింది. సిమోనె బొలెలి, ఆండ్రియలు వరుస సెట్లలో చిత్తయ్యారు. 8 ఏస్‌లు కొట్టిన బోపన్న, మాథ్యూలు ఓ బ్రేక్ పాయింట్ సాధించారు. పాయింట్ల పరంగా 80-68తో బోపన్న జోడి పైచేయి సాధించారు.



సూపర్ సబలెంక : మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ అరినా సబలెంక (బెలారస్) టైటిల్ నిలుపుకుంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన సబలెంక.. శనివారం జరిగిన టైటిల్ పోరులో చైనా స్టార్ క్విన్‌వెన్ జెంగ్‌పై విజయం సాధించింది. 6-3, 6-2తో వరుస సెట్లలోనే సబలెంక విజయం సాధించింది. జెంగ్ ఆరు ఏస్‌లు కొట్టగా.. సబలెంక మూడు ఏస్‌లు కొట్టింది. సబలెంక మూడు బ్రేక్ పాయింట్లతో జెంగ్‌ను చిత్తు చేసింది. పాయింట్ల పరంగా 62-46తో సబలెంక పైచేయి సాధించింది.

హైదరాబాద్ గెలుపు

రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్

హైదరాబాద్ : రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్ వరుసగా నాల్గో విజయం సాధించింది. అరుణాచల్ ప్రదేశ్‌తో గ్రూప్ దశ మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 187 పరుగుల తేడాతో గెలుపొందింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (366, 181 బంతుల్లో 34 ఫోర్లు, 26 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్‌తో రికార్డు ట్రిపుల్ సెంచరీ కొట్టాడు. కెప్టెన్ రాహుల్ సింగ్ (185, 105 బంతుల్లో 26 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగాడు. అభిరాత్ రెడ్డి (37), నితీశ్ రెడ్డి (12), రోహిత్ రాయుడు (12) రాణించారు. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 59.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 615 పరుగులు చేసి డిక్లరేషన్ ఇచ్చింది. తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే కుప్పకూలిన అరుణాచల్ ప్రదేశ్.. రెండో ఇన్నింగ్స్‌లో కాస్త మెరుగైంది. 53.4 ఓవర్లలో 256 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్, సాయిరామ్‌లు మూడేసి వికెట్లు పడగొట్టగా.. కార్తికేయ కక్, రోహిత్ రాయుడు రెండు వికెట్లు తీసుకున్నారు.

నవచిత్రం

ఉధిరన్.. చాలా పవర్‌ఫుల్




బాబీ డియోల్

హీరో సూర్య నటిస్తున్న తాజా మూవీ 'కంగువ'. ఈ సినిమాను భారీ నిర్మాణ విలువలతో స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్నాయి. దిశా పటానీ హీరోయిన్‌గా నటిస్తోంది. చారిత్రక నేపథ్యంతో డైరెక్టర్ శివ రూపొందిస్తున్నారు. పాన్ వరల్డ్ మూవీగా మొత్తం పది భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ఉధిరన్ అనే పవర్ ఫుల్ రోల్‌లో బాలీవుడ్ యాక్టర్ బాబీ డియోల్ నటిస్తున్నారు. శనివారం ఆయన బర్త్ డే సందర్భంగా ఈ సినిమా నుంచి ఆయన పోషిస్తున్న క్యారెక్టర్ ఉధిరన్ లుక్ రిలీజ్ చేశారు. 'రూత్ లెస్, పవర్ ఫుల్, అన్ ఫర్ గెటబుల్ ..' అంటూ ఉధిరన్ క్యారెక్టర్‌ను పరిచయం చేస్తూ బాబీ డియోల్‌కు బర్త్ డే విషెస్ చెప్పారు మేకర్స్. ఈ పోస్టర్‌లో బాబీ డియోల్ ఉధిరన్‌గా యూనిక్ మేకోవర్‌లో కనిపిస్తున్నారు. యుద్ధానికి సిద్ధమవుతున్న ఉధిరన్‌కు ఆయన వర్గం ప్రజలంతా తమ మద్దతు తెలుపుతున్నట్లు ఈ పోస్టర్‌లో కనిపిస్తోంది. విజువల్ వండర్‌గా ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు ఈ సినిమా త్వరలోనే థియేటర్స్‌లోకి రానుంది. యోగి బాబు, బాబీ డియోల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్ : నిశాద్ యూసుఫ్, సినిమాటోగ్రఫీ : వెట్రి పళనిస్వామి, యాక్షన్ : సుప్రీమ్ సుందర్, డైలాగ్స్ : మదన్ కార్కే, కథ : శివ, ఆది నారాయణ, పాటలు : వివేక్, మదన్ కార్కే, కొరియోగ్రఫీ : శోభి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఏ జే రాజా, కో ప్రొడ్యూసర్ : నేహా జ్ఞానవేల్ రాజా, ప్రొడ్యూసర్స్ : కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్.

మెప్పించే నవ్య కథ

'దొరసాని, ఏబీసీడీ, ఊర్వశివో రాక్షసివో, బేబి' వంటి విజయవంతమైన చిత్రాలతో సక్సెస్ ఫుల్ యంగ్ ప్రొడ్యూసర్‌గా టాలీవుడ్‌లో పేరు తెచ్చుకుంటున్నారు ధీరజ్ మొగిలినేని. సుహాస్ హీరోగా జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మిస్తున్న లేటెస్ట్ మూవీ 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ఈ సినిమాకు దుశ్యంత్ కటికినేని దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 2న రిలీజ్‌కు రెడీ అవుతోంది.



ధీరజ్ మొగిలినేని

ఈ సందర్భంగా నిర్మాత ధీరజ్ మొగిలినేని మీడియాతో మట్లాడుతూ, 'లాక్ డౌన్ తర్వాత డైరెక్టర్ దుశ్యంత్ నాకు ఈ సినిమా కథను డైలాగ్ వెర్షన్‌తో సహా చెప్పాడు. తన జీవితంలో జరిగిన కొన్ని రియల్ ఇన్సిడెంట్స్‌తో రాసుకున్నాడు. స్టోరీ చాలా బాగుందని అనిపించింది. ఈ సినిమా కథ ఎలా సహజంగా ఉందో అలాగే కాస్టింగ్, లొకేషన్స్ ఉండాలని ప్లానింగ్ చేసుకున్నాం. ట్రైలర్ చూసి మా సినిమాలో కులాల గురించి డిస్కషన్ ఉంటుందేమో అనుకుంటున్నారు. కానీ అలాంటిదేమీ ఉండదు. ఊరిలో జరిగే కథ కాబట్టి సహజంగా పెద్ద కులాలు, చిన్న కులాలు ఉంటాయి. అంతే గానీ ఒక కులాన్ని కించపరచడం గానీ మరో కులాన్ని గొప్పగా చూపించడం గానీ చేయలేదు. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పుడు ఇది కామెడీ మూవీ అనుకున్నారు. పాటలు రిలీజ్ చేశాక ఇది లవ్ స్టోరీ కావొచ్చని అన్నారు. ట్రైలర్ చూశాక సీరియస్ సబ్జెక్ట్ అని రివీల్ అయ్యింది. సుహాస్ 'కలర్ ఫొటో' లాంటి మూవీ చేశాడు. తన పర్ఫార్మెన్స్ ఇందులో ఎంత బాగుంటుందో స్క్రీన్ మీద చూస్తారు. అయితే ఇందులో ఎలాంటి సందేశం చెప్పడం లేదు. సుహాస్ అక్క క్యారెక్టర్‌లో శరణ్య ప్రదీప్ నటించింది. ఆమెది కథలో ఒక కీ రోల్. కథలోని ప్రధాన భాగం ఆమె క్యారెక్టర్ చుట్టూ సాగుతుంది. శరణ్య క్యారెక్టర్ ద్వారా స్టోరీలోని కొన్ని అంశాలు చెప్పాం. మా బ్యానర్‌లో ప్రస్తుతం రష్మికతో 'ది గర్ల్ ఫ్రెండ్' చేస్తున్నాం. అలాగే మరో మూడు ప్రాజెక్ట్స్ రెడీ అవుతున్నాయి' అని చెప్పారు.


ఫిబ్రవరి 15న రిలీజ్



'భ్రమయుగం' సినిమా ఫిబ్రవరి 15న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ విడుదలకు సిద్ధంగా ఉందని నైట్ షిఫ్ట్ స్టూడియోస్ తెలిపింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ చిత్ర మలయాళ వెర్షన్ ఓవర్సీస్ థియేట్రికల్ డిస్ట్రిబ్యూటర్ ట్రూత్ గ్లోబల్ ఫిల్మ్ కాగా, చిత్ర కేరళ థియేట్రికల్ డిస్ట్రిబ్యూటర్ మిస్టర్ ఆంటో జోసెఫ్ ఎఎస్ఎస్ మెగా మీడియా. నైట్ షిఫ్ట్ స్టూడియోస్ ఈనెల 26న అన్ని స్ట్రీమింగ్ ప్లాట్‌ఫార్మ్స్‌లో విడుదల చేసిన సౌండ్‌ట్రాక్‌తో చలనచిత్ర మార్కెటింగ్ ప్రచారాన్ని చురుకుగా ప్రారంభించింది. చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా షెహనాద్ జలాల్, ప్రొడక్షన్ డిజైనర్‌గా జోతిష్ శంకర్, ఎడిటర్‌గా షఫీక్ మహమ్మద్ అలీ, సంగీత దర్శకుడిగా క్రిస్టో జేవియర్, మాటల రచయితగా టి.డి. రామకృష్ణన్ పని చేశారు. మేకప్ బాధ్యతలు రోనెక్స్ జేవియర్, కాస్ట్యూమ్స్ బాధ్యతలు మెల్వీ జె నిర్వహిస్తున్నారు. 'భ్రమయుగం' అనేది మమ్ముట్టి ప్రధాన పాత్రలో రాహుల్ సదాశివన్ రచన, దర్శకత్వంలో నైట్ షిఫ్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మక నిర్మితమవుతున్న మలయాళ చిత్రం.

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

యష్ పూరి హీరోగా నటించిన కొత్త సినిమా 'హ్యాపీ ఎండింగ్'. అపూర్వ రావ్ హీరోయిన్. హమ్స టెక్ ఫిలింస్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమా హైలైట్స్‌ను దర్శకుడు కౌశిక్ భీమిడి మీడియాతో షేర్ చేసుకున్నారు.



కౌశిక్ భీమిడి

'ఒక రోజు మహాభారతం చదువుతుంటే అందులో చాలా శాపాలు గురించి తెలిసింది. ఇలాంటి శాపాన్ని ఇప్పటి జనరేషన్ కుర్రాడు ఎదుర్కొంటే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో ఈ కథ ఉంటుంది. 'విక్కీ డోనర్' లాంటి మూవీస్ ఐడియా పరంగా అడల్ట్‌గా ఉన్నా..మూవీ ట్రీట్ మెంట్ మాత్రం అందరూ చూసేలా కన్విన్సింగ్‌గా ఉంటుంది. మేము కూడా ఈ చిత్రాన్ని అలా ప్రేక్షకులంతా చూసేలా తెరకెక్కించాలి అనుకున్నాం. అలాగే ఇదొక మంచి రొమాంటిక్ డ్రామా. కథలో హీరోకు శాపం ఉంటుంది కాబట్టి అది అతనికి ట్రాజెడీ. కానీ చూసే ఆడియెన్స్‌కు మాత్రం నవ్వుకునేలా ఉంటుంది. అలాగే మా సినిమాలో రొమాన్స్ డిఫరెంట్‌గా ఉంటుంది. అయితే ఎక్కడా అసభ్యత లేకుండా ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా క్లీన్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. ఈ స్క్రిప్ట్‌కు యష్, అపూర్వ బాగా యాప్ట్ అయ్యారు. వాళ్ల పర్ఫార్మెన్స్ కూడా ఫ్రెష్‌గా ఉంటుంది. సినిమా తప్పకుండా అందర్నీ అలరిస్తుంది' అని తెలిపారు.

ప్రేక్షకులదే..ఈ అద్భుత విజయం



డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'హను-మాన్'. తేజ సజ్జ కథానాయకుడిగా ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై పతాకంపై కె నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12న విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అద్భుతంగా అలరించి, రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాటిట్యూడ్ మీట్‌ని నిర్వహించింది. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ,'ఈ సినిమాతో తేజ సూపర్ హీరో అయ్యాడు. రవితేజ 'హనుమాన్'లో భాగం అవ్వడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమాకి పని చేసిన అందరికీ పేరుపేరున ధన్యవాదాలు. అలాగే ఎన్నో క్లోజింగ్ థియేటర్స్ ఈ సినిమా వలన ఓపెన్ అయ్యాయని చెప్పడం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. మూడో వారంలో కూడా హౌస్ ఫుల్ బోర్డ్ చూడటం ఒక ఫిలిం మేకర్‌కి గొప్ప తృప్తిని ఇస్తుంది. మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్‌కి థ్యాంక్స్. హనుమాన్‌కి సంబంధించి చాలా వేడుకలు ఉండబోతున్నాయి. ప్రేక్షకులు హనుమాన్ సినిమాని ఒక దేవాలయంగా ఫీలౌతున్నారు. ప్రేక్షకులకు తెలియకుండానే సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరూ అయోధ్య రామమందిరానికి ఐదు రూపాయిలు డొనేట్ చేస్తున్నారు. ఇది నిర్మాత నిరంజన్ వలనే సాధ్యపడింది. అయోధ్యతో పాటు మిగతా ఆలయాలకు కూడా ఇవ్వడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. ఈ సినిమా ఇంకా చాలా రోజులు ఆడుతుంది. ప్రేక్షకులకు ఈ విజయాన్ని ఆపాదిస్తున్నాను. మీ అందరి ఋణం జై హనుమాన్‌తో తీర్చుకోబోతున్నాను' అని అన్నారు.

'ఈ సినిమా కోసం టీం అంతా సమిష్టిగా కృషి చేశారు. అన్నీ విభాగాలు చాలా కష్టపడి అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చారు. నిర్మాత నిరంజన్ ఈ సినిమా వెనుక కొండంత అండగా నిలబడ్డారు. మమ్మల్ని బలంగా నమ్మారు. సినిమాని ఇంత అద్భుతంగా విడుదల చేసిన పంపిణీదారులందరికీ ధన్యవాదాలు. సినిమాని అద్భుతంగా ప్రోత్సహించిన ప్రేక్షకులకు పాదాభివందనం' అని హీరో తేజ సజ్జా చెప్పారు.

హీరోయిన్ అమృత అయ్యర్, వరలక్ష్మీ శరత్ కుమార్, నిర్మాత నిరంజన్ రెడ్డి, నిర్మాత చైతన్య తదితరులు ఈ చిత్ర విజయం గురించి మరిన్ని విశేషాలను తెలియజేశారు.

ఆద్యంతం అత్యంత సహజం

కస్తూరి క్రియేషన్స్ అండ్ గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన ఈ చిత్రానికి దయానంద్ దర్శకత్వం వహించారు. మధుబాల, ఆదిత్య మీనన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది.



దయానంద్

ఈ సందర్భంగా దర్శకుడు దయానంద్ మీడియాతో మాట్లాడుతూ, 'రెగ్యులర్ కమర్షియల్ సినిమాలా కాకుండా.. అన్నీ ఉంటూనే డిఫరెంట్‌గా ఉండాలనుకున్నా. మొదటి చిత్రంతోనే నా మార్క్ ఉండేలా ప్రయత్నించాను. చచ్చిపోదాం అనుకునే వ్యక్తి జీవితంలోకి ఒక గేమ్ ప్రవేశిస్తే అతని జీవితం ఎలా మారింది అనేది సినిమాటిక్‌గా చూపించాం. ఒక్కొక్క టాస్క్ దాటుకుంటూ ముందుకు వెళ్తాడు. ఇలాంటి టాస్క్‌లు తొమ్మిది ఉంటాయి. సెకండాఫ్‌లో వచ్చే టాస్క్ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఒక ట్రోమాలోకి వెళ్ళిపోయిన వ్యక్తికి ఈ గేమ్ ఏ విధంగా హెల్ప్ చేసిందనేది మెయిన్ కాన్సెప్ట్. రా అండ్ రస్టిక్‌గా ఉంటుంది. యూత్‌ను ఎట్రాక్ట్ చేస్తూనే ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా చాలా ఉంటాయి. వాటిని టీజర్, ట్రైలర్‌లో రివీల్ చేయలేదు. మధుబాల క్యారెక్టర్ చాలా కొత్తగా, ఐకానిక్‌గా ఉంటుంది. ఆదిత్యామీనన్‌ది చాలా స్మార్ట్ క్యారెక్టర్. ఇందులో సైకలాజికల్ డాక్టర్‌గా ఆయన నటించారు. ఆయన యాక్టింగ్‌లో చాలా షేడ్స్ కనిపిస్తాయి. శుభలేఖ సుధాకర్ మరో ఇంపార్టెంట్ రోల్ చేశారు. వీరంతా సినిమాకు చాలా ప్లస్ అయ్యారు. నేహా సోలంకి పాత్ర చాలా మాసీగా ఉంటుంది. ఆమె క్యారెక్టర్‌లో చాలా సర్‌ప్రైజ్‌లు ఉంటాయి. సెకండ్ హీరోలా ఆమె పాత్ర ఉంటుంది. నిర్మాత రవి కస్తూరికి స్క్రిప్ట్ నచ్చి నాకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. క్రియేటివ్ పరంగా ఆయన నాకు చాలా సపోర్ట్ చేశారు. చాలా రియలిస్టిక్‌గా సినిమా సాగుతుంది. ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా ఇది. తక్కువ థియేటర్లో విడుదలైనా నెమ్మదిగా థియేటర్లు పెరిగే అవకాశం ఉంటుందని నమ్మకం ఉంది. ఇప్పటికే వేసిన కొన్ని ప్రివ్యూలకు మంచి రెస్పాన్స్ వచ్చింది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

న్యాయమూర్తులను తొలగించే అభిశంసన తీర్మానాన్ని ముందు ఏ సభలో ప్రవేశ పెట్టాలి?



డాక్టర్ అలీ సార్
భారత రాజ్యాంగ నిపుణులు
9494228002

1. అయోధ్యలోని వివాదాస్పద భూమి రాంలల్లా విరాజ్మాన్‌కే చెందుతుందని ఎంతమందితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది.
1. 6 2. 10 3. 4 4. 5

2. పిల్ అనే భావన భారతదేశంలో ప్రాచుర్యాన్ని కల్పించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు?
1. పి యస్ భగవతి 2. వైవి చంద్రచుడ్
3. వి.ఆర్. కృష్ణ అయ్యర్ 4. పై అందరూ

3. 49వ భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
1. ఎస్ వి రమణ 2. డి.వై. చంద్రచుడ్
3. యూ యూ లలిత్ 4. వై వి చంద్రచుడ్

4. సుప్రీంకోర్టులో న్యాయమూర్తులుగా పనిచేయని మహిళలు?
1. భానుమతి 2. రూమపాల్
3. హిమకోహ్లి 4. రమాదేవి

5. ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాలకు న్యాయ సమీక్ష అధికారం కల్పించాలని పేర్కొన్నవారు?
1. కె యం మున్షి 2. అంబేద్కర్
3. కె టీ షా 4. బాబు రాజేంద్రప్రసాద్

6. అమెరికా సుప్రీంకోర్టు ఏ కేస్ లో మొదటిసారిగా "న్యాయసమీక్ష" అనే భావనకు పునాదులు వేసింది.
1. సజ్జన్ సింగ్ Vs రాజస్థాన్
2. మార్బురి Vs మడిసిన్
3. కామన్ కాస్ కేస్ 4. ఏదీకాదు

7. శాసన శాఖ శాసనాలు, కార్యనిర్వాహక శాఖ యొక్క పరిపాలన చర్యలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే దానిని ఈక్రింది విధంగా పేర్కొంటారు?
1. అమికస్ క్యూరి 2. అల్ట్రా వైర్స్
3. ఇంట్రా వైర్స్ 4. ఎక్స్ట్రా వైర్స్

8. క్రింది ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మొదటిసారిగా న్యాయస్థానాలకు న్యాయ సమీక్ష అధికారం తొలగించబడింది.
1. 25వ రాజ్యాంగ సవరణ
2. 43వ రాజ్యాంగ సవరణ
3. 42వ రాజ్యాంగ సవరణ
4. 44వ రాజ్యాంగ సవరణ

9. భారతదేశంలో న్యాయవ్యవస్థ పితామహుడిగా ఎవరిని అంటారు?
1. కారన్ వాలిస్ 2. విలియం బెంటింగ్
3. లార్డ్ మెకాలే 4. లార్డ్ మిటో

10. రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం ఏర్పడిన తొలి సుప్రీం కోర్టులో న్యాయమూర్తులు.
ఎ. హెచ్ జె కానియా బి. ఛాంబర్లీన్
సి. లేమియోస్టార్ డి. హైడ్
1. ఎ, డి, సి 2. బి, సి, డి
3. ఎ, బి, సి 4. ఎ, బి, సి, డి

11. ఫెడరల్ కోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి.
1. సర్ ఎలిజ ఇంఫె 2. మౌరిస్ గ్వయర్
3. పాట్రిక్ స్పెన్స్ 4. హెచ్ జె కానియా

12. ఫెడరల్ కోర్టు స్థానంలో ప్రస్తుత సుప్రీం కోర్టు ఏ సంవత్సరంలో ఏర్పాటు అయ్యింది?
1. 1947 2. 1935
3. 1950 4. 1952

13. న్యాయవాదిగా పనిచేసి నేరుగా సుప్రీంకోర్టుకు న్యాయమూర్తి అయిన రెండవ తెలుగు వారు?
1. లావు నాగేశ్వరరావు 2. ఎస్ వి రమణ
3. కొక సుబ్బారావు 4. పీ యెస్ నరసింహ

14. 127వ నిబంధన ప్రకారం తాత్కాలిక న్యాయమూర్తులు గరిష్టంగా ఎంతకాలం పదవిలో వుంటారు?
1. 3 సంవత్సరాలు 2. 1 సంవత్సరం
3. 4 సంవత్సరాలు 4. 2 సంవత్సరాలు

15. న్యాయమూర్తులను తొలగించే తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టాలంటే ఎంత మంది సభ్యుల మద్దతు ఉండాలి.
1. 10 2. 50 3. 100 4. 25



16. న్యాయమూర్తుల తొలగింపు తీర్మానాన్ని సభ అధ్యక్షులు ఆమోదించి విచారణ కమిటీకి ఆదేశిస్తారు. ఈ కమిటీలో ఎంతమంది ఉంటారు?
1. 5 2. 3 3. 4 4. 6

17. క్రింది వాటిలో సరైనది/ సరైనవి గుర్తించండి.
1. సుప్రీంకోర్టు రాజ్యాంగానికి సంరక్షణ కర్తగా పనిచేస్తుంది.
2. ప్రజలు కానీ ప్రభుత్వం కానీ పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తే సుప్రీంకోర్టు సంరక్షిస్తుంది.
3. ఎ మరియు బి 4. పై ఏదీకాదు

18. సుప్రీంకోర్టు అధికార పరిధి విస్తరింపజేసే అధికారం..
1. రాష్ట్రపతి 2. రాజ్యసభ
3. పార్లమెంట్ 4. కొలీజియం

19. కోర్టు తనకు తాను స్వతహాగా కేసులను విచారించడాన్ని ఏమని అంటారు.
1. అమికస్ క్యూరి 2. కోర్టు ఆఫ్ రికార్డ్
3. పిల్ 4. సుమోటో కేస్

20. అంతర్జాతీయ న్యాయస్థానం ప్రధాన కార్యాలయం ఎక్కడ కలదు.
1. జెనివా 2. వాషింగ్టన్
3. రోమ్ 4. దిహెగ్

21. కేరళ రాష్ట్ర మంత్రిగా పనిచేసి సుప్రీంకోర్టు న్యాయ మూర్తిగా నియామకం అయిన ఏకైక వ్యక్తి ఎవరు?
1. సుభాష్ రెడ్డి 2. వి. ఆర్. కృష్ణ అయ్యర్
3. కె.జి. బాలకృష్ణన్ 4. భగవతి

22. సుప్రీంకోర్టుకు తపాలా శాఖ ప్రత్యేక పిన్‌కోడ్ ను ఏ సంవత్సరం కేటాయించింది?
1. 2013 2. 2015
3. 2005 4. 2021

23. ఇటీవల కాలంలో సుప్రీంకోర్టుకు న్యాయమూర్తిగా నియామకం అయిన జె కె మహేశ్వరి ఏ రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు?
1. ఆంధ్రప్రదేశ్ 2. తెలంగాణ
3. గుజరాత్ 4. కర్ణాటక

24. ఇటీవల కాలంలో సుప్రీంకోర్టుకు న్యాయమూర్తిగా నియామకం అయిన హిమకోహ్లి ఏ రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.
1. సిక్కిం 2. తెలంగాణ
3. గుజరాత్ 4. కర్ణాటక

25. ఇటీవల కాలంలో సుప్రీంకోర్టుకు నియామకం అయిన తొమ్మిది మంది న్యాయమూర్తులలో ఎంతమందికి 2027లో ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం కలదు.
1. 1 2. 2 3. 3 4. 4

26. సుప్రీంకోర్టులో ఇప్పటివరకు ప్రధాన న్యాయ మూర్తులుగా పనిచేసిన తెలుగువారు?
1. 1 2. 3 3. 4 4. 2

27. డివై చంద్రచూడ్ సుప్రీంకోర్టుకు ఎన్నవ ప్రధాన న్యాయమూర్తి?
1. 50 2. 49 3. 48 4. 47

28. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి పదవి విరమణ తరువాత రాష్ట్రపతిగా పోటీచేసి ఓడిపోయిన వారు?
1. కోక సుబ్బారావు 2. హిదయతుల్లా
3. గజేంద్ర గడ్కర్ 4. ఎస్ఎమ్ సిక్రీ

29. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన రెండవ తెలుగువారు ఎవరు?
1. లావు నాగేశ్వరరావు 2. కొక సుబ్బారావు
3. సుభాష్ రెడ్డి 4. యస్ వి రమణ

30. క్రింది వాటిలో సరైన వాటిని గుర్తించండి.
1. రాజ్యాంగ సవరణలను విచారించే అధికారం హైకోర్టుకు లేదు
2. రాజ్యాంగ సవరణలకు విచారించే అధికారం సుప్రీంకోర్టుకు కలదు
3. 1 మరియు 2 4. ఏదీ కాదు

31. హైకోర్టు ఇచ్చిన తీర్పులపై సుప్రీంకోర్టు అప్పీళ్ళను విచారించే అధికారం కలదు. అయితే హైకోర్టు అనుమతి అవసరం ఒకవేళ హైకోర్టు అనుమతి నిరాకరిస్తే ఏ నిబంధన ప్రకారం ప్రత్యేక అనుమతి వివాదాల రూపం లో అప్పీళ్ళను స్వీకరిస్తుంది.
1. 131 2. 142 3. 136 4. 222

32. భారత రాజ్యాంగంలో 132వ నిబంధన దేనిని తెలియజేస్తుంది.
1. రాజ్యాంగ పరమైన వివాదాలు
2. క్రిమినల్ వివాదాలు
3. సివిల్ వివాదాలు 4. పైవన్నీ

33. ఇప్పటి వరకు అభిశంసన తీర్మానం ద్వారా ఎంతమంది న్యాయమూర్తులు తొలగించబడ్డారు?
1. 2 2.1 3. 3 4. తొలగించబడలేదు

34. న్యాయమూర్తుల తొలగింపు తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశ పెట్టాలంటే ఎంతమంది సభ్యుల మద్దతు ఉండాలి.
1. 50 2. 100 3. 10 4. 20

35. 121వ రాజ్యాంగ సవరణ బిల్లుపై రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు?
1. 31.12.2014 2. 13.4.2015
3. 8.12.2014 4. 10.13.2014

36. న్యాయమూర్తుల నియామకం విషయంలో ప్రధాన న్యాయమూర్తి సలహాను రాష్ట్రపతి పాటించవలసిన అవసరం లేదని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?
1. మొదటి జడ్జెస్ కేసు 2. రెండవ జడ్జెస్ కేసు
3. మూడవ జడ్జెస్ కేసు 4. ఏదీకాదు

37. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌లో ఎంత మంది ఉండేవారు?
1. 4 2. 6 3. 8 4. 10

38. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ ఎప్పటి నుండి అమల్లోకి వచ్చింది.
1. 13.4.2015 2. 8.12.2014
3.10.13.2014 4. 31.12.2015

39. న్యాయమూర్తుల సంఖ్యను చివరిసారిగా 31 నుండి 34 కు ఏ సంవత్సరంలో పెంచారు?
1. 2021 2. 2019
3. 2009 4. 2018

40. న్యాయవాదిగా పనిచేసి నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఐన తొలివారు?
1. కులదీప్‌సింగ్ 2. సంతోష్ హెగ్డే
3. యస్ యమ్ సిక్రీ 4. ఎవరు కాదు

41. ఫెడరల్ కోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినవారు?
1. యస్ వరదాచారి 2. మౌరిస్ గ్వయర్
3. లేమియోస్టార్ 4. పై ఎవరూ కాదు

42. ఫెడరల్ కోర్టు ఏ సంవత్సరం నుండి అమల్లోకి వచ్చింది?
1. 1726 2. 1935
3. 1937 4. 1950

43. ఫెడరల్ కోర్టు చివరి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
1. పాట్రిక్ స్పెన్స్ 2. వరదాచారి అయ్యర్
3. మౌరిస్ గ్వయర్ 4. హెచ్ జె కానియా

44. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించింది ఎవరు?
1. న్యాయశాఖ మంత్రి
2. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
3. రాష్ట్రపతి
4. ప్రధానమంత్రి

45. 2002లో రాజ్యాంగ పున:సమీక్ష కమిషన్ న్యాయ మూర్తుల పదవి విరమణ వయసు ఎంతకు పెంచాలని సిఫార్సు చేసింది.
1. 68 2. 70 3. 66 4. 67

46. క్రింది వాటిలో సరైంది గుర్తించండి.
1. ప్రధాన మరియు ఇతర న్యాయమూర్తుల నెలసరి వేతనం 280000
2. పదవీకాలంలో వీరి జీతభత్యాలు తగ్గించరాదు
3. 1 మరియు 2 4. ఏదీకాదు

47. అంతర్జాతీయ న్యాయస్థానం న్యాయమూర్తుల పదవీకాలం?
1. 9 సంవత్సరాలు 2. 10 సంవత్సరాలు
3. 5 సంవత్సరాలు 4. 6 సంవత్సరాలు

48. క్రింది వాటిలో న్యాయ సమీక్షకు అవకాశం లేని అంశాలను గుర్తించండి.
1. కేంద్రమంత్రి మండలి రాష్ట్రపతికి సలహాలు ఇవ్వడం
2. రెండవ షెడ్యూల్‌లో పేర్కొన్న జీతభత్యాలు
3. పార్లమెంట్ కార్యక్రమాలు 4. పైవన్నీ

49. న్యాయమూర్తులను తొలగించే అభిశంసన తీర్మానాన్ని ముందు ఏ సభలో ప్రవేశ పెట్టాలి?
1. లోక్‌సభ 2. రాజ్యసభ
3. లోక్‌సభ లేదా రాజ్యసభ 4. పై ఏదీకాదు

50. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ గారి నాన్నగారు అయిన వైవి చంద్రచూడ్ సుప్రీంకోర్టుకు ఎన్నవ ప్రధాన న్యాయమూర్తి?
1. 13వ 2. 14వ 3. 15వ 4. 16వ

సమాధానాలు

1.4	2.4	3.3	4.4	5.1
6.2	7.3	8.3	9.1	10.2
11.2	12.3	13.4	14.4	15.3
16.2	17.3	18.3	19.4	20.4
21.2	22.1	23.1	24.2	25.3
26.4	27.1	28.1	29.4	30.3
31.3	32.1	33.4	34.1	35.1
36.1	37.2	38.1	39.2	40.3
41.1	42.3	43.4	44.2	45.1
46.2	47.1	48.4	49.3	50.4

పదోన్నతులకు టెట్ అర్హతపై ప్రభుత్వం పునరాలోచించాలి



జుర్రు నారాయణ యాదవ్
9494019270

"ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లుంది" విద్యా హక్కు చట్టం ఉపాధ్యాయ పదోన్నతులకు టెట్ తప్పనిసరి చేయటం.విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్ సి టి ఈ)నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు పదోన్నతి పొందాలంటే టెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ విషయంపై టెట్లో అర్హత సాధించిన కొంతమంది ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణత సాధించాలని విద్యాశాఖ నిర్ణయించడంతో వేలాది మంది ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. ఎప్పుడో 20, 25 సంవత్సరాల క్రితం పాఠశాల ఉపాధ్యాయులుగా నియమించబడ్డ వారు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందాలంటే ఈ వయసులో టెట్ రాసి ఉత్తీర్ణత సాధించడం సాధ్యమౌతుందా?

ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ప్రభావం

ఉపాధ్యాయులు పదోన్నతి పొందాలంటే టెట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలనే విద్యా శాఖ నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 19వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం 2012 డి ఎస్ సి,2017 టిఆర్‌టి ద్వారా నియామకమైన సుమారు 20వేల మంది ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ అర్హత ఉంది. ఇప్పటికే సుమారు పది వేల మంది ఉపాధ్యాయులు టెట్ పాసై ఉండవచ్చు. మొత్తంగా 30 వేల మంది ఉపాధ్యాయులు మాత్రమే టెట్‌లో అర్హత కలిగి ఉన్నారు. సుమారు ఒక లక్ష మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయలేదు.టెట్ అర్హత నేపథ్యంలో పదోన్నతుల ప్రక్రియ వాయిదా వేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమౌతుంది. దాని వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు నష్టపోతారు. అలా అని టెట్ అర్హత గల వారితోనే పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తే సీనియర్ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయి, సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తూ పదోన్నతులు లేకుండానే రిటైర్డ్ అవుతారు.

విద్యాశాఖ తాత్సర్యం

ప్రధానోపాధ్యాయుల, ఇతర శాఖలలో పదోన్నతుల కోసం జీఓటి, ఈఓటి లాంటి శాఖాపరమైన పరీక్షలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు.అదే మాదిరి విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చినప్పటి(2010) నుంచే ఉపాధ్యాయ పదోన్నతులకు కూడా టెట్ తప్పనీసరి చేస్తూ అమలు చేసి ఉంటే ప్రారంభంలోనే ఉపాధ్యాయులు దానిపై దృష్టి పెట్టి పరీక్షలు రాసి పాస్ అయ్యి ఉండేవారు.2010లోనే ఎన్ సి టి ఇ ఈ నిబంధనలు అమలులోకి తెచ్చింది. 2012,2017 ఉపాధ్యాయ నియామకాల్లో ఈ నిబంధనలు అమలు చేసిన విద్యాశాఖ పదోన్నతిలో కూడా ఎందుకు అమలు చేయలేదు?. విద్యాహక్కు చట్టం ప్రకారం పదోన్నతిలో టెట్ తప్పనిసరి కావడంతో 2015 లోపు ఉత్తీర్ణులు కావాలని కేంద్రం గడువు ఇచ్చింది. అయినా ఆ దిశగా విద్యాశాఖ చర్యలు ఎందుకు తీసుకోలేదు?. కేంద్రం మరొకమారు ఐదు సంవత్సరాల గడువు పెంచుతూ 2019 వరకు ఉత్తీర్ణులు కావాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయిన అప్పుడెందుకు విద్యా శాఖ అమలు చేయలేదు?.

ఎన్ సి టి ఇ గెజిట్ నోటిఫికేషన్ 23-8-2010 పేరా 4 ప్రకారం అప్పటికే ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో మినహాయింపు ఇవ్వవచ్చుGO MS no 36 dt 23-12-2015 ప్రకారం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వబడింది.కానీ ఇప్పుడు టెట్ ఉంటేనే పదోన్నతులకు అర్హులు అని నిర్ణయించడం ఎంతవరకు సమంజసం. గత తొమ్మిది సంవత్సరాలుగా పదోన్నతులు లేక నిరాశతో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైన ఈ సందర్భంగా టెట్ తప్పనిసరి అని నిర్ణయిస్తే వెంటనే వారు ఎలా అర్హత సాధిస్తారు?.ఈ చర్య వల్ల సుమారు దశాబ్ద కాలంగా పదోన్నతులకోసం ఎదురు చూస్తున్న వేలాది మంది ఉపాధ్యాయుల ఆశల్లో నీళ్ల చల్లినట్లు కాదా? 44 సంవత్సరాలు దాటిన వారికి టెట్ రాసే అర్హత లేదు. కాబట్టి



20,25 సంవత్సరాల సర్వీస్ ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు ఇప్పుడు తమ సబ్జెక్ట్ కాకుండా ఇతర సబ్జెక్ట్‌ను ఎలా ప్రిపేర్ కాగలరు. టెట్ అర్హత లేకుండా పదోన్నతి ఇవ్వని పక్షంలో ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతి కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలి. సాధారణంగా నిర్వహించే టెట్‌లా కాకుండా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు వారు బోధించబోయే సబ్జెక్టునీ, బోధన అనుభవాన్ని, బోధన మెలకువలను పరీక్షించే విధంగా సులభతరంగా ఉండేటట్లు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

సుమారు 20,25 సంవత్సరాలు ఉపాధ్యాయ వత్తిలో ఉన్న ఉపాధ్యాయులకు వారి బోధన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని,ఈ వయసులో వారికి ఉన్న బరువు, బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని 45 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులకు పదోన్నతిలో టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలి.

ప్రత్యేక టెట్ అవసరం

ప్రస్తుతం బిఈడి అభ్యర్థులు వ్రాస్తున్న టెట్‌లో ఉపాధ్యాయులు అర్హత సాధించడం కొంత కష్టం. ఎందుకంటే ఉపాధ్యాయులు పదోన్నతి పొందే సబ్జెక్టులో తప్పనిసరిగా డిగ్రీ లేదా తత్సంబంధ అర్హత సాధించి ఉంటారు. కొందరైతే పీజీ అర్హత సాధించి ఉంటారు. టెట్‌లో ఆ సబ్జెక్టులో ఎంత కఠినమైన ప్రశ్నలు అడిగిన సమాధానాలు వ్రాయగలరు. కాబట్టి సులభంగానే టెట్ పాస్ కాగలరు. కానీ బీఈడీ అభ్యర్థులు వ్రాస్తున్న టెట్‌లో అడుగుతున్న ప్రశ్నలు విచిత్రంగా ఉన్నాయి. సాంఘిక శాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయులకు టెట్‌లో తెలుగు పరిజ్ఞానాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. జీవశాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయులు టెట్లో గణిత సంబంధ ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది.గణిత శాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయుడు టెట్లో జీవ శాస్త్ర సంబంధ ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. 20,25 సంవత్సరాల సర్వీస్ ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు ఇప్పుడు తమ సబ్జెక్ట్ కాకుండా ఇతర సబ్జెక్ట్‌ను ఎలా ప్రిపేర్ కాగలరు.టెట్ అర్హత లేకుండా పదోన్నతి ఇవ్వని పక్షంలో ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతి కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలి. సాధారణంగా నిర్వహించే టెట్‌లా కాకుండా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు వారు బోధించబోయే సబ్జెక్టునీ, బోధన అనుభవాన్ని, బోధన మెలకువలను పరీక్షించే విధంగా సులభతరంగా ఉండేటట్లు ప్రత్యేక టెట్ నిర్వహించాలి. ఇంకా అవసరమైతే జీ ఓ టి,ఈ ఓ టి మాదిరి చూసి రాసే పద్ధతిలో టెట్ నిర్వహించాలి.

పదోన్నతుల ప్రక్రియ కొనసాగించాలి

పదోన్నతులకు టెట్ తప్పనిసరి అని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునర్ సమీక్షించాలి. కోర్టు తీర్పుల వలన మధ్యలో నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను కోర్టు ప్రత్యేక అనుమతితో నిర్వహించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కోర్టు అనుమతి ఇవ్వని పక్షంలో కనీసం పదోన్నతులు పొందిన తరువాత మూడు సంవత్సరాల లోపు టెట్ పాస్ కావాలనే షరతుపై పదోన్నతుల ప్రక్రియ కొనసాగించాలి.ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపంలో ఉన్నందున పదోన్నతుల తర్వాతనే కొత్త డీఎస్సీ నిర్వహిస్తే మెగా డీఎస్సీ కి సాధ్యం అవుతుంది. కాబట్టి 2010 కన్న ముందు ఉపాధ్యాయులుగా నియామకం అయిన వారికి టెట్ నిబంధన లేనందున ఉపాధ్యాయల పదోన్నతుల్లో కూడా టెట్ నిబంధన వర్తింపకుండా చట్టంలో ఉన్న మినహాయింపులను ఉపయోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభ్యర్థనతో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పదోన్నతిలో టెట్ అర్హత మినహాయింపుకు అనుమతి తీసుకోవాలి.లేదా టెట్ రాయడానికి అర్హత కూడా 44 సంవత్స రాలే కాబట్టి ప్రభుత్వం ఇన్ సర్వీస్‌లో ఉండి 45 సం"రాలు దాటిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. లేదా పదోన్నతుల ప్రక్రియను కొనసాగిస్తూ 3 సంవత్సరాల్లో అర్హత సాధించాలనే నిబంధన మేరకు పదోన్నతులు చేపట్టాలి. ప్రభుత్వం ఏదో ఒక పరిష్కారం ద్వారా ఇటు ఉపాధ్యాయులకు, అటు నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

వేదిక

'గ్రామీణ విద్యార్థులకు అందని ద్రాక్షగా ఐఐటీలు'



పాకాల శంకర్ గౌడ్
9848377734

ప్రపంచస్థాయి ఇంజనీరింగ్ సాంకేతిక విద్యకు చిరునామాగా భారతీయ ఐఐటీలు బాసిల్లుతున్నాయి. భవిష్యత్తు తరాలకు కావాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో భారతీయ ఐఐటీల పాత్ర ప్రముఖమైనది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకి సీఈఓలని దేశానికి రాజకీయ నాయకులను, శాస్త్రవేత్తలను, ఇంజనీర్లను, అధికారులను అందించిన ఘనత ఐఐటీలకే దక్కుతుంది.1940 సంవత్సరంలో నలిని రంజన్ సర్కార్ అధ్యక్షతన 22 మంది నిపుణులతో కూడిన కమిటీ భారత దేశవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇంజనీరింగ్ విద్యను విద్యార్థులకు అందించే విద్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. స్వాతంత్ర్యనంతరం 1950 మే 15 న దేశంలో మొట్టమొదటి ఐఐటి హిజ్లి డిటెన్షన్ క్యాంప్ ఖరగ్పూర్, పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటు చేశారు. దీనిని భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 18 ఆగస్టు 1951లో ప్రారంభించారు.

నలిని రంజన్ సర్కార్ ప్రతిపాదన మేరకు దేశవ్యాప్తంగా నాలుగు ఐఐటీలను బాంబే, మద్రాస్, కాన్పూర్, ఢిల్లీలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 15 సెప్టెంబర్ 1956లో భారతదేశపు మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ జాతి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రపంచస్థాయి విద్యాలయాలు దేశంలో ఏర్పాటు చేయాలని పార్లమెంటులో చర్చించి చట్టం చేశారు. మన ఐఐటీలలో చదివి ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారిలో సుందర్ పిచాయ్, ఎన్ఆర్ నారాయణమూర్తి, సచిన్ బన్సాల్, పరాగ్ అగర్వాల్ అరవింద్ కృష్ణ రాజా సుబ్రహ్మణ్యం వంటి ప్రముఖులు, రాజకీయ నాయకుల్లో అజిత్ సింగ్ మనోహర్ పరికర్, జయరాం రమేష్ అలోక్ అగర్వాల్ జయంత్ సిన్హా అరవింద్ క్రేజీవాల్‌లు ఉన్నారు. ప్రస్తుతం భారతదేశంలో 23 ఐఐటీలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఐఐటీ కౌన్సిల్ సారథ్యంలో ఇవి పనిచేస్తాయి. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో రూ. 9661.50 కోట్లను ఐఐటీల కోసం కేటాయించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఐఐటీలకు కేంద్ర బడ్జెట్లో అధికంగా నిధులు కేటాయించి పరిశోధన రంగాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

ఈ ఐఐటీలలో కేవలం 17385 మంది విద్యార్థులు మాత్రమే విద్యను అభ్యసించే అవకాశం ఉంది. ప్రతిష్టాత్మకమైన ఈ ఐఐటీలలో చేరడానికి విద్యార్థులు ఐఐటి జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణతతో పాటు ఉన్నత మార్కులు సాధించాల్సి ఉంటుంది. భారతదేశంలో అత్యధిక మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారు. గత సంవత్సరం 11,13,325ల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. దీన్నిబట్టి ఐఐటీలో సీట్ కోసం విద్యార్థుల మధ్య పోటీ ఏ స్థాయిలో ఉంటుందో అవగతమవుతుంది.దేశవ్యాప్తంగా నిర్వహించే పోటీ పరీక్షల్లో అత్యంత కఠినమైన పోటీపరీక్షగా జేఈఈ అడ్వాన్స్ మెయిన్లను చెప్పుకోవచ్చు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పరీక్షల్లో జేఈఈ అడ్వాన్స్ పోటీ పరీక్ష రెండవ స్థానంలో ఉండడం విశేషం. గత దశాబ్ద కాలంలో కేవలం 7 ఐఐటీలను మాత్రమే కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయడం గమనార్హం. జూన్ 2023లో భారత ప్రభుత్వము, టాంజానియా ప్రభుత్వం కలిసి భారతదేశం వెలుపల మొట్టమొదటి ఐఐటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇది ఐఐటి మద్రాస్‌కు సాటిలైట్ క్యాంపస్‌గా ఉండనుంది.

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగి దేశంలో భారతదేశం గుర్తింపు పొందింది. అత్యధిక జనాభాకు సరిపడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, నూతన ఆవిష్కరణలను అందించాల్సిన బాధ్యత ఐఐటీలపై ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఐఐటీలను పెంచాల్సిన ఆవశ్యకత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. భారతదేశంలో అత్యంత నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించడంలో ఐఐటీలు ప్రతిసారి ముందుంటున్నాయి. 2023 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో అత్యున్నత ఇంజనీరింగ్ విద్యను అందించే కళాశాలల్లో మొదటి పది స్థానాల్లో 8 ఐఐటీలకే దక్కాయి. మొదటి మూడు ర్యాంకుల్లో ఐఐటి మద్రాస్, ఐఐటి బాంబే, ఐఐటి ఢిల్లీ ఉన్నాయి. ఐఐటి కాన్పూర్‌లో చదివిన విద్యార్థికి సంవత్సరానికి రూ. 4 కోట్ల జీతం వచ్చిందంటే ఐఐటి విద్యార్థులపై కార్పొరేట్ కంపెనీలకు ఉన్న ఆసక్తిని మనం అర్థం చేసుకోవచ్చు. ఐఐటీలలో చదివే విద్యార్థుల సరాసరి జీతం సంవత్సరానికి 30 నుండి 40 లక్షల వరకు ఉంటుంది. అందుకే ఐఐటీలకి అంత క్రేజీ.

గత కొన్ని సంవత్సరాలలో ఐఐటీల్లో చేరే విద్యార్థుల పరిశీలిస్తే 95శాతం మంది విద్యార్థులు కోచింగ్ తీసుకున్న వారు మాత్రమే ఐఐటీలలో చేరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులకి దేశంలోని అత్యంత నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అందని ద్రాక్షగా ఉంది. ఉన్నత వర్గాల పిల్లలకు మాత్రమే ఐఐటి విద్య అందుతుందనే విమర్శ కూడా ఉంది. కోచింగ్ సెంటర్లలో లక్షలు వెచ్చిస్తే గాని విద్యార్థులు ఐఐటీలలో చేరే అవకాశం లేదు. దేశవ్యాప్తంగా వేల సంఖ్యల్లో ఐఐటీ కోచింగ్ సెంటర్ వెలవడం వాటిలో విద్యార్థుల కోచింగ్ కోసం తల్లిదండ్రులు లక్షల్లో ఖర్చు చేయడం జరుగుతుంది. విద్యార్థుల పై మానసిక ఒత్తిడి కూడా అధికంగా ఉంటుంది. 'పేద విద్యార్థులకు ఐఐటీలలో చేరడం ఒక కలగానే మిగిలి పోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ప్రభుత్వ ఆధీనంలోనే విద్యార్థులకు ఐఐటి జేఈఈ కోచింగ్ సెం టర్లు ఏర్పాటు చేసి అత్యున్నత ప్రతిభగలిగిన విద్యార్థులకు అవకాశాలు కల్పించేలా చేయడం ఆవశ్యకం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు లబ్ధిపొందే అవకాశముంది. సామాన్యులకు కూడా ఐఐటీలలో సీటు పొందే అవకాశముంది.

గత కొన్ని సంవత్సరాలలో ఐఐటీల్లో చేరే విద్యార్థుల పరిశీలిస్తే 95శాతం మంది విద్యార్థులు కోచింగ్ తీసుకున్న వారు మాత్రమే ఐఐటీలలో చేరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువు కుంటున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులకి దేశంలోని అత్యంత నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అందని ద్రాక్షగా ఉంది. ఉన్నత వర్గాల పిల్లలకు మాత్రమే ఐఐటి విద్య అందుతుందనే విమర్శ కూడా ఉంది.



1953 నుండి ఇప్పటివరకు భారతదేశంలోని ఐఐటీలలో చదివిన వారు దాదాపుగా 25 వేల మంది అమెరికాలో స్థిరపడ్డారని సమాచారం. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం మీద వలస జరుగుతుంది. భవిష్యత్ భారత్ ప్రపంచంలోనే అత్యున్నత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలంటే ఈ మేదో వలసల్ని నివారించాల్సి ఉంది. నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ రీసెర్చ్ -2023 ప్రకారం మొదటి 100 మంది టాప్ ర్యాంకర్లలో 62 శాతం, 1000 ర్యాంకర్లలోపు 36శాతం మంది వేరే దేశాలకు వలస వెళుతున్నారు. భారతదేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన ఐఐటీలను ఏర్పాటు చేయాలి. మేదో వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి కమిటీ ఐఐటి కౌన్సిల్, యుజిసి చైర్మన్, ఐఎస్ఐఆర్ చైర్మన్ ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలి.